సాహిత్య

# ప్రస్థానం

ఏప్రిల్ 2010

వెల రూ. 10

జయభేరి

నేను సైతం
ప్రపంచాగ్నికి
సమిధ నొక్కటి ఆహుతిచ్చాను!

నేను సైతం
విశ్వవృష్టికి
అశ్రువొక్కటి ధారపోశాను!

నేను సైతం
భువనఘోషకు
వెర్రిగొంతుక విచ్చి మ్రోశాను!

x x

ఎండకాలం మండినప్పుడు
గబ్బిలం వలె
క్రాగిపోలేదా?

వానకాలం ముసిరి రాగా
నిలువు నిలువున
నీరు కాలేదా?

శ్రీశ్రీ



## శ్రీశ్రీ శతజయంతి సమాప్తి

సాహితీ స్రవంతి



ఫొటో: తవ్వా ఓబుల్‌రెడ్డి

సాహిత్య
ప్రస్థానం
సంపుటి : 9 | ఏప్రిల్ 2010 | సంచిక : 52

# పునఃప్రస్థానం!

**ఈ** ఏప్రిల్ 30వ తేదీతో మహాకవి శ్రీశ్రీ శతజయంతి ఉత్సవాలు సమాప్తం కానున్నాయి. సరిగ్గా ఏడాది కిందట ఎన్నికల ముగింపు, ఓట్ల లెక్కింపు మధ్య రోజున సాహితీ స్రవంతి రాజధానిలో శతజయంతి సభలను ప్రారంభించింది. ప్రస్థానం ప్రత్యేక సంచికగా వెలువడి రెండు ముద్రణలు పొందింది. శ్రీశ్రీ సాహిత్యం సమకాలీనత పుస్తకం కూడా నెలరోజుల్లోనే పునర్ముద్రణ అవసరమైంది. రాష్ట్రంలోని దాదాపు అన్ని జిల్లాలలోనూ ప్రధాన కేంద్రాలలో సభలూ సమావేశాలూ జరిగాయి. అన్ని ప్రగతి శీల సంస్థలూ ఇతర సాహిత్య సంస్థలూ కూడా ఆయన వారసత్వాన్ని చాటిచెప్పే పని చేశాయి. అనుభవజ్ఞులైన సాహిత్య కారుల నుంచి ఔత్సాహికుల వరకూ ఈ కార్యక్రమంలో పాలుపంచుకుని మహాకవికి జేజేలు పలికారు. శ్రీశ్రీ కవిత్వాన్ని జీవిత సందేశాన్ని మననం చేసుకున్నారు. ఇది మహాప్రస్థాన కవి పునఃప్రస్థానం. ఇందులో పాలు పంచుకున్న వారందరూ అభినందనీయులు. స్వల్ప మైన తేడాలున్నా శ్రీశ్రీ వారసత్వ స్ఫూర్తిని అందరూ అందిపుచ్చుకోవడం హర్షణీయం. బహుశా మరే ఇతర ఆధునిక తెలుగు కవి, రచయిత కన్నా శ్రీశ్రీ పట్ల ఎక్కువ స్పందన రావడానికి ప్రజలతో ఆయన మమేకతే కారణమనడం నిస్సందేహం.

శతజయంతి సమాప్తి మాసంలో బహుశా మరింత విస్తృతంగా ఇది జరగాలి. సాహిత్య సదస్సులు, గోష్టులుతో పాటు సాహితీ స్రవంతి శ్రీశ్రీ జీవిత సాహిత్యాలను సమగ్రంగా చిత్రించే పుస్తకంతో పాటు మరికొన్ని ప్రచురణలు కూడా తీసుకురానున్నది. ఇవి కూడా మీ ఆదరణకు పాత్రమవుతాయని ఆశిస్తూ ఏప్రిల్ నెలను పూర్తిగా శ్రీశ్రీ శతజయంతి ముగింపు కార్యక్రమాలపై కేంద్రీకరించాలని ప్రస్థానం పిలుపునిస్తున్నది.

............

అనివార్య కారణాల వల్ల గతంలో వాయిదా పడిన ప్రస్థానం ప్రత్యేక సంచిక శ్రామిక వర్గ దినోత్సవమైన మేడే సందర్భంగా వెలువడుతుంది.ఇందుకు పాఠకులు రచయితలు శ్రేయోభిలాషులు, అడ్వర్టయిజర్ల నుంచి సహకారం కోరుతున్నాం.

**కవర్‌పై శ్రీశ్రీ ఫొటో: సీనియర్ ఫొటోగ్రాఫర్ జి.ఎన్. భూషణ్**

**బొమ్మలు : శేఖర్, శివాజీ, లక్ష్మీనారాయణ, వెంకటేష్**

## ఈ సంచికలో...

| | |
|---|---|
| దాడి (కథ) | 2 |
| కవిత | 6 |
| శ్రీశ్రీ యుగమా? ప్రజా కవిత్వ యుగమా? | 7 |
| శ్రీశ్రీ జాబులు | 10 |
| కవిత | 13 |
| వల (కథ) | 14 |
| కవిత | 15 |
| మూసీ గట్టున (కథ) | 16 |
| తెలుగులో భాషోద్యమాలు-పత్రికల పాత్ర | 19 |
| కవిత | 23 |
| వాతావరణాన్ని కాదు వ్యవస్థను మార్చాలి | 24 |
| మతోన్మాదం విషం విరజిమ్ముతూనే వుంది | 27 |
| సమకాలీన కథావలోకనం | 30 |
| ఆర్తిని నింపే కథలు | 31 |
| 'శతాబ్దాల నిశ్శబ్దం' నవల్లో గ్రామీణ స్త్రీలు | 33 |
| గుండెను తట్టి లేపే కవిత్వం | 35 |
| సాగర తీరాన కావ్యసుధా మధురం | 36 |
| కొత్త పుస్తకాలు | 38 |
| డైరీ | 41 |

సంపాదకవర్గం
తెలకపల్లి రవి (సంపాదకుడు)
కె.ఆనందాచారి
ఎ.సత్యభాస్కర్
వొరప్రసాద్
ఎం.నరహరి
కె. లక్ష్మయ్య, మేనేజర్

చిరునామా
సాహిత్య ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-500 020,
ఫోన్ : 27660013, 9490099059
ఫ్యాక్స్, 040-27635136,
ఇ.మెయిల్ : Prasthanam_ss@yahoo.co.in

కథ

# దాడి

ఎమ్.వి.జె.భువనేశ్వరరావు



***విమానాశ్రయం నుండి సరాసరి హోటల్‌కి వచ్చేశారు శర్మగారు.. రాత్రి ఎనిమిదయింది. వెంటనే స్నానం.. డ్రస్ వేసుకోవటం కానిచ్చేసి.. అదే హోటల్‌లో దిగువన ఉన్న కాన్ఫరెన్స్ హాల్‌లో జరుగుతున్న 'అక్షయ కాటన్స్' బిజినెస్ మీటింగ్‌కి హాజరయ్యారు.***

శర్మగారు ఆరడుగుల ఎత్తున్న బలాఢ్యుడైన మనిషి... ఎత్తుకు తగిన దృఢమైన శరీరం కావటంతో ఏ డ్రస్ వేసినా.. ఆయనకి అందంగానే ఉంటుంది. స్ఫురద్రూపి కావటం కూడా అదనపు ఆకర్షణయింది. శర్మగారు మాట్లాడుతుంటే కంచు మ్రోగినట్లుంటుంది. ఆయనకి ఆధ్యాత్మిక చింతనా ఎక్కువే. దైవికమైన భావనలతోనే ఆయన జీవితంలోని ప్రతి సంఘటనా ముడిపడి ఉంటుంది. హిందూ మతమన్నా, భారతీయతన్నా ఆయనకి ఎనలేని ఇష్టం. ఆ రెండు అంశాలకూ సంబంధించి ఆయన విపరీతమైన మానసికానందాన్నీ, సంతృప్తినీ పొందుతూ ఉంటారు.

అక్షయ కాటన్స్ బిజినెస్ మీటింగ్‌లో వేదికపై నుండి శర్మగారు అనర్గళంగా మాట్లాడటం మొదలు పెట్టేరు.

"వస్తు విపణిలో పోటీ ఎక్కువైంది... వస్త్ర వ్యాపారంలో నిలబడగలిగే 'ఉత్పాదన'ను తయారు చేయటం సులువే. కాని ఏ రకమైన ఉత్పాదన వినియోగదార్లను విపరీతంగా ఆకర్షిస్తుందో ఊహించటమే కష్టం. అలా కచ్చితంగా చెప్పగలిగితే, మనకున్న సాంకేతిక పరిజ్ఞానంతో, నాణ్యమైన మేలు రకపు ఉత్పాదనలను రూపొందించగలం. అందుకని విపణి పరిశోధనా విభాగాన్ని మనం ముందుగా నిర్మించుకోవాలి..."

సమావేశ మందిరమంతా చప్పట్లతో మార్మోగింది... పత్రికా విలేఖరులూ, ఇతర ఉద్యోగులూ శర్మగారిని చుట్టుముట్టారు. వారందరితో ఓపిగ్గా ముచ్చటించి, పదవగానే అందరితోపాటు, శర్మగారు కూడా అక్కడి నుండి నిష్క్రమించారు.

◆◆◆

టీవీ చూస్తూ... మంచంపై జారగిలబడ్డారు శర్మగారు. ప్రయాణ బడలిక వలన కనురెప్పలు భారంగా వాలిపోసాగాయి. రిమోట్ సాయంతో టీవీని ఆఫ్ చేశారు. కళ్లు మూసుకోగానే అనుకోకుండా ఓ స్త్రీ రూపం ప్రత్యక్షమైంది...

శర్మ గారు హోటల్‌లోనికి ప్రవేశిస్తున్నప్పుడు... కంటెస్సా కారు అద్దాలలో నుండి కన్పించిన అందమైన పడతి సుందర రూపమది... ముంతాజ్ అంత అపురూపంగా... ఠీవిగా కారులో వెనక సీట్లో కూర్చొనుంది... గులాబీ రెమ్మల్ని అందంగా పేర్చినట్లు ఆమె చెక్కిళ్లు సుకుమారంగా ఉన్నాయి... మరో మోనాలీసాలా చక్కని పెదాలపై నవ్వును అదృశ్య ఆభరణంలా ధరించిన ఆమె, శర్మగారి మనోఫలకంపై ముద్రపడిపోయింది... ఆ జ్ఞాపకాలతో శర్మగారు ప్రశాంతంగా నిద్రలోకి జారుకున్నారు..

◆◆◆

పెద్ద కుదుపు లాంటి ప్రేలుడుతో శర్మగారు మంచం మీది నుండి దిగ్గున లేచారు.. కలా.. నిజమా అని అనుమానమొచ్చింది.. తుపాకీ గుళ్ల మోతలు... బాంబు ప్రేలుళ్లు అంతకంతకు ఎక్కువవుతున్నాయి... అవెక్కడో దూరంలో కాకుండా అతిసమీపంలోనే సంభవిస్తున్నట్లుగా తోస్తోంది...

శర్మగారి శరీరమంతా భయం ఆవహించింది...

ఒళ్లంతా ఒక రకమైన గగుర్పాటుతో.. వెంట్రుకలు నిక్కబొడుచుకుంటున్నాయ్...

ప్రేలుళ్ల కన్నా భీకరంగా.. మరింత పెద్ద శబ్దంతో ఆ వెనువెంటనే ఆర్తనాదాలు, హాహాకారాలు విన్పిస్తున్నాయి... వివిధ రకాల భాషలు, మాండలికాల్లో అవి వెలువడుతున్నా అవన్నీ సహజసిద్ధమైన మానవ



April 2010 pages _25.03.2010.pmd 2 3/27/2003, 6:34 PM

మృత్యుఘోషలా శర్మగారి చెవులను తాకుతోంది....

గది నుండి బయటకు వెళ్తే.. విషయమేమిటో తెలుస్తుందనిపించింది... గబగబా లేచి మంచం మీది నుండి కాలు క్రింద పెట్టారు..

మరో కాల్చివేత.. మరీ దగ్గరలోనే జరిగినట్లుగా తోచింది.. శర్మగారి మనసు కీడు శంకించింది.. ఊహాజనితమైనదీ జరగకూడనిదేదో అక్కడ జరుగుతున్నట్లుగా అన్పించి, అతనికి విపరీతమైన భయమేసింది.. అంతటితో అక్కడి నుండి బయటకు వెళ్లాలనే ఆలోచనను తాత్కాలికంగా విరమించి, గది లోపలి గడియ గట్టిగా వేయబడిందో లేదోననే అనుమానంతో పరీక్షగా చూసి.. తలుపుకు అడ్డంగా.. కూర్చొనే సోఫాను పెట్టాలని... శక్తిమేర ఈడ్చుకెళ్లి... ఆ ప్రయత్నంలో సఫలీకృతులయ్యారు...

ఆందోళనగా ఉన్నప్పుడు భయంతో చేసే చిన్న పనైనా ఎంతో కష్టంగా ఉంటుంది.. ఆ మాత్రం ప్రయాసకే శర్మగారికి ఆయాసం ముంచుకొొచ్చింది.. నడుం కూడా కొంచెం బిగుసుకున్నట్లుగా ఇబ్బందిగా అయింది...



ఇంత చేసినా శర్మగారిలో 'ధీమా'గా ఉండగలిగే ధైర్యం లేకుండా పోయింది...

మెదడు మొద్దుబారి పోయినట్లుగా.. చురుకైన ఆలోచనలు లేని భాగమయిపోయింది...

చుట్టూ ప్రేలుళ్లు.. ఆర్తనాదాలూ అంతకంతకు ఎక్కువై పోతున్నయ్...

భయం రెట్టింపై... రిసెప్షన్‌కు ఫోన్ చేశారు...

నో రిప్లయ్...

శర్మగారు జీవితంలో తొలిసారిగా 'ప్రాణభీతి'తో వణికిపోసాగారు... కాని తనను తాను కాపాడుకోవటం ఎలా?...

బయట అలజడి అంతకంతకూ ఎక్కువవుతోంది...

మరొొక్కసారి ప్రయత్నించి చూద్దామని... రిసెప్షన్‌కి ఫోన్ చేశారు...

మరల నో రెస్పాన్స్..

శర్మగారి గుండె వేగం హెచ్చింది...

తర్వాతేం జరగబోతుందో భగవంతుడికి మాత్రమే తెలియాలి... ప్రస్తుతం ఆందోళన లేకుండా ఉండగలిగే శక్తి కావాలి... తక్షణం రిలాక్సవ్వాలి.. మరో ఆలోచన లేకుండా టీవీ ఆన్ చేశారు.. అర నిమిషంలో ఆరు ఛానల్స్ మార్చారు. కావాల్సిన ప్రోగ్రాం కోసం వెతుక్కుంటూ !... స్క్రోలింగ్‌లో వస్తోన్న 'న్యూస్' చూడగానే.. శర్మగారి భ్రుకుటి ముడివడింది... చివరి రక్తపు బొట్టుదాకా భయం ఆవహించింది... అనుకొన్నంతా అయింది..

"ఉగ్రవాదుల దాడి"– శర్మగారిలో సన్నగా వణుకు ప్రారంభమైంది.. సమీపంలో ఎక్కడో కాదు... సాక్షాత్తు శర్మగారు విడిది చేసిన హోటల్‌పైనే!... గది గదికీ వెళ్లి.. బయటకు పిలిచి మరీ.. తుపాకీతో కాల్చి చంపుతున్నారు.. అని ఆ వార్త సారాంశం...

శర్మగారి అరికాళ్లు సగభాగం స్వేదంతో తడిసిపోయాయి...

నిజానికి అతని శరీరమంతా ముచ్చెమటలు పోశాయి..

సరిగ్గా అదే సమయంలో తలుపులు గట్టిగా బాదిన శబ్దమైంది.. శర్మగారు దీర్ఘాలోచనలో మునిగిపోయారు..

ఏం చెయ్యాలి?...

తలుపు తియ్యాలా? వద్దా?..

నిముషాలు క్షణాల్లా దొర్లుతున్నాయ్..

తలుపులు తడుతున్న శబ్దం మరింత ఎక్కువైంది..

శర్మగారిలో చలనం లేదు..

"భయ్యా.. దర్వాజా ఖోల్‌దో... మైఁ అకేలీ హూఁ... అగర్ కోయీ ఆగయాతో ముఝే మార్ దేగా..." ఓ స్త్రీ మాటలు... భయంకరంగా చెవులను తాకాయ్..

ఆమె మరణం అంచున ఉన్నట్లుగా శర్మగారికి అర్థమైంది..

ఆమె అరుపులు మరింత భయంకరంగా మారాయి..

శర్మగారిలో ఏదో తెలీని ధైర్యం తన్నుకొొచ్చింది. అసంకల్పిత ప్రతీకార చర్యలా.. తలుపుకడ్డంగా వున్న సోఫాను ప్రక్కకి నెట్టి.. తలుపు తెరచి..ఓ చేత్తో ఆమెను బలంగా లోపలికి లాగి.. లిప్తపాటు సమయంలో తలుపును మూసి.. లోపలి గడియను గట్టిగా బిగించి.. సోఫానడ్డంగా పెట్టేశారు.. సల్వార్ కమీజు, నల్లని బురఖా ధరించిన ఆమె ఎదురుగా నిలబడి ఉంది.. ఆమె ఆగకుండా ఏడుస్తోంది.. కన్నీరు మున్నీరుగా విలపిస్తోంది.. ఆ దుఃఖానికి అంతేలేకుండా పోయింది..

శర్మగారు మౌనంగా సోఫాలో కూర్చున్నారు..

బయట మారణహోమం కొనసాగుతూనే ఉంది..

ఆర్తనాదాలు, పొలికేకలూ అంతకంతకూ ఎక్కువవుతూనే ఉన్నాయ్..

శర్మగారు రెండు రకాల ఇబ్బందులతో సతమతమవసాగారు.

ఒకటి– గది బయట దుండగులు సృష్టిస్తున్న భయోత్పాతం.

రెండు–అపరిచితురాలైన స్త్రీ వలన ప్రమాదం ముంచుకొస్తుందేమోనన్న భయం..

తలుపు గొళ్లెం వేసుండటం వలన తాత్కాలికంగా బయటినుండి ముంచుకొొచ్చే తక్షణ ప్రమాదమేమీ లేదు..

ఇక నిర్ధారించుకోవాల్సింది.. లోపలున్న స్త్రీ వలన ఏదేని భయముందేమోనన్న విషయం..

శర్మగారీ సంఘర్షణతో బాధపడుతుండగా–గదిలోని ఫోన్ రింగయింది.. ఆతృతగా వెళ్లి ఫోనందుకున్నారు శర్మగారు.. "సార్.. మేం రిసెప్షన్ నుండి మాట్లాడుతున్నాం.. విదేశీ తీవ్రవాదులు మన హోటల్‌పై దాడి చేశారు.. విచక్షణారహితంగా గదుల్లో ఉన్నవార్నీ కాల్చి చంపుతున్నారు.. అందువలన మేం మరలా చెప్పేవరకూ ఎవరైనా తలుపు తట్టినా.. కాలింగ్ బెల్ కొట్టినా తలుపులు తెరవొద్దు.. కొన్ని గదుల ఫోన్‌లైన్లు, కరెంట్ లైన్లు కట్ చేశారు.. అందువలన విద్యుత్తు



April 2010 pages _25.03.2010.pmd 3 3/27/2003, 6:34 PM

ఆగిపోయినా, ఫోన్ పనిచేయకపోయినా భయపడొద్దు.. రక్షణ ఏర్పాట్లు జరుగుతున్నాయ్.. జాగ్రత్తగా ఉండండి...” ఫోన్ కట్ అయింది..

శర్మగారు బురఖా ఆమె వేపు చూసి.. మరలా తల త్రిప్పుకొన్నారు.. ఆమె ఏడుపింకా ఆపలేదు..

అది ఆమె మానసిక రోదనే అయినా.. శర్మగారికి చాలా ఇబ్బందిగా అన్పిస్తోంది.. సాధారణంగా ఎవరైనా బాధలో ఉంటే శర్మగారికి కూడా దుఃఖం వస్తుంది... చేతనైనంత సహాయం చేయాలని పరితపిస్తారు.. కాని భారతదేశంపై దాడి చేసే వ్యక్తులకు సంబంధీకురాలేమోనన్న కోపంతో ఉన్న ఆయనకు ఆమెను చూస్తే చిర్రెత్తుకొస్తోంది..

ఆయన వైఖరేమీ ఆమెకు అర్థం కావటం లేదు..

ఆమెను తీవ్రంగా దండించటం ద్వారా – ఆ దేశం పోకడలపై ఉన్న అసంతృప్తిని, అశాంతిని ప్రతీకారంతో చల్లార్చుకోవచ్చని ఆయన భావనగా ఉంది..

అయోమయంగా ఆమె శర్మగారినే చూడసాగింది..



రక్షణ ఇచ్చినవాడు భక్షణ చేయడులేయన్న ధీమా ఆమెది.. భయంతోనో... బాధతోనో దుఃఖిస్తున్నా గాని ఆమె స్థైర్యాన్ని మాత్రం కోల్పోలేదు..

ఆమె ధీమా– శర్మగారిలో కలవరంతోపాటు కోపాగ్నిని రగిలిస్తోంది.. ఒక నిర్ణయానికొచ్చిన శర్మగారు “తుమ్ కో క్యా హువా.. క్యోఁ రోతే హో...” ఆమె వేపు తిరిగి ప్రశ్నించాడు...

ఆమె నిశ్చలంగా ఉంది..

కొన్ని క్షణాలు.. నిశ్శబ్దంగా దొర్లిపోయాయి..

మరొక్కసారి ఆమె కళ్లనిండా దుఃఖపు కన్నీరు నిండిపోయింది.. తడిసిన కళ్లతో ఆమె చెప్పనారంభించింది..

“భయ్యా.. మైఁ పాకిస్తాన్ సే ఆయీ... హూఁ... మేరీ బచ్చీకీ హార్ట్ ఆపరేషన్ కరవానే కేలియే యహాఁ తక్ ఆకే యే హోటల్ మే రూమ్ లియే థే.. లేకిన్ యే లోగ్ మేరీ బచ్చీకో మార్ డాలా.. ఇస్‌లియే రోతీ హూఁ”

శర్మగారికిదేం నమ్మశక్యంగా అన్పించలేదు..

ఆమె పొరుగుదేశం నుండి వచ్చిందని తెలిసే సరికి ఆయనలో పౌరుషం మరింత పెరిగింది.. అనారోగ్యంతో ఉన్న వారికి భారతదేశపు వైద్యులు తమ ప్రతిభా ప్రావీణ్యాలతో ప్రాణాలు పోస్తుంటే.. వారేమో ప్రతీక్షణం భారతీయుల ప్రాణాల్ని తీయటానికే నిరంతరం ప్రయత్నిస్తున్నారు...

శర్మగారికి పొరుగుదేశంపై నాటుకొని వున్న ద్వేషపూరితమైన కోపాన్ని– ఆమెను బాధించటం ద్వారా వెల్లడి చేయాలని ఉంది.. రుధిరపు ఉష్ణోగ్రత తీవ్రమైన జ్వరపు ఉష్ణోగ్రతను మించిపోయింది.. కాని నిస్సహాయ స్థితిలో ఉన్నట్లుగా గోచరిస్తున్న ఓ స్త్రీమూర్తిని వేదనకు గురిచేయటానికి తన సంస్కారం అడ్డొస్తోంది..

అతిథులను దేవుడితో సమానంగా గౌరవించే రక్తమున్న దేశములో పుట్టి, తద్విరుద్ధముగా ప్రవర్తించే ప్రయత్నం చేయటం శర్మగారికి సుతరామూ ఇష్టం లేదు..

మరోసారి ఫోన్ రింగయింది..

ఆలోచనలకు అడ్డుకట్టవేసి, ఫోనెత్తారు శర్మగారు..

ఆ ఫోన్ శర్మగారి ఇంటి నుండి వచ్చింది..

“ఏమండీ.. ఎలా ఉన్నారండీ.. ఎక్కడ ఉన్నారండీ.. మీకేం కాలేదుగా..” శర్మగారి భార్య విలపిస్తూ అడుగుతోంది..

ఒక్క క్షణం పాటు శర్మగారు మౌనం వహించారు.. అనవసరంగా కుటుంబ సభ్యులను ఒత్తిడిలోనికి నెట్టటం మంచిది కాదనిపించి.. “నేనక్కడ లేను సుమతీ.. బహుశా హోటల్‌పై జరిగిన దాడి గురించి విని, నువ్వు భయపడుతున్నావేమో.. సరే.. నువ్వెలా ఉన్నావు?” శర్మగారడిగారు.

తుఫాకీ మోతలు పెరుగుతున్న శబ్దాలు విన్పిస్తున్నాయ్..

“మీరు నాతో అబద్ధం చెప్పటం లేదు కదా.. ఆ హోటల్‌లో ఉంటే మాత్రం చాలా ప్రమాదమైపోయుండేది.. ఉగ్రవాదులు... మన ప్రక్కనే ఉన్న శత్రుదేశం నుండే వచ్చారట.. గదిగదికీ వెళ్లి.. కాలింగ్ బెల్ కొట్టి.. బయటకు పిలిచి మరీ కాల్చి చంపుతున్నారట.. మనదేశంపై మన జాతిపై జరిగిన దాడిగా దేశమంతా ఆవేశంతో ఊగిపోతున్నారు.. రక్షణ శాఖ రంగంలోకి దిగింది.. క్షేమంగా అందర్నీ ప్రాణాలతో తీసుకొస్తామని ప్రతిజ్ఞ చేసింది.. టీవీలో అంతా చూపిస్తున్నారు..” శర్మగారి జవాబు ఆమెలో ధైర్యాన్ని నూరిపోయటంతో.. సావధానంగా అన్ని విషయాలు చెప్పనారంభించింది సుమతి..

విధ్వంసపు ధ్వనులు వీనులను తాకుతుండడంతో, ఫోన్ ద్వారా సుమతికి చేరుతాయేమోనని భయమేసి, “సమావేశం జరుగుతోంది.. ఉంటా సుమతీ..” అని చెప్పి ఫోన్ పెట్టేశారు శర్మగారు..

భారతదేశపు జాతీయతపై దాడిని తనలాంటి వారందరిపై దాడిగా కాకుండా, తనొక్కడిపై జరిగిన దాడిగానే శర్మగారికి ఆవేశం ముంచుకొస్తోంది..

ఉగ్రవాదుల దాడికి సమాధానం క్రూరమైన హింసతో ప్రపంచానికి చాటాలన్పిస్తోంది శర్మగారికి.

శర్మగారి గుండె పగిలేంత ఆవేశంతో నిండిపోయింది..

“ఈ దుర్మార్గులనెలా మార్చాలి.. బస్సుయాత్రలు, రైలు యాత్రలు చేసినా మారరు.. వారి ఎడల స్నేహ పూర్వకంగా ఉన్నా మారరు.. యుద్ధంలో ఓడిపోయినా మారరు... దయతలచి భూభాగాన్ని వదిలేసినా మారరు... వారిపట్ల సహృదయంతో మెలగినా మారరు.. వారితో క్రికెట్ ఆడి, ఓడిపోయినా మారరు. గెలిచినా మారరు.. వారి మతస్థులను వారికన్నా బాగా చూసుకున్నా మారరు.. వారి వైఖరేంటో చెప్పరు.. చెప్పినా చెప్పింది చేయరు.. పాశవికమైన దాడులతో వారి ఉనికిని చాటి చెప్తుంటారు.. వీరినెలా మార్చాలి.. వీరిలో మానవత్వ భావనలను



April 2010 pages _25.03.2010.pmd 4 3/27/2003, 6:34 PM

ఎలా పెంపొందించాలి? అపకారానికి ఉపకారం చేస్తే వీళ్లు మారతారా? దెబ్బకు దెబ్బ తీస్తే వీరు మారతారా?.. ఆయుధాలు, అణుబాంబులు వీళ్ల వద్ద పిచ్చోడి చేతిలోని రాళ్లలా తయారయ్యాయి..” శర్మగారి కోపం కట్టలు తెంచుకొంది..

“కుక్క కాటుకు చెప్పు దెబ్బ”– వీరికిలాగే బుద్ధి చెప్పాలి..

“రోతీ హూ.. కిస్‌లియే రోతీ హూ... ఆపకా దేశ్‌కీ లోగ్ హమారే లోగోంకో మార్ రహేహైఁ... ఇస్ దేష్‌కే తుమ్‌కో ఆనందాశ్రు నికల్ రహే హై.. హమ్‌కో పాగల్ బనా వే రహేహో.. తుమ్‌కో ఛోడేగా నహీ.. తుమ్ క్యోఁ మేరీ కమరే మేఁ గుస్సీ.. బతావో.. జల్దీ బతావో...”

శర్మగారి ఒక్కొక్క మాట.. ఆమెలోని బాధను మరింతగా పెంచుతోంది..

“భయ్యా.. మైఁ అపనా జాన్ బఛానే కో.. తుహ్మరే కమరే మేఁ ఆయా.. జాన్ లేనో కో నహీఁ...” ఆమె ఏడుపు రెట్టింపైంది..

మరలా తలుపులు తట్టిన చప్పుడైంది..

“దర్వాజా ఖోల్‌నా.. తుమ్ లోగోంకో.. అబీ మార్ దేగా..” బయట నుండి కేకలు విన్పిస్తున్నాయ్..



శర్మ గారి కోపం కట్టలు తెంచుకొంది..

“హే.. దుష్ట్... ఇంతజార్ కరో.. హమారే జవాన్ లోగ్ ఆ రహే హైఁ.. ఎయిసా ఛిపాకే నహీఁ.. సామ్‌నే ఆకే లఢానా హై.. యహ్ ధీర్ పురుష్ కే లక్షణ్ హై...'' వారికి విన్పించేట్టుగా శర్మగారు గట్టిగా చెప్పారు.. బురఖా వేసుకున్నామె ఒక్క ఉదుటున అడుగు వేసి.. శర్మగారి నోరు మూసేసింది..

శర్మగారు నిశ్చేష్టులై అలాగే ఉండి పోయారు...

“సాలా.. తుమ్‌కో ఛోడేగా నహీఁ.. దర్వాజా నహీ ఖోల్‌నే సే బాంబ్ ఫేంక్‌కే తుమ్‌కో మార్‌దేగా..” బయట నుండి వస్తూన్న సవాళ్లు శర్మగారిని మరింత రెచ్చగొట్టాయ్...

బలవంతంగా ఆమెను పక్కకు నెట్టేశారు..

“హే.. మూర్ఖ్.. ” శర్మగారు కేక వినీ వినగానే ఆమె లేని బలాన్ని కూడగట్టుకొని... అతన్ని బలవంతంగా లాగి, మంచంపై తోసేసింది..

“భయ్యా.. నారోస్ నహీ హోఁనా,. తుహ్మరా నారాజ్ కో మైఁ సమఝ్ సక్‌తా హూఁ.. హమారే దేశ్‌మే సబీ లోగ్ ఆటంక్ వాదీ నహీఁహైఁ.. అచ్చే అచ్చే కళాకార్ హౌఁ.. సైంటిస్ట్ హైఁ... పండిత్ హైఁ... పరోపకారీ లోగ్ హైఁ.. గరీబీ కే కారణ్ కుచ్ లోగ్ ఎయిసే ఆటంక్ వాదీ బన్ జాతే హైఁ.. పొలిటీషియన్స్, మిలిటరీ లోగ్ హమారీ గరీబీ సే.. ఎయిసే ఫాయిదా ఉటాత్ హైఁ.. ఆప్ కో ఏక్ సత్య్ బతాతీ హూఁ.. వే లోగ్ ఇసే హోటల్ మేఁ.. ముఝ్ ఛోడ్‌కే మేరీ పతీ, బచ్చీకో మార్ డాలా.. వే లోగ్ క్యా బోలా మాలూమ్ హై? తుహ్మరే జైసే లోగ్ ఇలాజ్ కే లియో ఇండియా ఆ రహే హైఁ .. ఇసీ కే కారణ్, అపనీ దేశ్‌కీ ఇజ్జత్ ఔర్ మహనతా చలీ జా రహే హై..

ఆమె మాటల్లో నిజాయితీని వెదకనారంభించారు శర్మగారు..

“ఇండియాకే జితనీ డిఫెన్స్ బడ్జెట్ హై... ఉస్ మే ఆదా భాగ్, హమారీ దేశ్ కీ గరీబీ కో హటావే కౌలియే ఖర్చ్ కరనేసే హీ.. జ్యాదా ఫాయిదా హోగా.. దునియాకో భీ ఉపకార్ మిల్‌గీ...” ఆమె ఆవేశంలో ఆలోచన కన్పిస్తోంది..

శర్మగారిలోని ‘వివేచన’ మేల్కొనటం ప్రారంభించింది.. గది కిటికీల్లో నుండి రక్షణ శాఖ గార్డులు సాయుధులై.. కాంతివంతమైన టార్చ్‌లైట్‌తో వెలుగులు ప్రసరింపజేస్తూ.. మైక్‌లో చెప్తున్నారు.. “కిటికీలు తెరచి మీరు బయటకు రావటాన్కి సన్నద్ధమైనట్లుగా మాకు తెలియజేయండి.. మేం మిమ్మల్ని రక్షిస్తాం...”

శర్మగారిలో ధైర్యం మరింత పెరిగింది..

గది తలుపులు బద్ధలయ్యాయి..

సాయుధులైన దుండగులు గదిలోనికి ప్రవేశించారు..

శర్మగారిని వెతుకుతున్నాయి వారి కళ్లు !...

బురఖా వేసుకున్నామె శర్మగారిని పూర్తిగా తన శరీరంతో మూసేసింది..

ఏం జరగబోతుందో శర్మగారికర్థం కాలేదు..

“మార్‌నా తుమ్‌కో జరూరీ హైతో ఫహలే ముఝే మార్‌దో.. ఇన్‌కో మారియే మత్..” శర్మగారి శరీరంలోని ఏ భాగమూ కనిపించకుండా కప్పేస్తూ చెప్పిందామె..

తుపాకీతో ఉగ్రవాదులు ఆమెని కాల్చివేయటం..

రక్షణ దళాలు కిటికీలో నుండి ఉగ్రవాదుల్ని కాల్చి పారేయటం వెనువెంటనే జరిగిపోయాయి.. రక్తపు మడుగులో ఉన్న ఆమె –అచేతనంగా శర్మగారిపై వాలిపోయింది. “భయ్యా.. హమ్ జాన్ బచానే వాలేఁ హూఁ... జాన్ లేనే వాలే నహీఁ.. ఆటంక్ వాద్ గరీబీసే ఉత్పన్ హోతే హై...” ఆమె చివరి మాటలు తూటాల్లా శర్మగారి గుండెలో నాటుకొన్నాయి..

గబగబా లేచి.. ఆమెను ప్రక్కకి తొలగించి.. ప్రథమ చికిత్స చేద్దామని.. బురఖాను వెనక్కి లాగారు..

రాత్రి రెండు దాటుతోంది.. శర్మగారికి ఏడుపు మరింతగా పెల్లుబికింది.. తన ప్రాణాన్ని కాపాడటాన్కి ఆమె ప్రాణాన్నే బలిదానమిచ్చింది. శర్మగారు ఆ ఉదయం హోటల్‌లోనికి ప్రవేశిస్తున్నప్పుడు కంటెస్సా కారులో ఎదురొచ్చిన అందమైన స్త్రీమూర్తే ఆమె!... దేశాలు వేరైనా.. మానవత్వమొకటేయని చాటి చెపుతూ.. ప్రాణాన్నే కానుకగా మిగిల్చింది.. శర్మగారి ఏడుపుకు హద్దే లేకుండా పోయింది..

“బెహన్.. ముఝే మాఫ్ కర్‌నా...”

ప్రాణం లేని ఆ శరీరాన్ని ఒడిలో వేసుకొని కన్నీరు మున్నీరుగా విలపించసాగారు.. శర్మ గారు!...

**(అంతర్జాతీయ బహుమతి పొందిన శ్రీ పాలగుమ్మి పద్మరాజు కథానిక ‘గాలివాన’ ప్రేరణతో..... – రచయిత)**

■



April 2010 pages _25.03.2010.pmd 5 3/27/2003, 6:34 PM

## కవిత

# తప్పిపోయిన వాణ్ణి గురించి

డా॥ చల్లా రవికుమార్



ఎవరో ఒకాయన తప్పి పోయాడిక్కడ
నీకూ నాకూ తెలిసిన వాడే
నిన్నూ నన్నూ ఎరిగినవాడే
అయినా హఠాత్తుగా కనిపించడం మానేసాడు
ఏమైపోయాడతను
ఎక్కడికి వెళ్లివుంటాడు

ఇదివరకటి రోజుల్లో కూడా
చీకటి గుహలోకి
వెలుగురేఖ విచ్చుకోకుండా మాయమై పోయేవాడు
ఎక్కడ చూసినా దొరికేవాడు కాదు
ఎప్పుడూ ఏదో వెతుకుతున్నట్టు తిరిగేవాడు

ఆఖరికి షేర్ మార్కెట్‌లోనో
బీరుషాపులోనో
హఠాత్తుగా ప్రత్యక్షమయ్యేవాడు
ముఖంలో దిగులు, చూపుల్లో వెతుకులాట
ఏం పోగొట్టుకుని ఉంటాడతను.

అతను
అందరికీ సుపరిచితుడైన అపరిచితుడు
అనవసరపు హడావిడికీ ప్రతిరూపం
అతని
మొహంలో భావం మనమెప్పుడూ కనిపెట్టలేదు
అతను
సుఖానికీ దుఃఖానికీ అతీతుడా!
అతను బుద్ధుడా?
లేక బుద్ధిలేని వాడా
ఏ ఉద్వేగాలు లేని అతనికి
ఉద్విగ్నతే జీవన కేంద్రం
ఐనా
అప్పుడప్పుడూ అతను
అమ్మలాలి పాటలు, కోతి కొమ్మచ్చి ఆటలు
తలచుకొని కంటతడి పెట్టేవాడు
నిష్కల్మషంగా ప్రియురాలిపై
పెంచుకున్న ముంచెత్తిన మోహం
అతని కళ్లల్లో మెరుస్తుండేది
కొన్ని సెకన్లైనా జీవితం
సెంటిమెంటు పంట పండేది
అక్కడక్కడా ఆనందాలూ
ఎప్పుడూ సాగే దిగులు దుఃఖ ప్రవాహాలూ
దిగంతాలు తిరిగినా తీరని
గజిబిజీ బిజినెస్‌లు
అతని జీవన చిరునామాలు
పెళ్ళాం అడిగిన మల్లెపూలూ
పిల్లలు అడిగిన రంగు పెన్నులూ
ఎప్పటికీ
అతనికి గుర్తుండని మరుపు జబ్బులు

ఆఫీసులూ, ఎకౌంటూ
టార్గెట్‌లూ డెడ్‌లైన్లూ
కాంప్లిమెంట్లూ, ఇంక్రిమెంట్ల కోసం
చేసే సర్కస్ ఫీట్లే
అతని జీవితాదర్శాలు
అయితే ఇప్పుడతను
పనికి పనికి రానివాడు
పనిరాక్షసి విరగ్గొట్టిన వెన్నెముక సాక్షిగా
ఆగిపోయిన జీవితమే అతనికి ఆఖరి
మజిలీ
బంధాలు, అనుబంధాలూ
తెంచిపారేసిన బిజినెస్ నెట్‌వర్క్‌లో
బందీగా మిగిలిపోయిన బలహీనుడతను

అతను–
గెలుపు కోసం జీవన పోరాటంలో–
అలసిపోయి ఓడినవాడు
ఎప్పుడూ గెలుపు గుర్రం మీద
స్వారీ చేసి అలసిపోయిన వాడు
అతను నడవలేడు అరవలేడు
ఆలోచించలేడు దేన్నీ ఆచరించలేడు
సిమ్‌కార్డ్ పడిపోయిన సెల్‌లా
డల్లయి పోయిందతని జీవితం
అతను అతను కాదు
అతను వేరేవాడు
స్వంత శరీరంలోనే
ఆత్మని దొంగిలించబడిన వాడు
పరాయికరణలో
తన్ను తాను పోగొట్టుకున్నవాడు
అతను
జంతువూ కాదు రాబోటూ కాదు
అతను నీలాంటి నాలాంటి వాడే
మనలో మనమే పోగొట్టుకున్న
మనలాంటివాడు.. మనవాడే

అతను మనందరం మరచిపోయిన
మామూలు మనిషి !



April 2010 pages _25.03.2010.pmd 6 3/27/2003, 6:34 PM



# శ్రీశ్రీ యుగమా? ప్రజా కవిత్వ యుగమా?

నిఖిలేశ్వర్

***ఏ జాతి చరిత్రకైనా, ఆ చరిత్రలో భాగమైన సాహిత్యానికైనా ఆయా యుగాల స్వభావమే ఆధారం కావాలి. ఆయా దశల్లో, ఒక దేశ చరిత్ర తిరిగి మలుపులు, అందులో వచ్చిన వివిధ పరిణామాలు ఆనాటి రాజకీయ – ఆర్థిక – సాంఘిక – భౌతిక ఆధారాలపై నిలిచి ఉంటాయి. అవే సామాజిక శక్తులు, సాహిత్య సృష్టికి పునాదులవుతాయి. వివిధ భౌతిక, భావ సంఘర్షణలో వర్గాల వైరుధ్యాలతో సృజనాత్మక సాహిత్యం విభిన్నమైన ప్రక్రియలకు దోహదం చేసి వూపిరినీ ఇస్తాయి. వీటిని ఒక వ్యక్తి తనకున్న భాష. భావనా బలం, కాల్పనిక శక్తి, ప్రతిభావ్యుత్పత్తితో రక్త మాంసాలు నింపి రూపొందించినా వాటికుండే సమకాలీన భౌతిక ఆధారాలు నశించవు. స్థూలంగా ఈ మార్క్సిస్టు అవగాహనతోనే సాహిత్యాన్ని సరియైన శాస్త్రీయ దృక్పథంతో వస్తుపరంగా అంచనా వేయడానికి మార్క్సిస్టు సౌందర్య శాస్త్రం అభివృద్ధి చెందింది.***

గురజాడ అడుగు జాడలలో నడిచి తనదైన ఒక విశిష్ట మార్గాన్ని నిర్మించుకున్న శ్రీశ్రీ తన అంతిమ దశలో వీర ఆరాధకుల "శూన్యవాదాన్ని" ఆమోదించినట్టే ప్రశ్నలకు జవాబులిస్తూ వచ్చారు. తనకంటె ముందు శూన్యమే కాబోలు అనే అవాస్తవిక వాదానికి కొంత బలమిచ్చారు. కాని సమకాలీన యదార్థం మరొకలా ఉంది. సాహిత్యధార సజీవంగా ఏదో రూపాన ప్రవహిస్తూ ముందు – వెనుక ఎప్పుడూ శూన్య ప్రదేశాన్ని మిగులనివ్వలేదు.

ప్రజాజీవన ప్రవాహంలో భాగమై, జాతి జీవనాడి స్పందనగా ఉండే సాహిత్యంలో కొత్త కంఠాలు వారసత్వాన్ని కొనసాగిస్తూనే ఉంటాయి. ఒకనాడు అశు సాంప్రదాయాన్ని సాగిస్తే, ఆ మరునాడు లిఖిత రూపంలో వివిధ ప్రక్రియలు ఆ జాతి సాంస్కృతిక జీవితాన్ని ప్రతిస్పందనగా వెలువడుతూనే వచ్చాయి.

ప్రస్తుతం వివిధ సాహిత్య ప్రక్రియల సమ్మేళనమే సాహిత్యమైనప్పుడు, ఆ సాహిత్యాన్ని సక్రమంగా అర్థం చేసుకోవడానికి, అంచనా వేయడానికి ఏదో ఒక పద్ధతిని అనుసరించవలసి ఉంటుంది. అందులో భాగంగానే సాహిత్య చరిత్రకారులు – విమర్శకులు సాహిత్యాన్ని సౌలభ్యం కోసం యుగాలుగా విభజిస్తూ వచ్చారు.

తెలుగు సాహిత్య చరిత్రను ఇంతవరకు కొందరు చారిత్రాత్మకమైన ఆయా యుగ స్వభావాలను బట్టి విభజించారు. ప్రాచీన, మధ్యయుగాల, ఆధునికమనే పేర్లతో వ్యవహరించారు. మరి కొందరు రాజుల పేరిట విడదీసి చూపారు. ఇప్పుడు ఎక్కువగా ఆయా కవుల పేర్లతో యుగాలను విభజించడం సాధారణమైపోయింది.

ఇంగ్లీషు సాహిత్యచరిత్రను కూడా గతంలో ఇలాగే అధ్యయనం చేశారు. హడ్సన్ తన పద్ధతిలో చాసర్ నుంచి హార్డి దాకా, అలాగే ఆయా ప్రముఖ రచయితల నామధేయాలతో వ్యవహరించి సాహిత్య చరిత్రను వివరించాడు. ఒక్కో యుగంలో ఎవరో ఒక రచయిత లేదా కవి ప్రభావం అత్యంత గాఢంగా ఉంటుందని, అతని సాహిత్య సృజనతో ఆ కాలంనాటి సాహిత్య ప్రక్రియలు, ధోరణులు ముడిపడివుంటాయని – అందువల్లనే ఆ కవుల పేర్లతో యుగాలను విభజించడం మంచిదని ఈ పద్ధతిని సమర్థించేవాళ్ళు వాదిస్తారు.

కాని ఏ జాతి చరిత్రకైనా, ఆ చరిత్రలో భాగమైన సాహిత్యానికైనా ఆయా యుగాల స్వభావమే ఆధారం కావాలి. ఆయా దశల్లో, ఒక దేశ చరిత్ర తిరిగి మలుపులు, అందులో వచ్చిన వివిధ పరిణామాలు ఆనాటి రాజకీయ – ఆర్థిక – సాంఘిక – భౌతిక ఆధారాలపై నిలిచి ఉంటాయి. అవే సామాజిక శక్తులు, సాహిత్య సృష్టికి పునాదులవుతాయి. వివిధ భౌతిక, భావ సంఘర్షణలో వర్గాల వైరుధ్యాలతో సృజనాత్మక సాహిత్యం విభిన్నమైన ప్రక్రియలకు దోహదం చేసి వూపిరినీ ఇస్తాయి. వీటిని ఒక వ్యక్తి తనకున్న భాష. భావనా బలం, కాల్పనిక శక్తి, ప్రతిభావ్యుత్పత్తితో రక్త మాంసాలు నింపి రూపొందించినా వాటికుండే సమకాలీన భౌతిక ఆధారాలు నశించవు. స్థూలంగా ఈ మార్క్సిస్టు అవగాహనతోనే సాహిత్యాన్ని సరియైన శాస్త్రీయ దృక్పథంతో వస్తుపరంగా అంచనా వేయడానికి మార్క్సిస్టు సౌందర్య శాస్త్రం అభివృద్ధి చెందింది. సుందరమైన, వాస్తవికమైన, తాత్వికపరమైన అంశాలు గీటురాళ్ళుగా ముందుకు వచ్చాయి. అలాగే ఆయా యుగాల్లో సమకాలీన శ్రామిక ప్రజా జీవితానికి న్యాయం చేసిన రచనే విశ్వజనీనమైన సార్వకాలీనతను సంతరించుకుంటుంది.

ఈ అవగాహన ఆధారంగానే గత 83 సంవత్సరాల తెలుగు సాహిత్య చరిత్రను క్షుణ్ణంగా పరిశీలిస్తే గురజాడ నుంచి ఈనాటి



April 2010 pages _25.03.2010.pmd 7 3/27/2003, 6:34 PM

దాకా వాస్తవికత అనేక దశలు దాటింది. మౌలికంగా ఈ ఆధునిక యుగధోరణి, ప్రజలకు ముఖ్యంగా సమాజ సంపత్తిని సృష్టించే పీడిత ప్రజలకు న్యాయం జరగాలనే స్వభావంతో పురోగమించింది.

ఇలాంటి భూమికపై ఆధునిక తెలుగు సాహిత్యాన్ని ఎవరో ఒక వ్యక్తి పేరుమీద యుగ విభజన చేయడం శాస్త్రీయం కాదు. ఆ మౌలికమైన యుగ స్వభావాన్ని ప్రతిస్పందించిన సాహిత్యానికి సహజంగానే ప్రజా సాహిత్య యుగమని వ్యవహరించడం న్యాయ సమ్మతమవుతుంది.

శ్రీశ్రీ తమ జీవిత కాలంలో తరుచుగా ఒకమాట అంటూ ఉండేవారు. "1938కి పూర్వం తెలుగు సాహిత్యం నన్ను నడిపిస్తే 1938 తర్వాత ఆ సాహిత్యాన్ని నేను నడిపించాను" అలాగే "ఈ శతాబ్దం నాది" అని వారు ప్రకటించినప్పుడల్లా అభిమానులు ఆయన ఆత్మవిశ్వాసాన్ని శ్లాఘించే అశాస్త్రీయ భావ ధోరణికి లోనవుతూ వచ్చారు.

*మార్క్స్, లెనిన్, స్టాలిన్ రచనలు, యూరోపియన్ ప్రజాసాహిత్య ప్రభావం ఈ దేశంలోనే నజ్రుల్ ఇస్లాం వినిపించిన విప్లవ గీతాలు, గోర్కీ, టాల్‌స్టాయ్, డాస్టోవస్కీ, మయెకోవస్కీ తదితరుల సాహిత్యం ఒక వూపు నిచ్చింది. ఇక్కడ భౌతిక పరిస్థితులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వచ్చిన వెల్లువ క్రమంగా "మరో ప్రపంచం" అనే ఉద్ఘోషకు ప్రాణమిచ్చింది.*

ఒకే వ్యక్తి సాహిత్యంలో ఏ యుగాన్నీ నడిపించడు. నాయకత్వ స్థానంలో ఉండి నిరంతర ప్రేరణ నిస్తాడు. ఉత్తేజాన్ని కలిగిస్తాడు. అంత మాత్రాన ఆ యుగాన్ని ఆయన పేరుతో పిలిస్తే అది వస్తుపరమైన యదార్ధ దృష్టి అనిపించుకోదు.

1962లో మొదటి సారి ఆరుద్ర 'శ్రీశ్రీ యుగం' అని నామకరణం చేసి ఈ వివాదానికి శ్రీకారం చుట్టారు. ఆ తర్వాత మహాకవిని తరుచుగా యుగ కర్త అని, ఇది ఆయన యుగమని వాడుకలోకి తెచ్చారు.

వాస్తవంగా సాహిత్య చరిత్రలోని యదార్థాలను మనం తిరస్కరించలేము. ఈ ఆధునిక యుగానికి ఒక వ్యక్తి ఆద్యుడిగా, స్ఫూర్తిగా మొదట వచ్చినవాడుగా తీసుకోవాలంటే గురజాడవారిని ఎలా విస్మరించగలము? ఆనాడే స్వయంగా శ్రీశ్రీ కూడా గురజాడది అడుగుజాడ అని, ఆయనే యుగకర్త అనే అంశాన్ని అంగీకరించారు.

అయితే ఆధునిక యుగానికి, అభ్యుదయ భావనకు ప్రారంభకుడైన గురజాడ పేరుతో ఆ యుగాన్ని పిలవచ్చునా? అది కూడా వాస్తవ దృష్టి అనిపించుకోదు.

ఆధునిక కవిత్వానికి పితామహుడని, ఈ యుగానికి కర్త అని గురజాడ వారిని మొదటి నుంచి శ్రీశ్రీ గారు అంగీకరించినా ఇటీవల ఆ అభిప్రాయాన్ని కొంచెం సడలించుకున్నారు. "ఈ ఇరవయ్యో శతాబ్దం ఆనాడు శ్రీశ్రీ యుగమై ఈనాడు కాకపోయిందా?" అని, "క్రొనలాజికల్‌గా చారిత్రకంగా గురజాడవారిని (ఆధునిక కవితా పితామహుడని–) అనవలసి వచ్చినప్పటికీ ఈనాటి పరిస్థితులను బట్టి ఈనాటి సాహిత్య చరిత్రనుబట్టి, గురజాడవారిని 1915 లోనే ఆయన శకం, జీవితమే ముగిసిపోబట్టి ఇతరులను పేర్కొనవలసి వచ్చింది" అని శ్రీశ్రీ గారు అన్నారు.

ఈనాటి సాహిత్య చరిత్రనుబట్టి చూసినా, "మహాప్రస్థానం", లండన్ ప్రచురణకు 1980లో శ్రీశ్రీ గారే "నామాట" అని రాస్తూ చెప్పిన యధార్థం మాత్రమే సరైనది.

"ఒకటి మాత్రం నిశ్చయం. 1933లో నేను సైతం ప్రపంచాగ్నికి" ఇత్యాది గీతాలతో ప్రారంభించి కడసారిగా గ్రాంధిక శైలికీ, గణబద్ధ చందస్సులకీ గుడ్‌బై కొట్టేశాను. ఇదే గురజాడ అడుగుజాడ, అంతవరకు సుమారు వెయ్యేళ్లు అవ్యాహతంగా సాగుతూ నలిగిన క్లాసికల్ బండి దారి నుంచి గురజాడ తెలుగు కవిత్వానికి ఒక కొత్త మలుపు ఇచ్చాడు. రథాలూ, పల్లకీలూ, గుర్రబ్బళ్ళూ వెళ్ళే దారిని తప్పించి, మోటార్లూ, రైలుబళ్ళూ తిరిగే ఆధునిక యుగానికి తెలుగు కవిత్వాన్ని మళ్ళించాడు. గురజాడ చూపించిన మలుపును నేను మహాప్రస్థానం గీతాలలో మరింత వెడల్పు చేశాను."

ఆధునిక తెలుగు సాహిత్యానికి ఒక కొత్త మలుపు ఇచ్చిన గురజాడ, ఆ మలుపును మరింత వెడల్పు చేసిన శ్రీశ్రీ ఈ శతాబ్దంలోని తెలుగు సాహిత్యపథ నిర్దేశకులు. ఈనాటివరకూ కొనసాగుతూ వచ్చిన అభ్యుదయ – విప్లవ దృక్పథాలకు శ్రీశ్రీ అగ్రగామిగా నిలుచున్నాడు.

గురజాడ, శ్రీశ్రీల సాహిత్యానికి మూల వస్తువు ప్రజలు. గత 83 సంవత్సరాల భారతదేశ చరిత్రలోని అన్ని రకాల శక్తుల ప్రభావం వీరిపై ఉంది. శ్రామిక జనోన్ముఖమైన పవిత్ర ఆశయమే వారిద్దరి రచనల పరమార్థం. అందువల్ల ఈ యుగ లక్షణమైన శ్రామిక జన విముక్తి, ప్రజా సాహిత్య నిర్మాణం మాత్రమే ఈ యుగానికి మూలాధారం.

1917లో వచ్చిన అక్టోబరు సోషలిస్టు విప్లవ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా అల్లుకొంది. భారతదేశం అందులోని తెలుగుజాతిపై కూడా ఈ అక్టోబర్ విప్లవం తన ప్రభావం చూపి తెలుగు సాహితీ సాంస్కృతిక రంగాలకు మరో ఉత్తేజకరమైన మలుపునిచ్చింది. 1920 నాటి నుంచి ఈ విప్లవం తెలుగు సాహిత్యంలో అంతర్జాతీయ భావనకు, "ప్రజా సాహిత్య యుగ" మనే ఆధునాతన యుగారంభానికి ప్రేరణగా నిలిచింది. ముఖ్యంగా 1930–35 నాటి ప్రపంచ ఆర్థిక మాంద్యం, కాటక పరిస్థితులు **Hungry Thrties** లో వచ్చిన ఆ కవితరంలోని ఆక్రోశం, ఆవేదనలు ఈ ప్రజా సాహిత్యానికి బలాన్ని, వికాసాన్ని కలుగజేశాయి.

మార్క్స్, లెనిన్, స్టాలిన్ రచనలు, యూరోపియన్ ప్రజాసాహిత్య ప్రభావం ఈ దేశంలోనే నజ్రుల్ ఇస్లాం వినిపించిన విప్లవ గీతాలు, గోర్కీ, టాల్‌స్టాయ్, డాస్టోవస్కీ, మయెకోవస్కీ తదితరుల సాహిత్యం ఒక వూపు నిచ్చింది. ఇక్కడ భౌతిక పరిస్థితులు బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా వచ్చిన వెల్లువ క్రమంగా "మరో ప్రపంచం" అనే ఉద్ఘోషకు ప్రాణమిచ్చింది. ఫలితంగా రైల్వే కార్మికులు, రైతు కూలీలు, మధ్య తరగతి మేధావులు, కవులు తమ అనుభవాలతో, ఉద్యమాలిచ్చిన ఉత్ప్రేరణతో ప్రజా సాహిత్యాన్ని సృష్టించారు. అభ్యుదయ కవులు, నయాగరా కవులు, ప్రజా గేయాలు రచించిన వాగ్గేయకారులు ఈ ప్రజాసాహిత్య యుగంలోని సజీవ కంఠాలు.

అక్టోబర్ విప్లవ ప్రభావం ప్రపంచ వ్యాప్తంగా ఆయా దేశాల రచయితలపై ఉందనేది ఈ యుగంలోని యదార్థం. లండన్ ప్రోగ్రెసివ్ రచయితలపైనే కాకుండా ఉత్తర అమెరికన్ రచయితలపై కూడా బలీయంగా ప్రసరించింది. పెట్టుబడిదారీ దేశాల పునాదులనే కదిలించి



April 2010 pages _25.03.2010.pmd 8 3/27/2003, 6:34 PM

## అనేకాంతం

ఈతకోట సుబ్బారావు



నువ్వు–
ఏకాంతం అనుకుంటావ్
ఏకాంతమేనా ఒట్టి నువ్వేనా ఉన్నది
నీతో పాటు ఆలోచనల స్రవంతి
గుండెను మండించే స్మృత్యగ్ని
గుప్పెడు మస్తిష్క విస్ఫోటనలు
వెంటాడి వెంటాడి తరిమే జ్ఞాపకాలు
చంద్రుడి చుట్టూ పర్యవేషనలా
నీ చుట్టూ భూత వర్తమాన వలయం

అయినా–
అది ఏకాంతమేనా
అంటూ ఉంటూ ఏకాంతం
ఒంటరి సెలయేరులా ప్రవహించడమే
అలల కర్నాట కల్లోలంలో
రాళ్లు రప్పల ఢీ డిక్కుల్లో
చివరంటూ ఎడతెగని ప్రయాణమే గదా
కౌగిలింతలు, ఎడబాట్లు
స్నేహాలు – శత్రుత్వాలు
చిర్నవ్వు వెన్నుపోట్లు
వీటన్నిటి మధ్య ఒక ఆలోచన
మండుతూ మండించే ఆలోచన
ఫీనిక్స్‌లా ఒగిసి ఎగిసే ఆలోచన
వినిపించని లో ఆక్రందన
ఒక సుదీర్ఘ లేఖలోని రేఖా చిత్రం
ఒక అర్ధనగ్న సందేహం
ఒక అసంపూర్ణ అపోహ
ఇన్ని మనోభివ్యక్తుల సంతలో
దేహానికి ఏకాంతం
మనిషికెప్పుడూ అనేకాంతమే !

## అంతర్గత పతంగం

వి. సూర్యారావు



నేత్రమయి పోవాలని ఉంది
గాత్రమయి పోవాలని ఉంది
సుక్షేత్రమయి పోవాలని ఉంది
వరద బాధితులకోసం–
నీరయి పోయిన
మురికయిపోయిన
రోగాలు రొస్టులూ అయి,
అయిన వాళ్ల శవాల మధ్య
బతికున్న పీనుగలయిపోయిన
తిండిలేక నిద్రలేక
తాగేందుకు నీరులేక
ఆదుకునే నాధుడులేక
పురుగులయి మలమూత్రాలయి
పిచ్చెక్కి పోయిన
దీనులకోసం
ఉషస్సు కిరణమయి
ధ్యాసయి ధ్యానమయి
వేదనల రోదనల
శోధనలయి
శ్రమించాలని
చప్పుడయి సవ్వడయి
మనిషి మనిషిలో
అనంతకోటి ప్రభాతాల
ప్రభోదాల గీతాలయి
నినదించాలని ఉంది
మానవతకి
మహాస్థూపం
నిర్మించాలని ఉంది.

---

ప్రశ్నించింది.

1925 – 50 ల మధ్య రచనలు చేసిన అమెరికన్ నీగ్రో కవి లాంగస్టన్ హ్యూగ్స్‌కు మహాకవి శ్రీశ్రీకి చాలా పోలికలు ఉన్నాయి. "గుడ్ మార్నింగ్ రెవల్యూషన్" పేరుతో ఆయన కవితా సంకలనం 1973లో వెలువడినా అతను 1925 నుంచి కవితలు కథలు రాశాడు. 1937లో "గర్జించు చైనా" (**Roar China**) అని హ్యూగ్స్ కవిత రాస్తే శ్రీశ్రీ 1941లో "గర్జించు రష్యా" అనే కవిత తన పద్ధతిలో ఇక్కడ రచించారు. 1934లో శ్రీశ్రీ మహాప్రస్థానం గీతం "పదండి ముందుకు" అని పిలుపునిస్తే అదే సంవత్సరం హ్యూగ్స్ కూడా Revolution అనే కవితలో –

**"Great mob that knows no fear - come here**
**And raise your hand against the man of iron and steel and gold who's bought and sold you."**

ప్రపంచ వ్యాప్తంగా శ్రామిక జన విప్లవం అనేది ఈ ఇరవయ్యో శతాబ్దపు స్వభావంగా మారిపోయింది. ఆయా దేశాల్లో వచ్చిన ఈ ప్రజా సాహిత్యానికి ఈ యుగ స్వభావాన్ని అనుసరించి నామకరణ చేయడం జరిగింది. ఏ భాషలోనైనా ఎంతటి మహాకవైనా, "ఈ శతాబ్దం నాది" అని ఎవరూ అనలేరు. ఒకవేళ శ్రీశ్రీలాగ అన్నా, అది ఆయన ఆత్మ విశ్వాసానికి ప్రతీకగా నిలిచినా అదే సరైనదని సమర్థించడం అశాస్త్రీయం. స్వాప్నికుడిగా కవితా ధోరణిలో శ్రీశ్రీ చెప్పుకున్న ఆ మాటను కవిత్వానికే పరిమితం చేయాలి.

కాని సాహిత్య యుగ విభజన అనే ఒక శాశ్వత నిర్ణయానికి సాహిత్య చరిత్రకారులు వచ్చేముందు, ఆ యుగంలోని అనేక సాహిత్యేతర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించక తప్పదు. అలా పరిశీలించే క్రమంలోనే ఇప్పుడు ఈ 20వ శతాబ్దపు యుగ సాహిత్యాన్ని సమగ్రంగా "ప్రజా సాహిత్య యుగం" అని వ్యవహరించడం సమంజసంగా ఉంటుంది.

సామాజిక వాస్తవికత నుంచి ప్రజా పోరాటాలతో మమేకమై సాగిపోతున్న నేటి తెలుగు సాహిత్యం ఎన్ని ఎగుడు దిగుడులున్నా రేపటి సోషలిస్టు వాస్తవికతను సాధించే క్రమంలో పీడిత ప్రజలకు ఊపిరిగా కొనసాగడం మాత్రం చారిత్రక సత్యం. ఆ క్రమంలోనే ప్రస్తుతం తెలుగు సాహిత్య దశను ప్రజా సాహిత్య యుగమని పిలిస్తే, సమకాలీనంగా ప్రజాకవితను ఉత్తేజంగా ముందుకు తీసుకెడుతున్న వివిధ ప్రజాకవులకు న్యాయం చేకూర్చినట్లవుతుంది. ■



April 2010 pages _25.03.2010.pmd 9 3/27/2003, 6:34 PM

# శ్రీశ్రీ జాబులు



డా॥కె.ఆశాజ్యోతి

*శ్రీశ్రీ సాహిత్య సర్వస్వంలో "శ్రీశ్రీ జాబులు" ఒక భాగం. మార్క్సిజం భూమికగా సామ్యవాద దృక్పథాన్ని ఎరువుగా, కమ్యూనిజంగా, విప్లవంగా ప్రదర్శించాడు. ఎవరు వ్యతిరేకించినా సమాజాభ్యుదయం కోసం తన రీతిని, నీతిని పంథానీ మార్చుకోని దృఢ సంకల్పి. మేరు నగరమంతటి ధైర్యం పిడికెడు గుండెలో నిబిడీకృతం కావడానికి కారణం సమాజాభ్యుదయ కాంక్షే! జీవనాధారం కోసం సినిమాల్లో పని చేసినా అక్కడ కూడా రివల్యూషన్ తీసుకురావాలని తాపత్రయ పడ్డాడు. సినిమా రంగాన్ని తన చైతన్యంతో ప్రభావితం చేసాడు. ఏ రంగంలో అడుగు పెట్టినా తన ముద్రను ముద్రించగల విప్లవ చైతన్యం ఉన్న కవి. తాడిత పీడిత వర్గ ప్రాతినిధ్యాన్ని తన జీవితమంతా భుజస్కంధాలపైన మోసినకవి. శారీరక, మానసిక రుగ్మతలు శ్రీశ్రీ కఠోర ధ్యేయం ముందు సాగిలపడ్డాయి.*

*"నిప్పులు చిమ్ముకుంటూ*
*నింగికి నేనెగిరిపోతే*
*నిబిడాశ్చర్యంతో వీరు...*
*నెత్తురు కక్కుకుంటూ*
*నేలకు నే రాలిపోతే*
*నిర్దాక్షిణ్యంగా వీరే..."*

అంటాడు శ్రీశ్రీ. ఈ కవితలో సమాజ వైఖరిని క్లుప్తంగా, క్షుణ్ణంగా తెలిజేసాడు. సారస్వత లోకంలో తన ఆధిపత్యాన్ని, వైభవాన్ని అద్భుతాశ్చర్యాలతో చూసిన ఈ సమాజమే తన పతనాన్ని కూడా నిర్దాక్షిణ్యంగా చూసారని అంటాడు. ఐతే ఎవరు పొగిడినా, తెగిడినా కించిత్తు కూడా లెక్క చెయ్యని నైజం, తను అనుకున్నది సాధించే వరకూ అలుపెరగని పోరాటం చేసిన యోధుడు శ్రీశ్రీ. ఈ పోరాట తత్వం సాహిత్యంలో ప్రతిఫలించినట్టుగానే "శ్రీశ్రీ జాబులు"లో కూడా ప్రతిఫలిస్తుంది. శ్రీశ్రీ సాహిత్య సర్వస్వంలో "శ్రీశ్రీ జాబులు" ఒక భాగం. మార్క్సిజం భూమికగా సామ్యవాద దృక్పథాన్ని ఎరువుగా, కమ్యూనిజంగా, విప్లవంగా ప్రదర్శించాడు. ఎవరు వ్యతిరేకించినా సమాజాభ్యుదయం కోసం తన రీతిని, నీతిని పంథానీ మార్చుకోని దృఢ సంకల్పి. మేరు నగరమంతటి ధైర్యం పిడికెడు గుండెలో నిబిడీకృతం కావడానికి కారణం సమాజాభ్యుదయ కాంక్షే! జీవనాధారం కోసం సినిమాల్లో పని చేసినా అక్కడ కూడా రివల్యూషన్ తీసుకురావాలని తాపత్రయ పడ్డాడు. సినిమా రంగాన్ని తన చైతన్యంతో ప్రభావితం చేసాడు. ఏ రంగంలో అడుగు పెట్టినా తన ముద్రను ముద్రించగల విప్లవ చైతన్యం ఉన్న కవి. తాడిత పీడిత వర్గ ప్రాతినిధ్యాన్ని తన జీవితమంతా భుజస్కంధాలపైన మోసినకవి. శారీరక, మానసిక రుగ్మతలు శ్రీశ్రీ కఠోర ధ్యేయం ముందు సాగిలపడ్డాయి.

శ్రీశ్రీ జాబులు 1940-83 మధ్య కాలంలో రాసినవి. ఈ జాబులు ఎక్కువగా అరసం, విరసం, దిగంబర కవులకు, కార్యకర్తలకు రాసినవే! ప్రారంభంలో ఉత్సుకత, ఆవేశం, ఆ వేగం ప్రస్ఫుటంగా కనబడతాయి. అనంతర కాలంలో ఆలోచనల్లో పరిపక్వత, నిర్దుష్టత విస్పష్టంగా విచ్చుకున్నాయి. ఈ జాబుల్లో ప్రధానంగా మూడు అంశాలు గమనించవచ్చు.

1. వ్యక్తిగతం
2. సాహిత్యం
3. రాజకీయం.

**వ్యక్తిగతం :**

వ్యక్తిగతంగా భావించదగిన లేఖల్లో ఆర్థిక సమస్యలు విరివిగా కనబడతాయి. డబ్బు లేక కార్డు అప్పు తీసుకుని రాయడం (జాబులు పుట:29), పెన్నులో సిరా అయిపోతే నీళ్లు పోసి రాసిన సందర్భాలూ (జాబులు:86) అప్పులు సమయానికి తీర్చలేక నానా యాతనలు పడిన సందర్భాలూ ఉన్నాయి. చలానికి రాసిన ఉత్తరంలో "నా దురదృష్టం ఏమిటో నాకు బాకీలున్న వారెవరూ బాకీ చెల్లించరు. నేను బాకీ ఉంటే



April 2010 pages _25.03.2010.pmd 10 3/27/2003, 6:34 PM

మాత్రం నాకు ఊపిరి సలపనివ్వరు. చలం మహర్షితో సహా" (జాబులు, పుట:51) అని రాసుకున్నాడు.

ఈ ఉత్తరాలు చాలా వరకు పురిపండా అప్పల స్వామికి రాసారు. మొదటి భార్య వెంకట రమణమ్మ అనారోగ్యానికి తేనె కలిపిన మందులు వైద్యులు సూచించారు. ఆ తేనె కోసం పురిపండా అప్పల స్వామికి ఎన్ని లేఖలు రాసారో! చివరకు ఆమె మరణించినప్పుడు చలసాని ప్రసాద్‌కు ఉత్తరం రాస్తూ, ఆమె మరణం వల్ల ఐదు దశాబ్దాల సాహచర్యం చిందరవందరైందంటూ **"I feel so empty, so lonely"** అని రాసి కొంత ఖాళీ స్థలం వదిలి తిరిగి **"The empty space above, symbolizes my present state of mind"** (జవాబు : 78) అని ముగిస్తాడు. ఆ ఖాళీ స్థలం ఒక కవితాత్మకమైన అభివ్యక్తి! ఒక భావ చిత్రం! ఒక వేదన! ఒక నిర్వికారం! ఒక అనంతం! ఒక చరమ రాత్రి! ఒక మహా ప్రస్థానం! ఒక పరిణయ రహస్యం! ఒక సిప్రాలి! ఆమెతో దశాబ్దాల సాహచర్యంలో గుండెల్లో పొదుపుకున్న సుఖదుఃఖాలున్నాయ్! ఆ **empty space**లో వేల గొంతుకల మధ్య ఒంటరితనపు విహ్వలత్వం ఉంది.

అలాగే తన ఆరోగ్యం ఎంత క్షీణించినా లేఖల్లో ఎక్కడా ప్రస్ఫుటం చెయ్యడు. చివరకు క్యాన్సరని తెలిసినా కుంగడు. వయస్సు శరీరానికి కానీ మనసుకు, మేధకు కాదని ప్రగాఢంగా విశ్వసించిన వ్యక్తి.

*శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు. విశ్లేషకుడు, విమర్శకుడు కూడా! తన సమకాలికులైన కవులు, ఆరుద్ర మొదలుకుని పురిపండా, చలం, నారాయణబాబు, దిగంబరకవులు ఇలా ఎంతో మంది. వీరి మధ్య శ్రీశ్రీది ప్రత్యేకమైన స్థానం. కవులందరూ విశ్లేషకులు, విమర్శకులూ కారు. కానీ విశ్లేషకునిగా, విమర్శకునిగా శ్రీశ్రీ నిలువెత్తుగా కనబడతాడు. సాహిత్య పోరాటంలో అభ్యుదయ వాదిగా ఎక్కడా తొణకడు, బెణకడు. విస్తృతమైన ప్రపంచ, దేశ సాహిత్య పఠనం విశాలమైన దృక్పథం అలవడడానికి దోహదం చేసింది.*

**సాహిత్యం:**

శ్రీశ్రీ కేవలం కవి మాత్రమే కాదు. విశ్లేషకుడు, విమర్శకుడు కూడా! తన సమకాలికులైన కవులు, ఆరుద్ర మొదలుకుని పురిపండా, చలం, నారాయణబాబు, దిగంబరకవులు ఇలా ఎంతో మంది. వీరి మధ్య శ్రీశ్రీది ప్రత్యేకమైన స్థానం. కవులందరూ విశ్లేషకులు, విమర్శకులూ కారు. కానీ విశ్లేషకునిగా, విమర్శకునిగా శ్రీశ్రీ నిలువెత్తుగా కనబడతాడు. సాహిత్య పోరాటంలో అభ్యుదయ వాదిగా ఎక్కడా తొణకడు, బెణకడు. విస్తృతమైన ప్రపంచ, దేశ సాహిత్య పఠనం విశాలమైన దృక్పథం అలవడడానికి దోహదం చేసింది. '40ల్లో ప్రారంభమైన అరసం గురించి రాస్తూ- "అరసం దరిద్రుల సంస్థే కానీ దరిద్ర సంస్థ కాదు" అంటాడు. '73లో సాహిత్య అకాడమీ అవార్డు ముందు తిరస్కరించినా, తరువాత విరసం సభ్యుల ఆమోదంతో తీసుకుని ఆ నగదును విరసం అభివృద్ధికి ఖర్చు చేయాలనుకున్నాడు. అంతటి ఆర్థికావసరాలతో ఆ సంస్థ నడిచేది. అబ్బూరి, వేదుల, కృష్ణశాస్త్రి, బసవరాజు అప్పారావు మొదలైన కవులు భావకవిత్వ ధోరణిలో తలమునకలుగా మునిగి ఉంటే ఆ భావజాలం నుండి బయటపడి అభ్యుదయోద్యమ కవిత్వం ఆవిష్కరించాడు.

శ్రీశ్రీ జాబుల్లో ఎంతో సాహిత్య చర్చ సాగించాడు. పుస్తకాలు, రచయితలు, పత్రికలు, సినిమాలు కవులు, ఇలా చాలానే ఉన్నాయి. సర్రియలిజం ధోరణిలో రాసిన కవిత-

*'అందంగా నవరసని*
*స్యందంగా పతిత హృదయ సంస్పందంగా*
*కందాలొక వంద రచిం*
*చిందా మనసయ్యె నాకు సిరిసిరి మువ్వా*
*మళ్ళీ ఇన్నాళ్ళకి ఇ*
*న్నేళ్ళకి పద్యాలు వ్రాయుటది ఎట్లన్నన్*
*పళ్ళూడిన ముసలిది-*
*కుచ్చిళ్ళు సవరించినట్లు సిరిసిరిమువ్వా'*

వంటివి పురిపండాకు రాయడం, పురిపండా కవితలు, శ్రీశ్రీ ఆంగ్లానువాదాలతో 'సౌదామని'లో రాయడం (జాబులు-పుట:23), నీల్ ఔర్ నందా సినిమాను 'ఆహుతి'గా తెలుగుకు అనువాదం చేయడం, మహాప్రస్థానం గీతాల అచ్చుకు (జాబులు-పుట: 27) సంబంధించిన ప్రస్తావన, 'మరో ప్రపంచం' కవితల్ని అనిసెట్టి సుబ్బారావు వేస్తాననడం, 'నైమిశ' కవిత పత్రికల ప్రస్తావన (జాబులు - పుట:30), కె.వి.రమణారెడ్డి గేయ సంకలనం "అంగార వల్లరి"కి పరిచయ వాక్యాలు రాయడం, (జాబులు-పుట48) ఆసియా ఆఫ్రికా రచయితల మహాసభకు (జాబులు- పుట:50) సంబంధించిన చర్చ, కవితా సమితి స్థాపన (జాబులు-పుట:53)లతో పాటు కృష్ణశాస్త్రి మరణం గురించి చలసాని ప్రసాద్‌కు

*"అద్దం బద్దలయింది*
*రోదసి రోదించింది*
*షెల్లీ మరణించాడు*
*వసంతం వాడిపోయింది"*

అంటూ రాసిన కవిత, చెరబండరాజు మరణించినపుడు **"The king is dead; long live the king"** అనడం (జాబులు-పుట: 106) సొంతంగా శ్రీశ్రీ ప్రచురణలు స్థాపించడం - మొదటి పుస్తకంగా "పాడవోయి భారతీయుడా" సినిమా పాటలు, రెండవ పుస్తకంగా సిప్రాలి అంటే సిరిసిరి మువ్వలు, ప్రాసక్రీడలు, లిమరిక్కులు ముద్రించడం వంటి అనేకాలైన సాహిత్యాంశాలు లేఖల్లో ఉన్నాయి.

రమణ చంద్‌కి లేఖ రాస్తూ- **"poems may be dreams, But remember. All dreams have a strong basis in reality"** అని సిగ్మండ్ ఫ్రాయిడ్ (పుట:103) సిద్ధాంతాన్ని ఉటంకిస్తూ కలలకు బలమైన పునాది వాస్తవికతని చెబుతాడు. తన కవితా ప్రస్థానంలో, రచనల్లో ఆ తాత్వికత బలంగా వేళ్లూనుకునేలా చేసాడు. దిగంబర కవి నిఖిలేశ్వర్‌కు ఓ లేఖలో ప్రభుత్వ పోలీసుల గురించి రాస్తూ



April 2010 pages _25.03.2010.pmd 11 3/27/2003, 6:34 PM

***"ఆలోచన మీద నిఘా***
***వేస్తున్న లఫంగులు***
***పోలీసుల కొత్త పేరు***
***పుస్తకాల దొంగలు"***

అంటాడు. పోలీసుల గురించి మొహమాటం లేకుండా రాస్తాడు. ప్రభుత్వం పనితీరు మీదా, ప్రభుత్వం మీదా ఏ మాత్రం నమ్మకం లేని వ్యక్తి శ్రీశ్రీ. కమ్యూనిస్టులు మాత్రమే రాష్ట్రాన్ని, దేశాన్ని బాగుపరుస్తారని నిఖార్సుగా నమ్మిన వ్యక్తి.

దిగంబర కవులను ప్రశంసిస్తూ ఓసారి ఉత్తరం రాసాడు శ్రీశ్రీ. "మీలో సగం మంది ట్విడిల్డమ్, తత్తిమ్మా సగం ట్విడిల్డీ'' (పుట:54) అంటూ ! "ట్విడిల్డమ్, ట్విడిల్డీ అంటే రెండు వస్తువుల మధ్యగానీ, ఇద్దరు వ్యక్తుల మధ్యగానీ ఎక్కువ పోలికలుండి కేవలం పేర్లలో మాత్రమే తేడా ఉంటే ఇలా అంటారు". (పుట:55) ప్రపంచ సాహిత్యంతో పరిచయం సమయానుకూలంగా ప్రదర్శించే శ్రీశ్రీ విలక్షణమైన కవి.

***శ్రీశ్రీ జాబుల్లో రాజకీయాంశాలను గమనిస్తే శ్రీశ్రీకి రాజకీయాల పట్ల నిర్దుష్టమైన అభిప్రాయం ఉంది. కమ్యూనిజంతో మాత్రమే సామ్యవాద సమాజ స్థాపన జరుగుతుందని భావించాడు. ముఖ్యంగా విశాలాంధ్ర విభజనను వ్యతిరేకించాడు "ప్రత్యేక తెలంగాణా ఏర్పడినంత మాత్రమే పీడిత సమస్యలు పరిష్కారం కావు. ఆంధ్రదేశంలో వున్న ప్రజలంతా సామ్యవాద సిద్ధాంతాల ప్రాతిపదికపై ప్రత్యేక విశాలాంధ్ర ఏర్పాటు చెయ్యడానికి పోరాడాలి" అని అభిప్రాయపడ్డాడు. అంతేకాదు విరసం రాష్ట్ర విభజన కోరుతున్నందుకు అసమ్మతి తెలుపుతూ అధ్యక్ష పదవికి రాజీనామా చేసాడు***

**రాజకీయం:**

శ్రీశ్రీ జాబుల్లో రాజకీయాంశాలను గమనిస్తే శ్రీశ్రీకి రాజకీయాల పట్ల నిర్దుష్టమైన అభిప్రాయం ఉంది. కమ్యూనిజంతో మాత్రమే సామ్యవాద సమాజ స్థాపన జరుగుతుందని భావించాడు. ముఖ్యంగా విశాలాంధ్ర విభజనను వ్యతిరేకించాడు (జాబులు:69) "ప్రత్యేక తెలంగాణా ఏర్పడినంత మాత్రమే పీడిత సమస్యలు పరిష్కారం కావు. ఆంధ్రదేశంలో వున్న ప్రజలంతా సామ్యవాద సిద్ధాంతాల ప్రాతిపదికపై ప్రత్యేక విశాలాంధ్ర ఏర్పాటు చెయ్యడానికి పోరాడాలి" (ప్రజ:31) అని అభిప్రాయపడ్డాడు. అంతేకాదు విరసం రాష్ట్ర విభజన కోరుతున్నందుకు అసమ్మతి తెలుపుతూ అధ్యక్ష పదవికి రాజీనామా చేసాడు (జాబులు-70)

రాష్ట్ర రాజకీయాలు దుర్గంధ భూయిష్టంగా ఉన్నాయని నాటి (1975) ముఖ్యమంత్రి జలగం వెంగళరావును తూర్పారబడుతూ ఒక బహిరంగ లేఖ (అముద్రితం) రాస్తూ నక్సలిజం అంత సులువు కాదనీ, నక్సలైట్లంటే బందిపోట్లు కాదనీ -అజ్ఞానమూ, అనారోగ్యమూ, నిరుద్యోగములాంటి ఈతి బాధల్ని నిర్మూలించగలిగితే నక్సలిజం దానంతట అదే అంతర్ధానమవుతుందనీ (జాబులు-పుట:82) జాతి సమైక్యతకూ, భాషోద్ధరణకూ గుర్తుగా నిర్వహించే ప్రపంచ తెలుగు సభల వల్ల లాభం లేదనీ, ముందుగా హైదరాబాదును "భాగ్యనగరం" చెయ్యమనీ, ఆంధ్రప్రదేశ్ అనే అపభ్రంశ రూపాన్ని "తెలుగునాడు"గా మార్చమనీ (జాబులు:83) సలహా ఇస్తాడు.

శ్రీశ్రీ వ్యక్తిత్వం అనంతం. చైతన్య శీలి, నిరంతర శ్రామికుడు. సామాన్యుడి తరపున వకాల్తా పుచ్చుకుని అలుపెరగని పోరాటం చేసిన న్యాయవాది. కడదాకా ఎరుపును సిరా చేసుకుని ప్రజల గుండెల మీద, మనస్సుల మీద, మేధస్సుల మీద విప్లవాకాంక్షలను పలికించిన కవి. శ్రీశ్రీ జాబుల్లో చరిత్ర ఉంది. అరసం, విరసం వంటి సంస్థలలో పనిచేయడం వల్ల మేథో మధనానికి అవకాశం కలిగింది. మరో ప్రస్థానాన్ని చెరబండరాజుకు అంకితమిచ్చిన నిండైన మనిషి. వ్యావహారిక భాషోద్యమ కృషీవలుడు (జాబులు-39, 41), 1955 ఎన్నికల్లో కమ్యూనిజం ప్రభంజనంలా విజృంభించి గెలుపు అంచుల దాకా వచ్చి ఓడిపోయినా నిరాశ చెందని ఆశావాది. "మనం ఎవ్వరం పొలిటీషియన్లము కాము. అలాగని రాజకీయాలకు అతీతులము కాము. ప్రధానంగా మనది సాహిత్య పరమైన అవగాహన" (జాబులు-పుట-66) అనడం వల్ల శ్రీశ్రీ అంతిమ లక్ష్యం సాహిత్యం ద్వారా సామాన్యుణ్ణి చైతన్య పరచటమే అని తెలుస్తుంది. **Unity is a fire that never stink** (జాబులు:71) అని సమైక్యతలో అభ్యుదయం ఉందని నమ్మిన వ్యక్తి. అభ్యుదయతత్వాన్ని ప్రవచించిన బోధకుడు. సమాజం మంత్ర ముగ్ధమై శ్రీశ్రీ చైతన్యంలో మమేకమైంది. "1990 నాటికి మన తెలుగు భాషలో నూటికి 90 ప్రపంచ భాషా పదాలూ, తెలుగు మాటలు 10 శాతమూ ఉంటాయని ఊహిస్తున్నా" (ప్రజ:21) అని భవిష్యత్తును వాస్తవ దర్పణంలో దర్శించిన దార్శనికుడు.

***"నా హృదయం పరిశుభ్రమే కాక పవిత్ర లక్ష్య పూరితం కూడా"*** అనగలిగిన చిత్త శుద్ధీ,

***"నవ రసాల నాయకుణ్ణి***
***కవనం నా ఆయుధం***
***ఈ శతాబ్ది నేలుతుంది***
***బీభత్స రసాయనం"***

అనగలిగిన గుండె ధైర్యం, **Communism is the morning song of the mankind** (కమ్యూనిజం మానవజాతి ప్రభాత గీతిక) అనగలిగిన మనోవాక్కాయ కర్మల నైశిత్యానికి నిలువెత్తు ప్రతీక శ్రీశ్రీ ! శ్రీశ్రీ అన్నట్టుగా "ఈ వెంగళప్పలందరూ ఇవాళ ఉంటారు, రేపు పోతారు. మనం రేపు పోయినా ఆంధ్ర భాష బతుకున్నంత కాలం సజీవంగా ఉంటాం" (జాబులు:62) అని రాసి తన రాతల్లో భవిష్యత్తును తెలిపి అది చరిత్రగా చరిత్రలో మిగిలిపోయేలా బీజావాపనం చేసిన విప్లవ చైతన్య మూర్తి మహాకవి శ్రీశ్రీ.

***"శ్రీశ్రీకి శ్రీశ్రీయే సాటి***
***ఇంకెవరూ రారతనికి సరిసాటి"***

■



April 2010 pages _25.03.2010.pmd 12 3/27/2003, 6:34 PM

## కవిత

# మట్టి చేతులు

**చిన్ని నారాయణరావు**

ఉదయాన్నే నగరకూడలి
ఒక్కసారిగా జనసంద్రంగా మారుతుంది
పనిని వెదుకున్నే చకోర పక్షుల
ఆకలి ఆక్రందనలతో
అదో పరేడ్‌గ్రౌండ్‌గా దర్శనమిస్తుంది
రంగువెలసిన బతుకులు
ఆకలిని అర్థనగ్నంగా ఆవిష్కరిస్తాయి
మట్టితో వాణిజ్యాన్ని పండించే చేతులు
హౌసింగ్ కాలనీల్లా బారులు తీరుతాయి
అపార్టుమెంట్లుగా కొలువు తీరుతాయి
ప్లాజాలు ప్లాజాలై పోటీ పడతాయి
పులికాట్‌ను వెతుక్కుంటూ వచ్చే విహంగాల్లా
నేలపట్టును ఆటపట్టుగా
ఆయువుపట్టుగా చేసుకొని
ఏ మట్టి సౌరభంలోనో పుట్టిన ఆ గువ్వలు
సముద్ర తీరాన్ని సైతం దాటే జాలర్లుగా
సరిహద్దు నేలను విడిచే సైనికుల్లా
అన్నం పెట్టే ఆ పనికోసం
హృదయ పతంగాన్ని ఎగురవేసి
ఊరుదాటి
ఏరు దాటి
గూడు వదలి
బిలబిలమంటూ
మహానగరారణ్యాలకు తరలివెళ్తాయి
మమతానుబంధాలకు పాతరేసి
కన్నతల్లి కడుపుతీపిని కాలరాసి
మాతృభూమిపై మమకారాన్ని
సొంత ఊళ్లో నిమజ్జనం చేసి
తల్లినేల సీకొల్లు సీమ
గుండు ఊసుల్ని, ఉద్వేగాల్ని వదిలేసి
అమ్మ ఒడి ఓరుగల్లు నగర
బంధనాల్ని, భావోద్రేకాల్ని తెంచుకొని
రేపటి ఆశలు ఆవిరై
కళ్ళముందే కల్లలై సాక్షాత్కరించగా
రాత్రి జ్ఞాపకాల్ని ప్రవహిస్తుంది
ధాత్రి మాతృమూర్తియై సేదదీరుస్తుంది
ఎన్నెన్ని ప్రభాతాలు
ఆ జనావళికి అగ్ని పరీక్షలై
ఆరని మంటల్ని ఎగజిమ్మాయో
ఎన్నెన్ని ఆశలు ఆదిలోనే
ఉత్పాతాలై గుండె గూటిలో పెను విషాదాల్ని
రగిల్చాయో



తమ స్వేదాన్ని ఊపిరిగా పోసి
కండల్ని బొట్లు బొట్లుగా కరిగించి
జీవితాన్ని ధనస్సులా ఎక్కుపెట్టి
అపార సంపదకు ఆకారంగా మారినవాళ్ళు
ఆకాశహర్మ్యాలకు అంకురార్పణ చేసిన వాళ్ళు
మట్టికి మంగళహారతులిచ్చిన వాళ్ళు
మహోదయానికి నాంది పలికిన వాళ్ళు
మట్టిని అపురూపం చేసినవాళ్లు
మహా ప్రసాదాలను నిర్మించిన వాళ్లు
శ్రమ జీవన శిల్ప నైపుణ్యంతో
అత్యద్భుత కట్టడాలకు ఆకృతులవుతున్న వాళ్ళు
అనన్య సామాన్య కళాకృతులను రూపొందిస్తున్న వాళ్ళు
కోట్లాదిజనం సురుచిర సుందర స్వప్నాలను
సాకారం చేస్తున్న వాళ్ళు
శిరసెత్తుకొని చెమట ముత్యాల్లా మెరుస్తూ
కట్టడాలై మనల్ని పలకరించే వాళ్ళు
నగరాల వైభవ ప్రాభవాలకు పునాది రాళ్ళు
ఇంద్ర ధనుసుల్ని నేలపైకి దించిన ధీశాలురు వాళ్ళు
భువిని రసధునిగా చేస్తున్న కార్యశీలురు వాళ్ళు
ప్రతిసృష్టి చేసే ఈ అపర బ్రహ్మలు
ఆకలిమంటలకు నిలువెత్తు నకళ్ళు
మేడలెన్ని కట్టినా
నీడలేని నిర్భాగ్యులు వాళ్ళు
కూడూ గూడూ లేని
మోడు వారిన బీళ్ళు
నగరం మేఘాల సరిహద్దుల్ని చెరిపేస్తూ
మేడలై, మిద్దెలై ఠీవిగా నిల్చున్నా
పట్టుచీరకట్టిన నవవధువులా
నగరం అంతస్తుల ఆభరణాలను సింగారించుకున్నా
కన్నీటి చెలమలైన వాళ్ల జీవనంలో
నిత్యం ఎదురు చూపులు విల్లంబులైన సవాళ్లు
మహానగరాలన్నీ మేరునగాలై
వింతశోభ వెల్లి విరుస్తున్న వేళ
నగరం భవనమై, భువనమై ప్రకాశిస్తూ
పరవశించే సమయాన
బ్రతుకే బరువై
గుండె చెరువై
ఉనికే ప్రశ్నార్థకమై
ఆ హరిత స్వప్న పాద ముద్రల కింద
నేలకదలబారు తున్నది.
ఈ కాంక్రీట్ కీకారణ్యంలో
తాపీ పట్టిన చేతులు
రాళ్ళెత్తిన కరాలు
ఆదుకొనే ఆపన్న హస్తాల కోసం
ఆబగా ఎదురుచూస్తున్నాయి
ఆశగా నిరీక్షిస్తున్నాయి.



April 2010 pages _25.03.2010.pmd 13 3/27/2003, 6:34 PM

కథ

# వల

## ఎల్.ఆర్. స్వామి

***"రామారావు సంగతి చెప్పరా..." కృష్ణ అన్నాడు. నేను మాట్లాడలేదు ముందుకు నడిచాను.***

***"ఎంత అడిగినా, వాడి సంగతి మాత్రం చెప్పవేంటిరా?" మళ్ళీ అడిగాడు కృష్ణ.***

***రామరావు మా చిన్ననాటి స్నేహితుడు. కృష్ణలాగే వాడూ నాకు ఆప్తుడే.***

నాలుగేళ్ళ తరువాత కలిసాడు కృష్ణ. బీచ్ రోడ్డున నడుస్తూ, చిన్ననాటి స్నేహితుల గురించి ముచ్చటించుకుంటున్నాం. జీవితపు అపరాహ్నవేళలో అస్తమించే సూర్యుని వైపు అడుగులు వేసే మాలాంటి వారికి, చిన్ననాటి విషయాలు ముచ్చటించుకోవటంకన్నా ఆనందం ఏముంటుంది !

"ఏం చెప్పమంటావురా...?" నిరుత్సాహంగా అన్నాను, నేను ముందుకు నడిచి బీచ్ ఒడ్డున వున్న గోడమీద కూర్చున్నాను.

"మంచో, చెడో తెలిసినవి అందరి గురించి చెప్పావు కదూ, రామారావు గురించి మాత్రం చెప్పవేంటిరా?" కృష్ణ ఆత్రుతగా అడిగాడు. "ఏమైందిరా వాడికి..?"

ఎదురుగా జీవితం అలా విస్తరించి వున్న సముద్రం వైపు దృష్టి మళ్ళించాను. మనిషి ధనదాహంలాంటి అలలు ముందుకు వచ్చి అడ్డు గోడని ఢీ కొడుతున్నాయి... గోడ మీద అక్కడక్కడ పగుళ్ళూ...

సముద్రంలో వేటకి వెళ్ళి వచ్చిన కొందరు జాలర్లు ఒడ్డునపడివున్న పడవల్లో విశ్రమిస్తున్నారు. కొందరు రేపటి వేటకి తయారవుతున్నారు. వలలు దులిపి ఆరేస్తూ ఆనాటి లాభనష్టాల లెక్కవేస్తున్నారు.

అవును మరి ! జీవితం లాభ నష్టాల లెక్కగా మారిపోయింది కదా !

జీవితంలో అలా చేపల వేటలో కూడా, అదృష్టం అందరిని ఒకలా వరించదు కదా ! కొందరికి రొయ్యలు దొరికితే, కొందరికి వంజిరాలు, మరికొందరికి తూరేగలు దొరుకుతాయి.

"మాట్లాడవేంటిరా?" సహనం కోల్పోయిన కృష్ణ గట్టిగా అడిగాడు.



ఇక రామారావు గురించి చెప్పకుండా వుండటం కుదరదని అనుకున్నాను.

"నీకు తెలుసుకదరా, రామారావు ముక్కుసూటి మనిషి. చిన్న ఉద్యోగమే అయినా డబ్బు చేసుకోగల ఉద్యోగం అయినా, న్యాయం, ధర్మమని కూర్చుని ఎవరివద్ద పైసా తీసుకునేవాడు కాదని తెలుసుగా.." సిగరెట్టు వెలిగిస్తూ అన్నాను.

"తెలుసు, తెలుసు. ఈ కాలంలో మడికట్టుకొని కూర్చుంటే లాభంలేదని కూడా చెప్పాను."

"నేనూ అన్నాను రా, వింటేగా..." గట్టిగా పొగపీల్చి అన్నాను.

"ఇప్పుడు సఫర్ అవుతున్నాడు."

"ఏమైందిరా...?"

"చివరిదశలో వాడే కక్కూర్తిపడ్డాడో, లేకపోతే అడ్డు తొలిగించటానికి ఎవ్వరైనా ఇరికించారో తెలియదు కాని అవినీతి నిరోధక శాఖా వారికి దొరికిపోయాడు రా..."

"రామారావే..!"

"నాకూ అదే ఆశ్చర్యంగా వుంది. తీసుకున్న దెంత.. పెద్ద మొత్తం ఏమికాదు.. రెండువేలు.. అయినా శిక్ష మామూలేగా.."

"అంటే."

"ఉద్యోగం నుంచి తీసేసారు పాపం ! పెన్షన్ కూడా ఆపేసారట.."

కృష్ణ నోటమాట రాలేదు. సిగరెట్ పీక నులుపి పారేసి గోడ మీద నుంచి లేచాను. జాలర్లు మాట్లాడుకుంటున్నారు. "వల మార్చాలయ్యా.." జాలరి కుర్రవాడు తండ్రితో అంటున్నాడు.." పెద్ద చేపలు అసలు వలలో చిక్కటం లేదు. చిన్న చేపలని పట్టి మనమూ బ్రతికేవున్నామని అనిపించుకోవచ్చు కాని ప్రయోజనం ఏమిటయ్య"

నిజమే.. నేను లేచాను వలమార్చాలి. పెద్ద చేపలే కావు తిమింగళాలు కూడా తప్పించుకోలేని వలతయ్యారు చెయ్యాలి.

■



April 2010 pages _25.03.2010.pmd 14 3/27/2003, 6:34 PM

## కవిత

# భూమి గీతం

రాజేశ్వరిదివాకర్ల



వయసు వికృతిలో
తొలి ప్రేమల కలయిక పల్లవిస్తుంది.
శిశిర వికృతిలో
చైత్రం చిగురు తొడుగుతుంది
రూప వికృతిలో
విత్తనం మొలకవేస్తుంది.
దేహ వికృతిలో
దశావతారం ప్రతిఫలిస్తుంది.
దర్ప వికృతిలో
విజయం కైవసమౌతుంది.

నిరాశా దైన్య హీన వికృతిని
ఆశా మలయానిలం పరిహరిస్తుంది.
హింసాద్వేష కోప వికృతులను
దయా స్నేహ భావ ప్రకృతి ప్రతిఘటిస్తుంది.

బుద్ధి వికృతుల విలయాలను
మనోజవాల కళ్లెం నిలదీసి ఆపుతుంది.
రాగ విరాగ సమన్వయ
ధృతి ధైర్య సంయోగమవుతుంది.

అచల విశ్వాస అఖండాకృతులకు
సకల వికృతులను స్వాగతించగల
ప్రతిభ కలుగుతుంది.
మానవతను మేలుకొలిపే
ధీమంతమొస్తుంది
కాలానికి నవ వసంతరూపం
అవతరిస్తుంది.

నగర వికృతిలో
నిజగుణాన్ని మరువలేని కోకిల
పురాతనమైన పాటపాడుతుంది
విశ్వ మానవ భూమి గీతం
ప్రతిధ్వనిస్తుంది.
సమజీవన మనోగతుల
అనురాగం మేళవిస్తుంది.

# నానీలు

మంత్రి కృష్ణమోహన్



'అమ్మ'లో
ద్విరుక్తమయ్యే 'మ' కారం
ఏంటో తెలుసా?
మమకారం.

పరుగు పందెం
గెలిచి తీరాలా?
ముందు
ఎదురుగాలినర్థం చేసుకో.

రైతు పాలిట
ఇద్దరూ ఇద్దరే
పొలాల్లో చీడలు
బైట దళారినీడలు

'చెట్టు' మీద
పద్యం రాశాను.
ఇప్పుడిక పచ్చదనంలో
పలు వర్ణాలు.

ఒబామా వచ్చినా
వైట్ హైస్ రంగు మారిందా?
శాంతి కోసమే
యుద్ధమట ! తాజాగా.

బుద్ధుడు చూసినవి
రోజూ చూస్తున్నాం
ఎంతమంది అయ్యారండీ
తథాగతులు?

# గమ్యం వేటలో...

సంగెవేని రవీంద్ర



ఉన్నచోటే ఉరుకుతూ
గమ్యం అందలేదనడం
అద్దానికి మసిపూయడమే...
నడుస్తున్నామనుకుంటాం కానీ నిజానికి
మనం పుట్టువికలాంగులం..
గమ్యం తానై వచ్చి గుమ్మంలో వాలాలనుకునే
మనోవికారబాధితులం...
దూరంగా మెరిసే గమ్యాన్ని
చూడలేని చీకటి నేత్రులం..
అనాదిగా సాగుతూనే ఉన్నా
గమ్యాలెందుకో అగమ్యాలవుతున్నాయి..
అదేం పట్టనట్లు కాంక్షలు ఆకాంక్షలు
బ్రహ్మజెముల్లా విస్తరిస్తూనే ఉన్నాయి..
ఖండిత ప్రయాణమే జీవప్రవాహానికి
అడ్డుకట్టలు వేస్తుంది..
దృఢంగా పడాల్సిన అడుగులెందుకో
మైనం ముద్దల్లా కరుగుతున్నాయి..
చూపు పడినంతనే గమ్యం చిక్కుతుందనే భ్రమ..
నడక నిలిచిపోయినా పరుగెడుతున్న మైకం..
అడుగు కదలకున్నా ఆకాశవిహంగాలపై
తేలుతున్న ఊహా...
కానీ మిత్రమా..!
ఊపిరి ముక్కలైనా నడక పెంచక తప్పదు..
అలసట కప్పుకున్న పాదాలకు పాదరసం
టీకాలు వేయక తప్పదు..
విస్మరించిన గమ్యాలు వెక్కిరిస్తాయి..
అవి అందని ద్రాక్షపళ్లేం కాదు
అంతరంగంలో పులుపు భావనలే
అసలైన అవరోధాలు..
నడకలో వాడీవేడీ ఉంటే
బాటలన్నీ బానిసలు కావాల్సిందే..
తప్పదు... నడవాల్సిందే...
తప్పదు... గమ్యం చేరాల్సిందే..
అక్కడి ఉదయంలో చూపులు
మొలకెత్తుతున్నాయ్ మరి..!



April 2010 pages _25.03.2010.pmd 15 3/27/2003, 6:34 PM

కథ

# మూసీ గట్టున

## కొలనుపాక మురళీధరరావు

***హైదరాబాద్ ఎదలో ఎన్ని సంస్కృతులు దాచుకుందో, ఏ పండుగొచ్చినా, ఎవరి పర్వదినమొచ్చినా ఎద ఉప్పొంగిపోతూంది. భిన్నత్వంలో ఏకత్వం, ఏకత్వంలో భిన్నత్వం జీర్ణించుకున్న హైదరాబాద్ సంస్కృతి సర్వజనాదరణమైంది. హైదరాబాదీయుల ప్రత్యేక వరవడితో తమ జీవన విధానం సాగిస్తారు. ఆప్యాయంగా "క్యాభాయ్! ఇరాని చాయ్ పీయింగే ఛలో" అంటూ భుజంపై చేయివేస్తూ పలుకరిస్తాడు. ఒడుదుడుకులు ఎదురైనప్పుడు 'బస్తీమే సవాల్' అని తొడచరుస్తాడు. వలస వచ్చిన వాళ్ళతో "వాలేకుంసలాం" వలసపోయేవాళ్ళకు 'ఖుదాఫీజ్' చెబుతాడు నవాబైన గరీబైన సరే.***



నాలుగు వందల సంవత్సరాల జీవిత ఒడుదుడుకులకు తట్టుకొని నాటి చారిత్రక కట్టడమైన 'చార్మినార్' అదే నండీ చార్‌మీనార్. ఆ ప్రక్కనే మక్కామసీదులో "అల్లాహో అక్బర్" అంటూ అల్లాను స్మరించే వేలగొంతుకలు. కులీకుతుబ్‌షా రాచరికంతో పాటు కలకాలం తలుచుకునే 'అక్కన్న మాదన్నలు'. వారి రాజకీయ ప్రజాకీయ చతురతకు తార్కాణం 'అక్కన్న మాదన్న ఆలయం'. గోలకొండ తానీషా రామదాసు బంధీఖాన తెలియని వారుండరు. 'నా దెబ్బ గొలకొండ అబ్బ' అనే జనం మెల్ల మెల్లగా కనుమరుగైపోతున్నారు. పట్నంలో షాలిబండ ఇప్పుడు ఎముకలు అతికే చికిత్సాలయానికి పేరుగాంచినది. చార్మినార్ నుండి శాలిబండ వైపు వెళ్ళేదారి ఒక ఫర్లాంగు దూరంలో ఒక చిత్రమైన శబ్దం 'టక్ టకా టక్' మిఠాయిలపై వేసే వరఖ్ కార్మికుల సమ్మెట చప్పుళ్ళు వినసొంపుగ ఉంటయి. కంటి ఇంపుగ నోరూ ఊరించే మిఠాయిలపై అందమైన వెండి (పన్నా) వరఖ్ కాగితముకన్న పలుచగ ఉల్లిపొరమాదిరిగా ఉండే పన్నా వరఖ్ గృహ కార్మిక పరిశ్రమ, ఎంతో లయబద్ధంగా పాదచారులను ఒక్కక్షణం మా జీవితాలను కూడా గమనించండి సాబ్, అన్నట్టుగా ఉంటుంది. ఇక పట్నంలో శాలిబండ తెలియని వారుండరు. బీదా బిక్కి నుండి అమీర్లు కూడా కాళ్ళుచేతులు విరిగినవారు. ఇంకా పెద్ద పెద్ద ఆసుపత్రులలో తగిన చికిత్స పొందలేని వారు ఇక్కడికి వస్తారు. "ఇక్కడ ఎముకలు అతుకబడును" ఆ వైద్యాన్ని వంశపారంపర్య చేస్తున్న హకీం సాబులు ఇక్కడ నెంబరు కార్డులు ఇస్తారు. ఆ ప్రకారం రోగులను చూస్తారు. అందరికి అదే పద్ధతి చాలా పేరుబడిన 'బోన్ సెట్టింగ్ సెంటర్' అని ఈనాడు నవ నాగరికులు పిలుచుకునే దావాఖానా.

'రిమ్ జిమ్ రిక్షావాలా' అనే పాటతో ఆ సినిమా ఈ చార్మినార్ నుండే చిత్రీకరింపబడినది. హిట్ అయిందాపాట. ఆనాటి నుండి అందరి నోళ్ళలో నానింది.

మా రిక్షా సాహెబ్ పేరు గులాం. పేరుకు దగ్గట్టుగ వినయ విధేయతలు గల మనిషి. చార్‌మినార్ ప్రాంతంలో "క్యాసాబ్ రిక్షా హోనా క్యా" అని అడిగాడు. ఈ రోజు సెలవు దినం గనుక చార్మినార్ ప్రాంతం అంతా రిక్షాలోనే తిరుగుతే చాలా విషయాలు తెలుస్తాయి అనుకుని "క్యాభాయ్ దాదాపు సాయంత్రం వరకు నాతోటే వుంటావా ఎంత ఇవ్వమంటావ్?" అడిగాను.

నాకేసి ఎగాదిగా చూసి "కష్టం చూసి మీరే ఇవ్వండి. సాబ్ ఈ మూడు చక్రాల బండే మా బతుకు బండి" అన్నాడు.

సరే అంటూ రిక్షా ఎక్కాను.

"ఈ మదీనా హోటలు చాలా మషూరు హోటల్. ఇక్కడ మంచి ఛాయి, గరం గరం సమోసా దొరుకుతుంది. ఇరాని చాయ్ పీనా, హైదరాబాద్ బిర్యాని కానా. రంజాన్ పండగకు రకరకాల వంటలతో షేర్, హరీస్ కబాబ్, డబల్‌కామీఠా నోరూరిస్తుంది" అంటూ హోటల్ మదీనా ముందు రిక్షా ఆపాడు. ఆ పరిసర ప్రాంతాలను ఒక్కసారి కలియజూశాను. మదీనా హోటలు ముందు హైకోర్టు భవనం. ఇది కూడ నిజాం కట్టించిందే. మూసీనది ఒడ్డున వుంది.

"చాయ్ తాగిన తరువాత హైకోర్టు భవనం చూసి ఆ తరువాత



April 2010 pages _25.03.2010.pmd 16 3/27/2003, 6:34 PM

మిగత ప్రదేశాలు చూద్దాం" అన్నాను.

"ఆఫ్ కా మర్జి సాబ్"

చాయి చాలా బావుంది. గరం గరం సమోసాలు రెండు తిన్నాను. రుచిగా ఉన్నాయి. గులాంసాబు కూడా తిన్నాడు. ఆ తరువాత హైకోర్టు భవనంలోకి వెళ్ళాను. హైదరాబాద్ ప్రాచీన కట్టడాల్లో ఇదొకటి. రాష్ట్ర న్యాయవ్యవస్థకు పెట్టింది పేరు. అద్భుతంగా ఉంది. అట్టే సమయం లేదు. గుంపులు గుంపులుగా కక్షిదారులు, న్యాయవాదులు హడావిడిగా తిరుగుతున్నారు. సైలెన్సు అంటూ కోర్టు అటెండర్లు హెచ్చరిస్తున్నారు.

అక్కడి నుండి దివాన్‌దేవిడి, సిటీ సివిల్ కోర్టు సముదాయం చూశాను. దివాన్ దేవిడిలో ఒకప్పుడు సాలార్‌జంగ్ మ్యూజియం ఉండేదట. ఇప్పుడు ఒక ప్రత్యేక భవన సముదాయంలో ఏర్పాటు చేశారు.

సాలార్‌జంగ్ మ్యూజియంలో అద్భుత కళాఖండాలు ఆలనాటి నవాబుల వస్త్రసముదాయం. వాళ్ళు వాడిన అస్త్రశస్త్రాలు, ఖడ్గాలు ప్రపంచ ప్రఖ్యాత గడియారం, చూడముచ్చటగా ఏర్పాటు చేశారు.



సాలార్‌జంగ్ మ్యూజియం సవిస్తరంగ చూడాలంటే ఒకప్పుడు వారం రోజులు పట్టేదట. సమయానుకూలంగా మరొక్కసారి మ్యూజియం చూడాలి. పత్తర్‌గట్టి - ఈ వీధిలో రాతి కట్టడంతో దుకాణాలు నిర్మించారు. మార్వాడీల వెండి బంగారు దుకాణాలు, బట్టల దుకాణాలున్నాయి. నగర వ్యాపార కేంద్రంగా ప్రసిద్ధి. ఇక్కడ బంగారు, రతనాలు, ముత్యాల వ్యాపారం విదేశాల ఖ్యాతి పొందింది. చార్మినార్ నాల్గు వీధుల కూడలి. ఇక్కడ చోటా బడా, ఫుట్‌పాత్, బండ్లమీద వ్యాపారం జోరుగ సాగుతుంది. ఉత్తరం వైపు పత్తర్ గట్టి, మచిలి కమాన్, తూర్పువైపు సైదాబాద్, మియాపూరు, పాతబస్తీ, దక్షిణం వైపు షాలిబండ, అక్కన మాదన్న ఆలయాలు, పడమర వైపు లాడ్ బజారు, చుడీ బజారు, చౌకు, చౌమహల్‌కు దారి, పాత నగర కూడలి ఈ అందమైన చార్మినార్ నాలుగు వందల సంవత్సరాల చరిత్రకు ప్రతీక. చార్మినార్ పైకి వెళ్ళి చూసి వచ్చే వాళ్ళం ఉచితంగా. ఇప్పుడు కట్టుదిట్టమైన పోలీసు బందోబస్తు. ఇటీవల కాలం ఆత్మహత్యలు కారణం చేత పూర్తిగా పై వరకు వెళ్ళే అనుమతి లేదు. ఇతర రక్షణ ఏర్పాట్ల దృష్ట్యా తగిన పోలీసు బలగం లేదు. పడమర వైపుకు వెళ్ళాను. దారిలో అనేకమైన అందంగా పేర్చిన గాజు షోకేసులలో ఉంచిన రకరకాల గాజులు. లాడ్ బజారులో అత్తరు సాహెబు, చుడీబజారులో గాజుల షాపులు, ముందుకు పోతే చౌక్ ఒకప్పుడు ఇక్కడ సెకండ్ హాండ్ పుస్తకాల షాపులుండేవి. ఇవి కోఠి మున్సిపల్ సముదాయంలోకి మార్చారు. ఇక్కడ సెకండ్ హాండ్ పుస్తకాలు ఎంతోమంది విద్యార్థులు, ఇంజనీర్లు, డాక్టర్లు, చరిత్ర విద్యార్థులకు అవసరమైనవి, ఇంకా ఇతర శాస్త్ర విజ్ఞానానికి సంబంధించినవి పాతవి కొత్తవి దొరకడమే గాక అద్దెకు కూడా ఇస్తారు. అక్కడే కొంచెం దూరం వెడితే అలనాటి నిజాం కట్టించిన 'చౌమహల్'. ఈ మధ్యకాలంలో సందర్శకులకు అనుమతి లభించడం వల్ల అందులోకి వెళ్ళాం. అదొక సుందరమైన రాజభవనం దాదాపు 52 గదులు. 'దివానే ఆం దివానే ఖాస్, అంతఃపురం గోషా స్త్రీలకు ఏర్పాటు చేసిన వేదిక, నిజాం కుటుంబ సభ్యులు వాడిన దుస్తులు, తలపాగాలు, వెండి వస్తువుల సముదాయం చిన్న సాలార్‌జంగ్ మ్యూజియంను తలపిస్తుంది. ఇంకా నౌబత్‌ఖనా' అంటే నవాబు గార్కి సంగీతం ఉత్తర హిందూస్తాని గాయకులు నౌబత్ వాయిద్యబృందంతో వినిపించే వారట. ఇంక ఆలనాటి రాజవైభవం, రాజాభరణాలు సొగసైన అందాల భామలతో గానా బజానాలతో చౌమహల్ భోగభాగ్యాలతో, గుర్రపు బగ్గీలు (కోచ్)తో విహారం రాచరికపు భవన సముదాయం. ఈ చౌమహాల్లా ఇప్పుడు ఇతరులకు బర్త్‌డే పార్టీలకు, ముషాయిరాలకు అనుమతిస్తుంది. ప్రభుత్వ సహకారంతో ఈ పురాతన కట్టడాలను టూరిజం వారు దీన్ని కూడా హైదరాబాద్ పర్యాటక ప్రదేశాలలో ఒకటిగా చేర్చి సందర్శకులకు సౌకర్యం గల్గించారు. అక్కడి నుండి చార్మినార్‌కు వచ్చేసరికి మా కడుపులో ఎలుకలు పరుగెత్తసాగాయి. ఇంతలో "ఆజ్ జుమ్మా హైసాబ్ నమాజ్ పడ్‌కే ఆతాహుం" మా గులాం సాహెబ్ మక్కా మసీదులో వెళ్తూ ఒక పావు గంటలో వస్తానని చెప్పాడు.

చార్మినార్ ప్రక్కనే వున్న అమ్మవారికి పూజలు చేయించేసరికి పదినిమిషాలు దాటింది. ఇంకా గులాం రాలేదు. మరొక్కసారి చుడీ బజారులోని ఒక గాజుల దుకాణంలోకి వెళ్ళాను. 'ఆయియే సాహెబ్ క్యాహోనా"? అంటూ దుకాణంలోకి ఆహ్వానించాడు దుకాణదారుడు. అక్కడ అందరూ స్త్రీలు గాజులు చేతికి వేయించుకుంటున్నారు. కొందరు తమకు నచ్చిన గాజులను ప్యాకింగు చేయించుకుంటున్నారు. నాకు నచ్చిన గాజులు నేను తీసుకొని ప్యాకు చేసుకున్నాను. ఇంతలో గులాం 'ఆయియే సాబ్' అంటూ నా దగ్గరికి వచ్చేసరికి నేను ఆశ్చర్యపోయాను.

" నేను ఇక్కడ ఉన్నానని నీకెలా తెలుసు?" అన్నాను.

" మేరేకో మాలుం హైసాబ్. ఆఫ్ కే జైలోగ్ యహీ దుకాన్‌కో ఆతే" అన్నాడు.

మళ్ళీ రిక్షా ఎక్కాను. కొంచెం దూరం వెళ్ళాక

"సాహెబ్ నీవెప్పుడైన చంచల్‌గూడా జైలుకు పోయినావా?" అని అడిగాను.

"అరె అల్లా నేనెందుకు పోతాను? గరీబు గాడ్ని అయినా నిజాయితీగా బతికాను" అన్నాడు.

" నేను చంచల్ గూడా జైలుకు చిన్నప్పుడే పోయాను" అన్నాను.

"సాబ్ ఇత్నా బడా ఆదిమి జైలు గయే. ఖూని కేసా, జేబులు కొట్టింద్రా" అదుర్దగా అడిగాడు.

"సాహెబ్ గులాం, నేను మా బంధువు కాంగ్రెసు పార్టీలో పనిచేస్తున్నప్పుడు అప్పటి నిజాం ప్రభువు అరెస్టు చేసి ఈ జైల్లో ఉంచారు. నేను మా నాన్నగారితో వారిని చూసేటందుకు వెళ్ళిన. నాకు భయం వేసింది. ఇప్పుడు మళ్ళీ ఆ జైలును చూడాలని ఉంది" అన్నాను.

"ఇక్కడికి చాలా దూరం సాబ్. అందులో జైలు మూసి వేస్తారట సాయంకాలం ఎవరికి కొత్తగ పర్మిషను కూడా దొరకదు. అసలే రోజులు బాగాలేవు" అన్నాడు. మా రిక్షావాలా. నా కోరికను అణచివేశాడు.

"సాహెబ్ గులాం సిటీ కాలేజీ వైపుకు వెడదాం" అన్నాను.



April 2010 pages _25.03.2010.pmd 17 3/27/2003, 6:34 PM

# అభివృద్ధికి ఆనవాలు

## బొమ్మరాత యల్లయ్య



పాపం! ఆ పిల్ల..
'అమ్మా' అన్న పదం నాలుకపై చెక్కుకుని
పొద్దు పొడుపుతో పాటు నడిచొస్తుంది
ఆకలి మంటతో ఉన్న అనుబంధంతో
జఠరాగ్నిని చల్లార్చుకుంటూ..
ఛీదరింపుల, ఛీత్కారాల
గాయాల్ని మోస్తుంటుంది
అఖండ భారతావనిలో
అడుక్కునే హక్కును వరంగా పొందింది

బాల్యానికి బహుదూరంగా
బతుకు తీగకు తగని భారంగా
కరుణలేని మాటలతో
కడుపునింపుకుంటూ
కన్నీళ్లను తాగి బతుకీడుస్తుంది
'అమ్మ' అయ్యేభాగ్యం లేనివాళ్లను సైతం
'అమ్మా' అని కడు కమ్మగా పిలుస్తూ
పులిసిన బువ్వ తిని పుణ్యాన్ని మూటగట్టిస్తుంది
కాలపరీక్షకు ధీటుగా నిలిచి
మరణానికి చరమగీతం వినిపిస్తుంది
చిరిగిన బట్టల్లో దేహాన్ని దాయలేక
చితికిన మనసును అతికించుకుంటుంది
వద్దన్నా వచ్చిన వయసుతో
చూపుల సూదులు గుచ్చుకున్న బంతౌతుంది
ఆమె అబలత్వాన్ని ఆసరాగా చేసుకున్న
కక్కుర్తి గాడెవడైనా కబళించి
కక్కిన వీర్యానికి ప్రతిఫలంగా
మరో అనాథ బిచ్చగత్తెకు అమ్మౌతుంది
అంచులు పోయిన బొచ్చెతో ఆ పిల్ల వెళ్తుంటే
అభివృద్ధి పథాన నడిచే నా దేశం స్ఫురిస్తుంది.

---

అది పాత కాలేజీ. ఈ పాత బస్తీకి ఇదే మొదటి కాలేజీ. ఆ తరువాత పెద్ద యూనివర్సిటి కట్టించాడు. నిజాం, అదే పేరుతో నిజాం కాలేజీ కట్టించిండు.



ఇది పురానాపూల్, దీని తరువాత ముజఫర్ పూల్, మూసినది పై కట్టిన వంతెనలు, ఈడ నుంచే నవాబు కొడుకు భాగమతిని కలుసుకునేవాడని మా తండ్రి చెబుతుండేవాడు. ఇక్కడనే జమ్మెరాత్ బజార్ అన్ని రకాలు పాతవి పురాతన సామాన్లు ఇంకా చిల్లరబేరాలు, ఒక బేస్తవారం నాడే సంతగా జరుగుతుంది. అందుకే 'జుమ్మెరాత్' బజారు అన్నారు. ధూల్‌పేట దొంగ సారాకు పెట్టింది పేరు. పీర్ల పండుగకు, గణేష్ ఉత్సావాలు వచ్చినవంటే భయం. రిక్షావాలా చెప్పుకుంటూ పోతునే వున్నాడు. నయాపూల్ వైపు వచ్చినాం.

సాబ్ చార్మినార్ కట్టినప్పుడు నాల్గు లక్షల తేదార జనాభా ఉండేదట. ఎన్నో రిక్షాలు, టాంగాలు నడిచేవి. ఇప్పుడవి పోయి ఆటోలు, డబల్ బస్సులు వచ్చి మా గరీబు గాండ్ల పొట్టలు గొడుతున్నాయి. సిటీ బస్సులు గల్లీల గుండా పోతున్నాయి.

"మరి ఇప్పుడు లాల్ టోపే (రోంటోపీలు) షేర్వానీలు కూడా కనుమరిగిపోయినట్టుంది గదా గులాం" అన్నాను.

"అవును సాబ్, ఇప్పుడంతా తారుమారైంది నియత్ పోయింది. ఇన్సానియత్ పోయింది. ఇప్పటి పైసల్లో బర్‌కత్ కూడా లేదు సాబు. ఎంత సంపాదించిన పూట గడవటం కష్టంగా ఉంది." మళ్ళీ మొదటికి వచ్చినాం "ఇంకోసారి ఇరాని చాయి తాగుదాం పద గులాం. అల్సిపోయినావు" అన్నాను.

"పదండి సాబ్ నల్లకాడ మొగం కడుక్కొని వస్తాను మీరు పదండి" అన్నాడు.

"సాహెబ్ గులాం నీవు ఎంత వరకు చదువుకున్నావ్" అని అడిగాను.

"నిజం చెప్పాల్నా సాబ్"

"నిజమే చెప్పు"

" డిగ్రీ చదువుకున్నా సార్!"

"నీవు డిగ్రీ చదివినావా ? మరి ఈ రిక్షా తొక్కడం ఏంటి?" ఆశ్చర్యంగా అడిగాను.

"అది నా దురదృష్టం. నేను చదివింది ఉర్దూ బి.ఎ. రజాకార్ల మూవెంట్‌తో అంతా నష్టపోయినాం. మా నాన్న అమ్మ చనిపోయింద్రు. నాకిద్దరు చెల్లెళ్ళు. ఇంకా పెళ్ళి కాలేదు. నాకు రాజకీయం తెలియదు. పైరవీ చేతకాలేదు. అందుకే ఈ రిక్షాను నమ్ముకొని బతుకుతున్నాను."

"అబ్బ ! సాహెబ్ ఇంక చెప్పకు" అని టైం చూశాను. అరైంది. ఇంకా పాతబస్తీ చూడాలనే కోరికను చంపుకున్నాను. లాల్‌దర్వాజ, అక్కన్నమాదన్న గుళ్ళు గోల్కొండ ఖిల్లా ఇంకా రామదాసు బందీఖానా, ఫలక్‌నామ ప్యాలెస్, గండిపేట, చిలుకూరు వెంకటేశ్వర ఆలయం, నెహ్రూ జువాలజీపార్క్ మిగిలిపోయాయి. ఫ్లడ్‌లైట్ల వెలుగులో చార్మినార్ వెలిగిపోతూంది.

సాహెబ్ గులాం చేతిలో రెండు వందల రూపాయలు పెట్టినాను. అతని ముఖం సంతోషంతో వెలిగింది "సరిపోయిందా?" అడిగాను.

"బస్ అయే సాహెబ్"

"సరే వస్తాను. మళ్ళీ కలుస్తాను"

"ఖుదా ఆఫీస్ సాహెబ్ అదాబ్ సాహెబ్" వినయంగా అన్నాడు

నేను కూడా "ఆదాబ్ హైదరాబాద్ ఫిర్ మిలింగే" అన్నాను.

ఇంకో యాభై రూపాయలిస్తూ

"షుక్రియా సాహెబ్" చెమర్చిన కళ్ళతో అన్నాడు.

అప్పుడే నేను ఎక్కవలసిన బస్సు వచ్చింది. చేయి ఊపుతూ బసెక్కాను. ■



April 2010 pages _25.03.2010.pmd 18 3/27/2003, 6:34 PM

**విశ్లేషణ**

# తెలుగులో భాషోద్యమాలు-పత్రికల పాత్ర

డా॥ కె.శారద

*నన్నయ్యకు ముందు నుంచీ దేనికదిగా మారుతూ వచ్చిన కావ్య లేదా గ్రాంథిక, వ్యవహార భాషా భేదాలు రెండూ ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో తీవ్ర వాదోపవాదాలకు దారితీశాయి. కావ్య భాష మారదనీ దాన్ని మార్చకూడదనీ ఒక వర్గమూ, శిష్ట వ్యవహారంలో ఉన్న భాషా రూపాన్నే గ్రంథ రచనలో ఉపయోగించాలని మరో వర్గమూ వాదించటంతో కవి పండితలోకం రెండుగా చీలిపోయింది. ఇందుకు కారణం ఇరవయ్యో శతాబ్దం నాటి ప్రత్యేక పరిస్థితే.*

ఇరవయ్యో శతాబ్ది ఆరంభమే ఉద్యమాలతో ఆరంభమైంది. తెలుగు పత్రికలు కూడా దిశా నిర్దేశంతో నిలదొక్కుకొన్న కాలమది. అప్పుడు బయల్దేరిన ఉద్యమాలన్నీ జాతీయోద్యమంలో లీనమవుతూ తమ ప్రత్యేకతను నిలుపుకొన్నాయి. ముందుగా భాషోద్యమాల ఆరంభ వికాస విజయాలను స్థాలీపులాక న్యాయంగా పరిశీలించి తెలుగు పత్రికల దోహదాన్ని విపులంగా చూడాలి.

వ్యవహారిక భాషాప్రయోగంలో ఉన్న సజీవత, సౌఖ్యాలను దృష్టిలో ఉంచుకొని దాని వ్యాప్తికి నడుం కట్టుకొన్న వారిలో ప్రథముడూ ప్రముఖుడూ గిడుగు రామ్మూర్తి పంతులు. ఆయన చెప్పిన సిద్ధాంతాన్ని ఆచరణలో చూపిన గురజాడ సదా స్మరణీయులు.

నన్నయ్యకు ముందు నుంచీ దేనికదిగా మారుతూ వచ్చిన కావ్య లేదా గ్రాంథిక, వ్యవహార భాషా భేదాలు రెండూ ఇరవయ్యో శతాబ్దం ఆరంభంలో తీవ్ర వాదోపవాదాలకు దారితీశాయి. కావ్య భాష మారదనీ దాన్ని మార్చకూడదనీ ఒక వర్గమూ, శిష్ట వ్యవహారంలో ఉన్న భాషా రూపాన్నే గ్రంథ రచనలో ఉపయోగించాలని మరో వర్గమూ వాదించటంతో కవి పండితలోకం రెండుగా చీలిపోయింది. ఇందుకు కారణం ఇరవయ్యో శతాబ్దం నాటి ప్రత్యేక పరిస్థితే.

**గ్రాంథిక భాష:**

లక్షణ విరుద్ధమైన భాష గ్రామ్యం. పామరుల వ్యవహారంలోగానీ, శిష్టుల వ్యవహారంలోగానీ, కవుల ప్రయోగాల్లోగానీ లక్షణానికి విరుద్ధమైతే అదంతా గ్రామ్యమని గ్రాంథికవాదుల అభిప్రాయం. అటువంటి భాష కావ్య ప్రయోగార్హం కాదని వారి అభిప్రాయం. స్థూలంగా చెప్పాలంటే గ్రాంథిక భాషా లక్షణాలుగా ఈ కిందివి కనిపిస్తాయి.

1.వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు ఉండకూడదు. సంధి ఖచ్చితంగా పాటించబడాలి. లేకపోతే యాడాగమం చేయాలి. ఒక సంధి బదులు ఇంకొక సంధి జరగకూడదు. వ్యవహార భాషలో ఉన్నమాటలు కావ్యభాషలో ఉండకూడదు. అర్థానుస్వార నియమం పాటించాలి.

2. మాండలిక రూపాలు ప్రయోగించకూడదు.

3. అన్యదేశి పదాలు ఉపయోగించకూడదు.

లాక్షిణికులు పెట్టిన నియమాలను కవి పండితులు నిష్ఠగా అనుసరించాలని ప్రయత్నించినా కావ్య భాషలో అన్య దేశ్య పదాలు, మాండలికాలు, వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలు చాలా ప్రాచీన కాలం నుంచే అక్కడక్కడ ప్రవేశించాయని వ్యవహార భాషావాదులు ఉదాహరణలు వెతికి చూపించారు. మాండలిక పద ప్రయోగం నన్నయ్య భారతంలోనే ఉందని, దారుణం, నితర్ధం లాంటి గోదావరి మాండలికాలను కూడా చూపించారు. కరకంఠుడు, ప్రాణగొడ్డం లాంటి వ్యాకరణ విరుద్ధ ప్రయోగాలను (నన్నయ భారతం) ఆర్య వ్యవహారంబు దృష్టంబు గ్రాహ్యంబని అంగీకరించారు.

చలన శీల స్వభావం కలిగిన భాషని నిలువ నీరులాగా ఉంచడం అసాధ్యమనే విషయం మార్పును అంగీకరించేవారు గ్రహిస్తారు. అలాంటివారే వ్యవహార భాషావాదులు.

**వ్యవహార భాష:**

వాగ్వ్యవహారంలో ఉండి పండితులంగీకరించిన కావ్యాల్లో లేఖన రూపంలో లేని భాషారూపాల్ని వ్యవహారికం అంటారు. ఇప్పటి తెలుగు భాషలో వాగ్వ్యవహార లిఖిత వ్యవహారాలు రెండూ ఒకే రకంగా సాగుతున్నాయి. కానీ సుమారు వందేళ్లక్రితం ఈ రెండు ఒకేరకంగా ఉండడానికి పెద్ద ఉద్యమమే అవసరమైంది.



April 2010 pages _25.03.2010.pmd 19 3/27/2003, 6:34 PM

## వ్యవహార భాషోద్యమం పూర్వరంగం :

ఆంగ్లేయులు భారతదేశంలో నిలదొక్కుకొని పరిపాలన సాగించిన కాలంలో వాళ్ల భాష ద్వారా విశ్వసాహితీ స్వరూపం తెలుగువారికి తెలియడం వల్ల విద్యాధికుల దృక్పథంలో, రాజకీయ సామాజిక జీవిత విధానాల్లో మార్పులొచ్చాయి. అందరికీ విద్య అవసరం అనే ఆలోచన వచ్చింది. 1857లో మద్రాసు, బొంబాయి, కలకత్తా వంటి నగరాల్లో విశ్వవిద్యాలయాలు ఏర్పడ్డాయి. అయినా ప్రభుత్వ ఆశయం నెరవేరలేదు.

1901లో సిమ్లాలో లార్డ్ కర్జన్ ఒక సమావేశాన్ని ఏర్పాటు చేశారు. భారతదేశంలో విద్యావ్యవస్థకు సంబంధించిన అనేక సమస్యల్ని సవివరంగా చర్చించడానికి ఆ సమావేశంలో అవకాశం కలిగింది. ప్రాథమిక స్థాయి నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు పరిష్కరించవలసిన అనేక సమస్యల్నీ, అంశాల్నీ గుర్తించి 150 తీర్మానాలను ఆమోదించి నూతన విద్యావిధానానికి కర్జన్ నాంది వేశారు. ఇందులో భాగంగా మాతృభాషలోనే విద్యాబోధన జరగాలనీ, పాఠ్యాంశాలను ప్రవేశపెట్టాలనీ నిర్ణయించారు.

*విశాఖపట్టణంలో ఎ.వి.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి.టి.శ్రీనివాస అయ్యంగారి దగ్గరకు వెళ్లి తన సందేహాలను ఆయన ముందుంచారు. ఆ విషయంగా తనకు తెలిసినవి చెప్పి విజయనగరంలో ఉన్న గురజాడ అప్పారావు గార్నీ, పర్లాకిమిడిలో ఉన్న గిడుగు రామ్మూర్తి పంతులుగార్నీ కలవమని సలహా ఇచ్చారు. ఏట్స్ దొర వాళ్లను కలుసుకొని గ్రాంధిక వ్యవహార భాషలపై తనకున్న అనుమానాలను తీర్చుకొన్నారు.*

భారతీయ భాషలు సాధించిన ప్రగతిని సమీక్షించవలసిందిగా 1903లో ప్రభుత్వం నిపుణుల సంఘాన్ని నియమించింది. రెండు సంవత్సరాల పాటు భారతీయ భాషల్ని నిశితంగా పరిశీలించిన సంఘం యూరప్‌లో వృద్ధి పొందుతున్న ఆధునిక శాస్త్ర పరిజ్ఞానాన్ని భారతీయ భాషల ద్వారా సామాన్య ప్రజానీకానికి అందుబాటులోనికి తీసుకురావాలని సిఫారసు చేసింది. ప్రాంతీయ భాషల అభివృద్ధి కోసం ప్రభుత్వం అధికారులను నియమించింది.

1906 ప్రాంతంలో విశాఖ కేంద్రంగా గంజాం, విశాఖపట్టణం, గోదావరి జిల్లాల పర్యవేక్షణాధికారిగా జె.ఎ.ఏట్స్‌దొర నియమింపబడ్డారు. తెలుగు భాష మీద అభిమానంతో తెలుగు నేర్చుకోవడమేగాక గ్రంథాలలో ఉన్న తెలుగుభాషకీ, వ్యవహారంలో వున్న తెలుగుభాషకీ చాలా వ్యత్యాసం ఉందన్న విషయాన్ని గ్రహించారు. విద్యార్థులు అర్థంకాని గ్రాంధిక రూపాల్ని యథాతథంగా గుడ్డిగా బట్టీ పట్టడాన్ని గమనించారు. రాసేభాషకూ మాట్లాడే భాషకూ మధ్య వైవిధ్యం ఎక్కువగా ఉంటే భాషా ప్రయోగ వ్యవస్థలో సంక్షోభం నెలకొంటుందనే అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. తెలుగుభాషలో అదే పరిస్థితి ఉందని గుర్తించారు. ఆవేదన పడ్డారు. విశాఖపట్టణంలో ఎ.వి.ఎన్.కళాశాల ప్రిన్సిపాల్ శ్రీ పి.టి.శ్రీనివాస అయ్యంగారి దగ్గరకు వెళ్లి తన సందేహాలను ఆయన ముందుంచారు. ఆ విషయంగా తనకు తెలిసినవి చెప్పి విజయనగరంలో ఉన్న గురజాడ అప్పారావు గార్నీ, పర్లాకిమిడిలో ఉన్న గిడుగు రామ్మూర్తి పంతులుగార్నీ కలవమని సలహా ఇచ్చారు. ఏట్స్ దొర వాళ్లను కలుసుకొని గ్రాంధిక వ్యవహార భాషలపై తనకున్న అనుమానాలను తీర్చుకొన్నారు.

ఏట్స్ దొర ప్రతి సంవత్సరం ఉపాధ్యాయ వార్షిక సమావేశాలను ఏర్పాటు చేసి బోధనా పద్ధతుల్ని గురించి ఉపన్యాసాలిప్పించేవారు. 1907 నుంచి 1910 వరకు జరిగిన ఉపన్యాస పరంపరలో గిడుగు రామ్మూర్తి పంతులుగారు జీవద్భాష ప్రాశస్త్యాన్ని వివరిస్తూ పాఠశాలల్లో విద్యార్థులకు బోధనా భాషగా శిష్ట వ్యవహారికం ఎందుకుండాలో అనేకానేక ఉపపత్తులతో నిరూపిస్తూ ప్రసంగాలు చేశారు. వ్యవహారిక భాష ఉద్యమరూపం దాల్చడానికి నాంది ఈ కాలంలోనే జరిగింది.

## వ్యవహారిక భాషోద్యమ చరిత్ర:

గిడుగు రామ్మూర్తి పంతులుగారు శిష్ట వ్యవహారికమే బోధనకు గ్రంథరచనకు తగినదని చెప్తూ గ్రాంధిక వాదులకు కూడా గ్రాంధిక భాష సరిగా రాదని 'ఆంధ్ర పండిత భిషక్కుల భాషా భేషజము' అనే గ్రంథంలో సప్రమాణంగా నిరూపించారు. ఇది విద్యావంతులైన పండితుల మధ్య స్పర్థకు దారితీసింది. ఈ స్పర్థ ఒక మహోద్యమానికి కారణమైంది. అంతవరకూ చర్చారూపంలో ఉన్న వాదోపవాదాలు గిడుగువారి రాకతో ఉద్యమరూపం దాల్చాయి. ఉద్యమారంభ సంవత్సరాన్ని 1910గా భావించవచ్చు. భావంలో భాషలో ఛందస్సులో కొత్తదారులు తొక్కిన గురజాడ అప్పారావు గారి నీలగిరి పాటలు, ముత్యాల సరాలు అదే సంవత్సరంలో ప్రచురింపబడ్డాయి. గిడుగువారి వాదాన్ని సమర్థిస్తూ నవంబరు 24న 'గ్రామ్య శబ్ద విచారణం' అనే వ్యాసం, సంవత్సరాంతంలోగా వాడుక భాష– గ్రామ్యము అనే వ్యాసం రాశారు. వీటితో గ్రాంధిక వ్యవహారాల్లో ఏదీ ఆచరణ యోగ్యమైనదన్న వాదన శాస్త్ర చర్చగా పరిణమించింది.

గిడుగువారి వాదనలో ప్రధానమైన అంశాలు నాలుగు. అవి:

1. సామూహిక విద్యా సౌకర్యాలకు కావ్యభాష చాలదు.
2. శాస్త్ర గ్రంథాలను, వచన రచనలను శిష్ట వ్యవహార భాషలో రాయటమనే సంప్రదాయం మనకుంది. దాన్ని పరిహరించకూడదు.
3. ఆధునిక విద్యాబోధన పద్ధతికి శిష్ట వ్యవహార భాషే తగింది.
4. గ్రాంధిక భాష పండితులకే రాదు. దాన్ని అభ్యసించటం కష్టసాధ్యం. అన్నివర్గాల విద్యార్థులకు కావ్యభాషాజ్ఞానం అక్కరలేదు. చిన్నయసూరి గారి వ్యాకరణం కావ్య భాషను కూడా పూర్తిగా వర్ణించలేదు. కాబట్టి దాన్ని ఆధారం చేసుకొని మన పూర్వకవి ప్రయోగాలను దిద్ది ప్రచురించటం తప్పని గిడుగువారు వాదించారు.

ఇటువంటి అభిప్రాయాలు కలిగిన గిడుగువారు గురజాడతో కలిసి మద్రాసు విశ్వవిద్యాలయం సెనేట్‌లు సభ్యుల హోదాల్లో పాఠ్యగ్రంథాలుగా ఆధునిక వచన రచనలే ఉండాలని ప్రతిపాదించారు. బుర్రా శేషగిరి రావు గారు. శెట్టి లక్ష్మీ నరసింహం గారు ఈ ప్రతిపాదనను బలపరచినారు.



April 2010 pages _25.03.2010.pmd 20 3/27/2003, 6:34 PM

ఇదే సమయంలో పి.టి.శ్రీనివాసయ్యంగారు **Indian Practical Arthematic** గ్రంథాన్ని తెలుగులోకి అనువదించారు. ఇది శిష్ట వ్యవహారికంలో అనువదించబడింది. వేదం వేంకట చలమయ్య రాసిన 'విధిలేక వైద్యుడు' గ్రంథం కూడా వ్యవహార భాషలో ఉంది. వావిలి కొలను సుబ్బారావు గారు వ్యవహార భాషలో రచింపబడిన గ్రంథాలను లక్షణ విరుద్ధాలని విమర్శిస్తూ "ఆధునిక వచన రచనా విమర్శనము" అనే పుస్తకం రాశారు. ఇదే సందర్భంలో పి.టి.శ్రీనివాసయ్యంగారు ఆ సంవత్సరంలో వ్యవహార భాషలో అచ్చయిన పుస్తకాలన్నింటినీ సమర్ధిస్తూ వ్యవహార భాషావాదులకు నూతనోత్తేజం కలిగేవిధంగా **Life or Death- a Plea for Vernaculars** అనే కరపత్రాన్ని ముద్రించారు. ఈ సిద్ధాంతాలను ప్రచారం చేయడానికిగాను కిళాంబి రామానుజాచార్యులు అధ్యక్షులుగానూ బుర్రా శేషగిరిరావు కార్యదర్శిగాను 'ఆంధ్ర సారస్వత సంఘం' విజయనగరంలో ప్రారంభమైంది.

మరొకవైపు వేదం వేంకటరాయ శాస్త్రి, కాశీభట్ట బ్రహ్మయ్యశాస్త్రి, వావిలికొలను సుబ్బారావు లాంటి పండితులు కొందరు కలిసి 'ఆంధ్ర సాహిత్య పరిషత్తు'గా ఏర్పడి వ్యవహారిక భాషావాదులకు వ్యతిరేకంగా నిలిచారు. వారివాదనలను వినిపించడానికి 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక'ను ప్రారంభించారు. 1910లో ప్రారంభమైన ఉద్యమం ఆంధ్రదేశంలోని జాతీయ, ఆంధ్ర, గ్రంథాలయ ఉద్యమాలతో పాటు సాగి పాఠ్య పుస్తకాలలోనేగాక సిద్ధాంత వ్యాసాల రచనలో కూడా వ్యవహారిక భాష అంగీకరింపబడే వరకు సాగింది. 1969లో ఫలప్రదమైంది.

> ***ఉద్యమం కోసమే పుట్టిన పత్రికలు కొన్నైతే ఉద్యమ స్ఫూర్తిని అందుకొని దానికి సహాయ సహకారాలందించినవి మరికొన్ని పత్రికలు. వ్యవహారిక భాషా వికాసానికి తెలుగు పత్రికలు చేసిన సేవ, పోషించిన పాత్ర చెప్పుకోదగ్గవిగానే ఉన్నాయి. మొత్తం మీద ఎక్కువభాగం పత్రికలు వ్యవహారిక వాదుల పక్షం నిలిచినట్లే భావించాలి. అయితే గ్రాంధిక భాషావాదులు కూడా తమ వాదనలకు బలం చేకూర్చుడానికి స్వంత వాణి వినిపించడానికి పత్రికల్ని స్థాపించుకొన్నారు.***

గ్రాంధిక, వ్యవహారిక భాషావాదుల మధ్య వాదనలు మూడు రకాలుగా జరిగాయి. అవి మద్రాసు విశ్వవిద్యాలయంలో సంబంధిత సంఘాల్లో జరిగిన వాదోపవాదాలు. రెండోవి బహిరంగ సభల్లో చేసిన ఉపన్యాసాల రూపంలో ఉన్నవి. మూడోవి ఆంధ్ర, ఆంగ్ల భాషల్లోని పత్రికల్లో జరిగిన పోరాటాలు.

**భాషోద్యమాల్లో తెలుగు పత్రికల పాత్ర:**

తెలుగులో తొలిపత్రిక పుట్టిన కాలానికి (1838) భాషోద్యమం ఆమడదూరంలో ఉంది. కానీ ప్రజాస్వామిక స్వభావంతో పుట్టిన పత్రికలు తప్పనిసరిగా ప్రజల వ్యవహారంలో ఉన్న భాషలోనే రచనల్ని ప్రసారం చేస్తాయి. ఇందుకు ఏ భాషా పత్రికయినా మినహాయింపు కాదు.

తెలుగులో ఆరంభదశలో (1838–1857) నడిచిన నాలుగు పత్రికల (వృత్తాంతి, వర్తమాన తరంగిణి, దినవర్తమాని, హితవాది) భాష వ్యవహార భాష. ఈ విధంగా తెలుగు పత్రికలు వ్యవహార భాషకు పట్టం కట్టాయి. విస్తరణ (1857–1972) దశలో వచ్చిన పత్రికలు కొన్ని పండితుల చేతుల్లో ఉండడం వల్ల వాటిలోని భాష గతి తప్పింది. మళ్లీ వీరేశలింగం పంతులు గారి పత్రికారంగ ప్రవేశంతో తెలుగు పత్రికల భాష మళ్లీ వ్యవహార భాషా బాట పట్టింది.

గ్రాంధిక వ్యవహార భాషల మధ్య వివాదం ఉద్యమస్థాయికి వెళ్లినప్పుడు ఏర్పడిన పండితుల సంఘాలు తమ అభిప్రాయాలను వెల్లడించడానికి ఎంచుకొన్న మార్గాలలో పత్రికలు ప్రధానమైనవిగా నిలిచాయి. ఉద్యమం కోసమే పుట్టిన పత్రికలు కొన్నైతే ఉద్యమ స్ఫూర్తిని అందుకొని దానికి సహాయ సహకారాలందించినవి మరికొన్ని పత్రికలు. వ్యవహారిక భాషా వికాసానికి తెలుగు పత్రికలు చేసిన సేవ, పోషించిన పాత్ర చెప్పుకోదగ్గవిగానే ఉన్నాయి. మొత్తం మీద ఎక్కువభాగం పత్రికలు వ్యవహారిక వాదుల పక్షం నిలిచినట్లే భావించాలి. అయితే గ్రాంధిక భాషావాదులు కూడా తమ వాదనలకు బలం చేకూర్చుడానికి స్వంత వాణి వినిపించడానికి పత్రికల్ని స్థాపించుకొన్నారు.

1885 అముద్రిత గ్రంథ చింతామణి స్థాపకుడు గ్రాంధికవాదే అయినా కన్యాశుల్కం భాషను ప్రశంసిస్తూ తన పత్రికలో రాశారు.

1910 నాటి ఆంధ్ర భారతి పత్రిక వ్యవహారిక భాషలో రచింపబడిన గురజాడ అప్పారావు గారి 'దిద్దుబాటు, మీ పేరేమిటి' కథలను ప్రచురించింది. వ్యవహారిక భాషావ్యాప్తికోసమే ప్రత్యేకంగా రచించిన తోకచుక్క లవణరాజు కథ, కన్యక మొదలైన కవితలను ఆంధ్రభారతి ప్రచురించింది. అయ్యంకి వెంకట రమణయ్య ఆంధ్ర భారతి స్థాపకులు.

1902లో ప్రారంభమైన కృష్ణాపత్రిక వ్యవహార భాషకు పాక్షికంగా స్థానాన్ని కల్పించింది. 1913లో జరిగిన ఆంధ్ర మహాసభల విశేషాలను మట్నూరి కృష్ణారావు 'కబుర్లు' శీర్షిక కింద వ్యవహారిక భాషలోనే రాశారు.

1919 ఫిబ్రవరిలో వీరేశలింగం అధ్యక్షతన ఏర్పడిన 'వర్తమానాంధ్ర భాషా ప్రవర్తక సమాజం ఆధ్వర్యంలోనే పర్లాకిమిడి నుంచి 'తెలుగు' పత్రిక వెలువడింది. నడిచింది ఒక్క సంవత్సరమే అయినా సాధించిన ఫలితాలు అమోఘమైనవనే చెప్పాలి.

పత్రిక ఆరంభ సంచికలో పత్రిక స్థాపనోద్దేశాన్ని గిడుగువారు – 'ఎందుకీ కొత్త తెలుగు పత్రిక మరి ఒకటి? దేశంలో' కావలసినన్ని ఉన్నవే పత్రికలు, అనేక విధములైనవి, వాటి వల్ల నెరవేరని, దీని వల్ల కాదగ్గదీ ఏమున్నది విశేష ప్రయోజనము? ఈ ప్రశ్నకు ప్రత్యుత్తరము వివరించి మనవి చేస్తున్నాము. చదువరులు సావధానముగా పక్షపాతము లేక చిత్తగింతురుగాక! నిజమే! అనేక పత్రికలున్నవి. పత్రికాధిపతులూ, సంపాదకులూ చాలా కష్టపడి ధనము ఖర్చుపెట్టి జనులకు అనేక విధాల ఉపకారము చేయడానికి ప్రయత్నము చేస్తున్నారు. వారి ఉద్దేశము దొడ్డదే. వారి ఉద్యమము కొనియాడదగినదే. కానీ వారి ఉద్దేశము చక్కగా నెరవేరలేదనినీ, వారి ఉద్యమము పూర్ణముగా ఫలించకుండా కొంతమట్టుకయినా వ్యర్థమవుతున్నదనిన్నీ మాకు తోస్తున్నది. ఇట్లే పుస్తకములు వ్రాస్తూ ఉన్నవారి ఉద్యమము సార్థకము కావడము లేదు. వ్యర్థముగా ధనము... ధనముకన్నా విలువగల దేహబలము, బుద్ధి



April 2010 pages _25.03.2010.pmd 21 3/27/2003, 6:34 PM

బలము వ్యర్థముగా వెచ్చించడము ఎంత కీడో గదా?

లోక వ్యవహారములో తేట తెలుగున నలుగురూ వాడుకొనే మాటలతో చెప్పితే స్పష్టముగా బోధపడే విషయము వాడుకలో లేని మాటలతో చెప్పితే వృథా ప్రయాసము కాదా? దాని వల్ల ఏమయినా లాభమున్నదా? లేదని తెలిసినా చాలామంది వ్యర్థముగా తాము ఆయాసపడి చదివేవారని ఆయాస పెట్టుకున్నారు... ఈ పత్రికలో మొట్టమొదట చర్చించే విషయము వ్యావహారిక భాష. దాని ప్రవృత్తి. దాని ఉపయోగములు దాని గౌరవము, దానిని ఉపేక్షించడం వల్ల దేశమునకు కలుగుతూ ఉన్న నష్టములు"– అని తెలిపారు.

'తెలుగు' పత్రిక ద్వారా వ్యవహారిక భాషోద్యమ ప్రచారానికి గిడుగువారు చేసిన కృషి ఫలించింది. వ్యాకరణ నియమాల భయంతో ఏర్పడిన సంకోచాల సంకెళ్లు వదలి యువరచయితలు వ్యవహారిక భాషలో వచన రచనకు ఉన్ముఖులయ్యారు.

తెలుగు పత్రిక ఇచ్చిన స్ఫూర్తితో ఉత్సాహవంతులైన యువకులు 1919లోనే సాహితీ సమితిగా ఏర్పడడమేగాక సమితి తరపున 'సాహితి' పత్రిక ప్రారంభించారు. ఈ పత్రిక వ్యవహారిక భాషలో చేసిన రచనలకు స్థానమిచ్చింది.

బలం పుంజుకొంటున్న వ్యవహారిక భాషోద్యమాన్ని ఎదుర్కోవాలని 1925 జనవరి నుంచి గ్రాంధికాంధ్ర వేదికగా 'వజ్రాయుధము' పత్రికను ప్రారంభించిన శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రిగారు 'గ్రామాచార్యులు' అనే పేరుతో గిడుగువారిని నిందిస్తూ పత్రికలో వ్యాసం రాశారు. వజ్రాయుధం పత్రిక సంపాదకులను సవాలు చేస్తూ గిడుగు రాసిన ఉత్తరం కూడా ఈ పత్రికలో ప్రచురించారు. 'వజ్రాయుధము' పత్రిక గిడుగు, శ్రీపాదల లేఖాస్త్రాలకు వేదికగా మారింది. వీరి తగవును పండిత పరిషత్తులు తీర్చాలనేంత వరకు వెళ్లాయి.

1934 ఏప్రిల్ ప్రబుద్ధాంధ్రలో 'తెనుగు పత్రికల సంపాదకులకు' అనే గిడుగు వారి వ్యాసం ప్రచురించబడింది. పత్రికా సంపాదకులందరూ శిష్ట వ్యవహారంలో ఉన్న భాష వాడవలసిందని వ్యాసంలో గిడుగువారు విజ్ఞప్తి చేశారు. ఆ వ్యాసంలోనే "తెలుగు పత్రికలన్నీ తెలుగు దేశమందున్న తెలుగువారందరికీ తెలియవలసిన విషయములు తెలియజేసి వారిని ఉద్ధరించడమునకు పుట్టినవిగానీ పండితులకోసము పుట్టలేదు. పత్రికా సంపాదకులు ప్రాచీనాంధ్ర భాషా పాండిత్యము గలవారైనా వారి పాండిత్యము వార్తాపత్రికలలో ప్రకటించడము వ్యర్థ ప్రయాసము"... అంటూ – "అభినవాంధ్ర భారతిని ఆంధ్ర సారస్వత పీఠము మీద కూర్చుండబెట్టి ఆ దేవికి పట్టాభిషేకము చేసే గౌరవము ఆంధ్ర పత్రికాధిపతులు పొందుదురు కాక" అని కోరారు.

1935 సెప్టెంబరు ప్రబుద్ధాంధ్రలో మారేపల్లి రామచంద్ర శాస్త్రిగారు "మన తెలుగు వార్తాపత్రికలలో వాడే భాష" అనే వ్యాసం రాసి వ్యవహార భాషా ప్రయోజనాన్ని చాటారు.

నవ్య సాహిత్య పరిషత్తు వేదికగా "ప్రతిభ" త్రైమాస పత్రిక 1936 మే నెలలో ప్రారంభమైంది. ఇది కూడా వ్యవహార భాషా ప్రచారానికి నడుం కట్టింది. ప్రారంభ సంచికలో గిడుగువారు పరిషత్తువారికి రాసిన జాబు ప్రచురింపబడింది. నవ్య సాహిత్య పరిషత్తు చతుర్థ సమావేశానికి అధ్యక్షత వహించిన కాశీనాధుని నాగేశ్వర రావు పంతులుగారు పట్టుదలతో పని చేస్తే ఒక్క సంవత్సరములో విశ్వ విద్యాలయాలూ పరిషత్తులూ చేయలేని పని సాధించగలరని– ఆ లేఖలో పంతులుగారిని ప్రశంసించారు.

1936లో ప్రారంభమైన 'వీణ' సాహిత్య పత్రిక ద్వారా వ్యావహారిక భాషావాదానికి వేదికగా పని చేసింది.

తెలుగు పత్రికా రచనను వ్యావహారికంలోకి తేవడానికి తీవ్రంగా కృషి చేసిన వారిలో సింహాద్రి గోవిందాచార్య, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు ముఖ్యులు. సి.జి. ఆచార్య గారు ప్రజాబంధు, జన్మభూమి మొదలైన పత్రికల ద్వారా వాడుక భాషకు వ్యాప్తి కలిగించారు. తాపీ ధర్మారావు గారు 'ప్రజామిత్ర'లో 'కొత్త పాళీ' శీర్షిక ద్వారా వ్యావహారిక భాషకు రూపకల్పన చేశారు. వీరగ్రాంధికవాదులైన పిఠాపురం మహారాజా వారు 1936లో స్థాపించిన 'జనవాణి' దినపత్రికను వ్యవహార భాషలో నడిపించిన ఘనత తాపీ ధర్మారావు గారిది. తెలుగు దినపత్రికలో వ్యావహారికానికి సంపూర్ణ ప్రవేశం కల్పించిన ఘనత ధర్మారావు గారిది. 1938లో ప్రారంభమైన 'ఆంధ్రప్రభ' (దినపత్రిక)లో న్యూస్ ఎడిటర్‌గా చేరి చీఫ్ ఎడిటర్‌గా ఎదిగిన నార్ల వెంకటేశ్వర రావు వీరగ్రాంధిక భాషావాదుల హృదయాలను సైతం చూరగొనగలిగిన వ్యవహారిక భాషను మలిచి సరికొత్త రచనా శైలికి మార్గదర్శకులయ్యారు.

గ్రాంధిక భాషను సమర్థిస్తూ వచ్చిన పండితులు కూడా పరిషత్తులూ, పత్రికలూ స్థాపించి తమ అభిప్రాయాలను వెల్లడించేవారు. అలాంటివాటిలో ఆంధ్ర సాహిత్య పరిషత్తు తరపున వచ్చిన 'ఆంధ్ర సాహిత్య పరిషత్పత్రిక' – "గ్రాంధిక భాష యోగ్యత దెల్ప దీక్షమై నొక నిఘంటువు గూర్చుచుండు కొరకు గ్రామ్య వాదమ్మును ఖండింపదగినట్టి పత్రిక జేపట్టి ప్రజల కొరకు"– అంటూ ప్రారంభమైంది. ఈ పత్రిక వ్యవహారిక భాషా వాదాన్ని ఖండిస్తూ వ్యాసాలను ప్రచురించింది.

తెలుగులో వచ్చిన భాషోద్యమంలో ఎక్కువ పత్రికలు వ్యవహారిక భాష వైపు మొగ్గుచూపి తమ అభ్యుదయ భావాలను చాటుకొన్నాయి.

■

***తెలుగు పత్రికా రచనను వ్యావహారికంలోకి తేవడానికి తీవ్రంగా కృషి చేసిన వారిలో సింహాద్రి గోవిందాచార్య, తాపీ ధర్మారావు, నార్ల వెంకటేశ్వరరావు ముఖ్యులు. సి.జి. ఆచార్య గారు ప్రజాబంధు, జన్మభూమి మొదలైన పత్రికల ద్వారా వాడుక భాషకు వ్యాప్తి కలిగించారు. తాపీ ధర్మారావు గారు 'ప్రజామిత్ర'లో 'కొత్త పాళీ' శీర్షిక ద్వారా వ్యావహారిక భాషకు రూపకల్పన చేశారు. వీరగ్రాంధికవాదులైన పిఠాపురం మహారాజా వారు 1936లో స్థాపించిన 'జనవాణి' దినపత్రికను వ్యవహార భాషలో నడిపించిన ఘనత తాపీ ధర్మారావు గారిది. తెలుగు దినపత్రికలో వ్యావహారికానికి సంపూర్ణ ప్రవేశం కల్పించిన ఘనత ధర్మారావు గారిది.***



April 2010 pages _25.03.2010.pmd 22 3/27/2003, 6:34 PM

## కవిత

# అమృతమూర్తి

సిరిసిల్లాగపూర్ శిక్షక్

మమతానురాగాల
అమృతమూర్తి మౌన రోదన
ప్రపంచీకరణ
ఓల్డ్ ఏజ్‌హౌసుల్లో
గోడలను దాటని ఆవేదన
పేగు బంధాన్ని
తెగిన దారాలనుచేసి
ప్రేమ సంబంధాలన్నీ
తోడును విడిచేస్తే
అవిటిదైన ప్రేమ
సహనమూర్తిని పరీక్షిస్తున్నది
భూదేవంత ఓర్పునిజమేనా, అని
భరించేవాడు తీరం దాటకముందే
తిరిగిరాని లోకాలకు వెళ్ళి
తోడును విడిచేస్తే
అన్నీ తానై
పుత్రుడి ప్రతిబాధకు మందై
ప్రతి ఆలోచనకు ప్రతిరూపమై
కడుపు కట్టుకుని పెంచుకున్న
నమ్మకాన్ని వ్యవస్థ మీద పరిరక్షించుకుంటున్నది
ప్రేమ సంబంధాలన్నీ
కాలంలో కల్సిపోతుంటే
నిస్సహాయ చూపులతో
వృద్ధాప్యంలో తోడులేక
ఆదరించే హస్తాలకై
ఎదురు చూస్తున్నది.



# రెక్కలు

గోపాలుని వెంకటేశ్వర్లు



గతాన్ని తవ్వుకొని
కృంగిపోతూ
కుమిలిపోతూ
చిక్కి శల్యమవుతూ-
బాధ
అక్షయ తూణీరం!

సంతోషమైనా
దుఃఖమైనా
కళ్ళు
నీటి చెలమలే-
అనుభూతులు
కావ్యాలు!

ఇంకా ఎన్నాళ్ళు
భ్రమలో
భ్రమరం
భ్రమణం
వాస్తవం
అధినేత!

పసితనంలోనే
ఆటలు, పాటలు
అవన్నీ మది బీరువాలో
భద్రంగానే-
బాల్యం మెత్తని గుడ్డలో
చుట్టి దాచిన వజ్రం

మాటలు
ఈటెలై
మనసును
ఛేదిస్తాయి-
అహం
చేటు!

అనుభూతులు
అనుబంధాలు
అనుభవాలతో కలసి
అంతర్లయగా ప్రవహిస్తూ-
మనసు
వాడని పరిమళం!

ఆత్మవంచనలతోనే
జీవితాన్ని
గడిపేస్తే
ఎలా?
జీవితం
రంగుడబ్బ!

మండే వేసవిలో
ఆకస్మాత్తుగా
మలయ మారుతం
వస్తే-
తన్మయత్వం
గొప్ప భావవీచిక!

# మహాసంగ్రామం

డా॥ ఈదూరు సుధాకర్

ఈ సంగ్రామం
రాజుల మధ్య రాజ్యాలమధ్య కాదు
సైనికుల మధ్య సైనిక కుటుంబాల మధ్య
ఈ సంగ్రామం
విద్యమధ్య -
విద్యార్థుల మధ్య కాదు
విద్యాసంస్థల మధ్య
ఇక్కడ
ఆరవ తరగతికి - ఐఐటి
ఎనిమిదవ తరగతికి - ఇంటర్ బోధిస్తారు
చెంబుడు బుర్రలో బిందెడు గుమ్మరిస్తారు



ఎవరో ఒకరో ఇద్దరో
జన్మతహా జలస్థంభన విద్య
నేర్చిన వీరులు తప్ప
అర్భకులు ఆత్మహత్య చేసుకుంటున్నారు
ఈ వీరుల పోషణార్థం
సైనికులు - సైనిక కుటుంబాలు
అదనపు భారంతో బలయిపోతున్నారు
ఈ సంగ్రామం -
కత్తులతో కాదు - కలాలతో
ఈ సంగ్రామం -
మార్కుల కోసం కాదు - ర్యాంకుల కోసం
.......... సారీ......... ర్యాంకర్ల కోసం !



April 2010 pages _25.03.2010.pmd 23 3/27/2003, 6:35 PM

## వర్తమానం




# వాతావరణాన్ని కాదు వ్యవస్థను మార్చాలి

హ్యూగో ఛావెజ్

***2009 డిసెంబర్ 7 నుండి 18 వరకు డెన్మార్క్‌లోని కోపన్ హగన్ నగరంలో వాతావరణ మార్పులపై జరిగిన శిఖరాగ్ర సదస్సులో అనేక దేశాల, ప్రభుత్వాల అధినేతలు ప్రసంగించారు. వీరందరిలోకి వెనిజులా అధ్యక్షుడు హ్యూగో ఛావెజ్ ప్రసంగం ప్రత్యేకంగానూ, విశిష్టంగా సాగింది. శిఖరాగ్ర సభ ముగింపు దశలో డిసెంబర్ 17వ తేదీన సభనుద్దేశించి ఆయన చేసిన ప్రసంగం పూర్తి పాఠాన్ని దిగువ ఇస్తున్నాం.....***

ఈ మధ్యాహ్నం చాలామంది మాట్లాడిన దానికన్నా నేను ఎక్కువ సమయం తీసుకోబోనని మీకు హామీ ఇస్తున్నాను. బ్రెజిల్, చైనా, భారత్, బొలీవియాల ప్రతినిధులు మాట్లాడిన దానిపై నేను కూడా కాస్త మాట్లాడుతాను. సదస్సులో ప్రవేశపెట్టిన పత్రం ప్రజాస్వామ్యయుతంగా లేదని, సమగ్రంగా లేదని బొలీవియా ప్రతినిధి వ్యాఖ్యానించారు. నేను ఇప్పుడే వచ్చాను. ఇంతకుముందు సమావేశాలకు అధ్యక్షత వహించిన వారు ఒక పత్రం వస్తున్నట్లు చెప్పారు. నేను దానికోసం అడిగాను. కానీ ఇంకా అది నా చేతికి రాలేదు. ఆ పత్రంలో ఉన్న బ్రహ్మ రహస్యమేమిటో ఎవరికీ తెలియదనే నేను అనుకుంటున్నాను. అది ప్రజాస్వామ్యయుతంగా లేదని, సమగ్రంగా లేదని బొలీవియన్ కామ్రేడ్ పేర్కొన్నారు. ప్రపంచ వాస్తవం కూడా అంతేగదా? మనం ప్రజాస్వామ్య ప్రపంచంలో నివసిస్తున్నామా? ప్రపంచ వ్యవస్థ సమగ్రతను కలిగివున్నదా? ఈ భూగోళంపై సామ్రాజ్యవాద నియంతృత్వం మనకెదురవుతున్నది. ఇక్కడ నుంచే దానిని మనం నిరసిస్తున్నాము. సామ్రాజ్యవాద నియంతృత్వం నశించుగాక! ప్రజలు, ప్రజాస్వామ్యమూ, సమానత్వమూ చిరకాలం వర్ధిల్లాలి! (ప్రతినిధుల హర్షధ్వానాలు మిన్నుముట్టాయి)

తృతీయ ప్రపంచంలోని మనకన్నా అధికులమని భావించే దేశాలు కొన్ని ఉన్నాయి. ఇలాంటి పరిస్థితిలో ప్రజాస్వామ్యం లేకపోవటంలో ఆశ్చర్యం లేదు. ప్రపంచ సామ్రాజ్యవాద నిరంకుశత్వానికి తిరుగులేని రుజువును మనం ఇక్కడే చూస్తున్నాము. కోపెన్‌హగన్ వీధులలో నిరసన ప్రదర్శనలు జరుగుతున్నాయి. చాలామంది అరెస్టు అయ్యారు. వారిలో ఎక్కువమంది యువజనులే. వారందరికీ నేను అభినందనలు తెలుపుకుంటున్నాను. యువజనులను రేపటి పౌరులుగా మనం భావించటం కద్దు. ఇక్కడవున్న మనలో ఎక్కువ మంది వయసు పడమటి పొద్దువంటిది. ఈ పొద్దుత్వరలోనే అస్తమించనున్నది. కానీ యువతరం అలాకాదు. వారు, ఉదయించి పైపైకి వస్తున్న సూర్యునివంటి వారు. వారికే ఆందోళన ఎక్కువ.

మహోన్నతుడైన కార్ల్‌మార్క్స్ మాటలను అనుకరిస్తూ, కోపెన్‌హగన్ వీధుల్లో ఒక భూతం వెంటాడుతున్నట్లు ఒకానొకరు వ్యాఖ్యానించారు. వాస్తవానికి ఈ హాలులోనే, మన మధ్యనే ఒక భూతం మౌనంగా తిరుగాడుతున్నదని నేను భావిస్తున్నాను. అదొక భయంకర భూతం. ఏ ఒక్కరూ దాని గురించి ప్రస్తావించటానికి ఇష్టపడరు. పెట్టుబడిదారీ విధానమే ఆ భూతం (ప్రతినిధుల హర్షధ్వానులు).

వీధుల్లో అనేక నినాదాలు మార్మోగుతున్నాయి. వాటిని వినండి. నేను కొన్నింటిని మీకు వినిపిస్తాను. అలా నినదిస్తున్న వారిలో ఎక్కువమంది యువకులే. కొంతమంది యువతులు కూడా ఉన్నారు. ఉదాహరణకు రెండు అద్భుతమైన నినాదాలను మీకు చెపుతాను. ఒకటి : వాతావరణాన్ని మార్చకండి, వ్యవస్థను మార్చండి. దానినే నామాటల్లో చెపుతాను. మనం వాతావరణాన్ని మార్చవద్దు, వ్యవస్థను మార్చుకుందాం! అలా చేసినట్లయితే మన భూగ్రహాన్ని రక్షించుకోడం ప్రారంభించిన వారమవుతాము. పెట్టుబడిదారీ విధానం అనేది వినాశకరమైన అభివృద్ధి మార్గాన్ని అనుసరిస్తుంది. ఈ మార్గం జీవానికి మరణ శాసనం రాస్తుంది. మానవ జాతిని నిర్మూలిస్తుంది.

రెండవ నినాదం కూడా ఆలోచింప చేసేదిగా ఉన్నది. ప్రపంచాన్ని దెబ్బతీసిన బ్యాంకుల సంక్షోభాన్ని అది ప్రస్తావిస్తున్నది. బ్యాంకర్లకూ, బడా బ్యాంకులకూ సంపన్న దేశాలు పెద్దయెత్తున సహాయం చేశాయి. నాకు అంకె సరిగ్గా గుర్తులేదు గాని బ్యాంకులను రక్షించడానికి గాను అమెరికా, పెద్దమొత్తంలోనే సహాయం చేసింది. వాతావరణం కూడా బ్యాంకుల వంటిదే అయితే దానిని కూడా ఇప్పటికే రక్షించి ఉండవలసిందన్న నినాదం వీధుల్లో మార్మోగుతున్నది. ఇది నిజమేనని నేను కూడా భావిస్తున్నాను. వాతావరణం అతిపెద్ద పెట్టుబడిదారీ బ్యాంకు అయేటట్లయితే సంపన్న దేశాల ప్రభుత్వాలు దానిని కాపాడాలి.

అమెరికా అధ్యక్షుడు ఒబామా ఇంకా రాలేదనే అనుకుంటున్నాను. మరింత మంది అమాయకులను చంపేందుకు కోసం ఆయనగారు ఆఫ్ఘనిస్థాన్‌కు 30,000 మంది సైనికులను పంపిన రోజునే నోబెల్ శాంతి బహుమతిని అందుకున్నారు. అమెరికా అధ్యక్షుడైన



April 2010 pages _25.03.2010.pmd 24 3/27/2003, 6:35 PM

ఆయనగారు ఇప్పుడు నోబెల్ శాంతి బహుమతిని పట్టుకుని ఇక్కడ నిలవబోతున్నాడు. డబ్బును తయారు చేసే యంత్రాంగం అమెరికాకు ఉన్నది. వారు డాలర్లను ముద్రిస్తారు. బ్యాంకులను, పెట్టుబడిదారీ వ్యవస్థను రక్షించగలమని భావిస్తారు. ఇంతకుముందు కూడా నేను ఈ విషయాన్ని చెప్పాను. అది అలా ఉండనివ్వండి. మనం బ్రెజిల్, భారత్, బొలీవియా, చైనాలకు మద్దతు పలుకుదాం.

మన భూగోళాన్ని సంపన్న దేశాలు ఎలా ధ్వంసం చేస్తున్నదీ సంఖ్యా వివరాలతో సహా వివరించే పుస్తకం ఒకటి నా దగ్గర ఉన్నది. దీనిని ఫ్రెంచి రచయిత హెర్వ్ కెంఫ్ రాశారు. ఏసుక్రీస్తు చెప్పిన మాట ఒకటి నాకు గుర్తుకువస్తున్నది. "సూది బెజ్జంలో గుండా ఒంటె దూరుతుంది గాని ధనికుడు స్వర్గలోక రాజ్యంలో ప్రవేశించలేడు" అన్నదే ఆ మాట. మన భూగోళాన్ని ధనికులు నాశనం చేస్తున్నారు. దీన్ని నాశనం చేస్తే మరోదానికి వెళ్ళవచ్చునని వారు భావిస్తున్నారా? మరో గ్రహానికి వెళ్ళటానికి వారు పథకం వేస్తున్నారా? కాని మన పాలపుంతలో జీవించటానికి అనుకూలమైన గ్రహం లేదే! పైన నేను పేర్కొన్న రచయిత ఇలా రాశాడు. మనం వినియోగాన్ని తగ్గించకుండా, అసమానతపై పోరాడకుండా వస్తు వినియోగాన్ని తగ్గించలేము. "ప్రాపంచిక దృష్టితో ఆలోచించి స్థానికంగా ఆచరించు." 'తక్కువ వినియోగం చక్కని పంపిణీ' అన్న దానిని కూడా దానికి జత కలుపుదాము. ఫ్రెంచి రచయిత మనకు చక్కని సలహా ఇచ్చాడు.

• • • • • • • • •

***అమెరికా, చైనాలను ఒకే గాటన కట్టటం నాకు కాస్త ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అమెరికా జనాభా త్వరలో 30 కోట్లకు చేరుకోనున్నది. అమెరికా జనాభాకన్నా చైనా జనాభా ఐదురెట్లు ఎక్కువ. అమెరికా రోజులకు 2 కోట్ల బ్యారెల్స్ చమురును వినియోగిస్తున్నది. చైనా కేవలం 50 లేదా 60 లక్షల బ్యారెల్స్‌ను వినియోగిస్తున్నది. కనుక అమెరికా, చైనాలను ఒకే కాటన కట్టలేము. దీనికి సంబంధించిన సత్యాసత్యాల గురించి దేశాధినేతలు చర్చించవలసి ఉంది.***

• • • • • • • • •

సభాధ్యక్షా, వాతావరణంలో మార్పులనేవి ఈ శతాబ్దానికి చెందిన అత్యంత వినాశకరమైన సమస్య అనటంలో ఎలాంటి సందేహమూ లేదు. వరదలు, కరువులు, పెనుగాలులు, తుఫానులు, మంచు కరగడం, సముద్రమట్టాలు పెరగటం, సముద్రాలలో రసాయనాల పాళ్ళు పెరగటం, వేడి గాలులు వంటివన్నీ ప్రపంచంలో సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. నేటి మానవుని కార్యకలాపాలు విపరీతంగా పెరుగుతున్నాయి. ప్రాణికోటి మనుగడకే ముప్పు వస్తున్నది. అయితే ఇందులో కూడా మనం బాగా వెనుకపడి ఉన్నాము. నేనిక్కడొక విషయాన్ని జ్ఞాపకం చేసుకుంటున్నాను. 50 కోట్లమంది ధనికులు, వీరు ప్రపంచ జనాభాలో 7 శాతంగా ఉన్నారు. 50 శాతం కాలుష్యానికి ఈ 7 శాతమే కారణం. కాగా 50 శాతంగా ఉన్న పేదల కారణంగా కేవలం 7 శాతం కాలుష్యం మాత్రమే విడుదల అవుతున్నది. అమెరికా, చైనాలను ఒకే గాటన కట్టటం నాకు కాస్త ఆశ్చర్యాన్ని కలిగిస్తున్నది. అమెరికా జనాభా త్వరలో 30 కోట్లకు చేరుకోనున్నది. అమెరికా జనాభాకన్నా చైనా జనాభా ఐదురెట్లు ఎక్కువ. అమెరికా రోజుకు 2 కోట్ల బ్యారెల్స్ చమురును వినియోగిస్తున్నది. చైనా కేవలం 50 లేదా 60 లక్షల బ్యారెల్స్‌ను వినియోగిస్తున్నది. కనుక అమెరికా, చైనాలను ఒకే గాటన కట్టలేము. దీనికి సంబంధించిన సత్యాసత్యాల గురించి దేశాధినేతలు చర్చించవలసి ఉంది. సభాధ్యక్షా, భూగ్రహ పర్యావరణంలో 60 శాతం దెబ్బతిన్నది. భూమి పైపొరలో 20 శాతం తరుగుపోయింది. భూములు కోత పడుతున్నాయి. అడవులు తరగిపోతున్నాయి. పరిశుభ్రమైన నీరు కరువవుతున్నది. సముద్ర సంపదల వినియోగం పెరుగుతున్నది, జీవ వైవిధ్యం నష్టపడుతున్నది. భూమి వినియోగం పెరిగిపోతున్నది. ప్రతిరోజూ తయారీకన్నా వృధా ఎక్కువగా ఉంటున్నది.

కాలుష్యం పెరిగిపోతున్నది. వనరులను అతిగా వినియోగించే వారి రాజకీయ సంకుచితత్వమూ, స్వార్ధమూ పేదలను, అన్నార్తులను, రోగాల బారిన పడుతున్న వారినీ, ప్రకృతి విపత్తులనూ పట్టించుకోవటం లేదు. ఆర్థికంగా, సాంకేతికంగా అభివృద్ధి చెందిన వారే కాలుష్య నివారణకు ఎక్కువ బాధ్యత వహించాలి. పేద దేశాలకు సాంకేతిక, ఆర్థిక సహాయాన్ని అందచేయాలి. అంతేకాక, చిన్న చిన్న దేశాలను, పేద దేశాలను దృష్టిలో ఉంచుకోవాలి. కాలుష్యం అనేది మానవ జాతి ఎదుర్కొంటున్న విపత్తు మాత్రమే కాదు. ధనిక, పేద దేశాల మధ్య అసమానతలు పెరుగుతున్నాయి.

ప్రస్తుత ప్రపంచంలో 500 మంది కుబేరుల ఆదాయం, 41.60 కోట్ల పేదల ఆదాయంకన్నా ఎక్కువ. రోజుకు రెండు డాలర్ల కన్నా తక్కువ ఆదాయంతో దాదాపు 280 కోట్ల మంది బ్రతుకుతున్నారు. ప్రపంచ జనాభాలో 40 శాతంగా వున్న వీరు ప్రపంచ ఆదాయంలో కేవలం 5 శాతాన్ని మాత్రమే పొందుతున్నారు. ప్రతియేటా 92 లక్షలమంది పిలలు ఐదో యేడు రాకుండానే మరణిస్తున్నారు. వీరిలో 99 శాతం పేద దేశాలకు చెందిన పిల్లలు. ప్రతివేయి జననాలలో 47 మంది శిశువులు మరణిస్తున్నారు. సంపన్న దేశాలలో వేయి జననాలకు కేవలం ఐదుగురు మాత్రమే మరణిస్తున్నారు. ప్రపంచ సగటు ఆయుర్దాయం 67 సంవత్సరాలుకాగా, ధనిక దేశాలలో ఇది 79 సంవత్సరాలుగానూ, కొన్ని పేద దేశాలలో 40 సంవత్సరాలుగానూ ఉంటున్నది. దీనికి తోడు 110 కోట్ల మందికి శుభ్రమైన తాగునీరు లభించటం లేదు. 260 కోట్ల మందికి పారిశుద్ధ్య సౌకర్యాలు ఉండటం లేదు. 80 కోట్లమందికి పైగా నిరక్ష్యరాసులు, 102 కోట్ల మంది అన్నార్తులు నేటి ప్రపంచంలో ఉన్నారు.

అసలు కారణాలేమిటో చర్చించుదాం. మనం బాధ్యతలనుండి తప్పుకోరాదు. మనం సమస్య మూలాలను తడవకుండా విడచిపెట్టరాదు. ఈ వినాశానానికి పెట్టుబడిదారీ వ్యవస్థే కారణం. స్వేచ్ఛా పిపాసి లియోనార్డ్ బఫ్ ఈ విధంగా చెపుతాడు. "దీనంతటికీ కారణమేమిటి? వేటి సహాయంతో సమస్త భూవనరులనూ యధేచ్ఛగా దోపిడీ చేయాలనుకుంటున్నారో, ఆ శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకుని పాదార్థిక సంచయనాన్ని, అనంతమైన పురోగతినీ సాధించటం ద్వారా ఆనందాతిశయాన్ని పొందాలన్న స్వప్నమే ఇందుకు కారణంగా ఉంది". ఛార్లెస్ డార్విన్ ప్రవచించిన నేచురల్ సెలెక్షన్ సిద్ధాంతాన్ని ఈ సందర్భంగా ఆయన ప్రస్తావిస్తాడు. బలహీనమైన



April 2010 pages _25.03.2010.pmd 25 3/27/2003, 6:35 PM

దానిపై ఆధారపడి బలమైనది బ్రతుకుతుందన్న సంగతి మనకు తెలుసు బలమైన దానికీ, బలహీనమైన దానికీ నడుమ స్వేచ్ఛ నలిగిపోతుందని రూసో చెపుతాడు. స్వేచ్ఛ గురించి రాజ్య వ్యవస్థ చెప్పటం కూడా ఇందుకే. అణచివేయడానికీ, దండెత్తటానికీ, చంపటానికీ, విధ్వంసానికీ స్వేచ్ఛ కావాలని సామ్రాజ్యం కోరుతుంది.

ప్రస్తుతానికి వస్తే, ఈ సదస్సులో ఎలాంటి పత్రమూ వెలువడబోదని కొన్ని దేశాలు భావిస్తున్నాయి. అవి చట్టాలను కోరటం లేదు. ప్రమాణాలను కోరటం లేదు. ఎందుకంటే ఇవేవీ లేకుంటే స్వేచ్ఛగా దోచుకోవచ్చు. కనుక ఇక్కడా, వీధుల్లోనూ మనం ఒత్తిడి తేవాలి. శక్తిమంతమైన దేశాలు కూడా దానికి కట్టుబడేలా చూడాలి. పరిమిత భూగోళం అపరిమిత పురోగతిని కోరగలదా? అపరిమిత పురోగతి అనే పెట్టుబడిదారీ సిద్ధాంతం వినాశనకరమైనది. దీనిని మనం ఎదుర్కొందాం. సభాధ్యక్షా, గౌరవనీయమైన సభికులారా, ఈ రకమైన అన్యాయాలనూ, అసమానతలనూ ఎంతకాలం భరించాలి? వర్తమాన అంతర్జాతీయ ఆర్థిక క్రమాన్నీ, మార్కెట్‌యంత్రాగాన్నీ ఎంతకాలం సహించాలి? ఎయిడ్స్ వంటి ప్రమాదకర వ్యాధులు యావత్ప్రజానీకాన్నీ పట్టిపీడించడాన్ని ఎంతకాలం చూస్తూ ఊరుకోవాలి? ఆకలి బాధలనూ, పిల్లలకు తిండి పెట్టలేని అసంఖ్యాకుల అశక్తతను ఇంకెంత కాలం అనుమతించాలి. నయం చేయటానికి వీలైన రోగాల బారినపడి కోట్లాది శిశువులు ప్రాణాలను విడుస్తుండటాన్ని ఇంకెంత కాలం చూడాలి? ఇతరుల వనరులను చేజిక్కించుకునేందుకై కోట్లాది అమాయకుల ప్రాణాలను బలిగొంటున్న సాయుధ ఘర్షణలను ఇంకెంతకాలం భరించాలి?


సభాధ్యక్షా, గౌరవనీయమైన సభికులారా, ఈ రకమైన అన్యాయాలనూ, అసమానతలనూ ఎంతకాలం భరించాలి? వర్తమాన అంతర్జాతీయ ఆర్థిక క్రమాన్నీ, మార్కెట్‌యంత్రాగాన్నీ ఎంతకాలం సహించాలి? ఎయిడ్స్ వటి ప్రమాదకర వ్యాధులు యావత్ప్రజానీకాన్నీ పట్టిపీడించడాన్ని ఎంతకాలం చూస్తూ ఊరుకోవాలి? ఆకలి బాధలనూ, పిలలలకు తిండి పెట్టలేని అసంఖ్యాకుల అశక్తతను ఇంకెత కాలం అనుమతించాలి. నయం చేయటానికి వీలైన రోగాలబారిపడి కోట్లాది శిశువులు ప్రాణాలను విడుస్తుండటాన్ని ఇంకెంతకాలం భరించాలి?

దురాక్రమణలనూ, యుద్ధాలనూ ఆపండి. ప్రపంచ పెత్తనం కోసమూ, మనలను నిలువుదోపిడీ చేయడంకోసం సాగే ప్రయత్నాలను విరవించవలసిందిగా ప్రపంచ ప్రజలమైన మనం అగ్రరాజ్యాలకు చెపుతున్నాము.

సామ్రాజ్యవాదుల సైనిక స్థావరాలూ, సైనిక తిరుగుబాట్లు ఇంకెంతమాత్రం ఉండగూడదు. న్యాత్వమూ సమానత్వమూ కలిగిగిన ఆర్థిక, సాంఘిక వ్యవస్థను నిర్మించుకుందాం. దారిద్ర్యాన్ని నిర్మూలిద్దాం. పెరిగిపోతున్న కాలుష్యాన్ని నిరోధించుదాం. పర్యావరణం నాశనం కావటాన్ని అడద్దుకుందాము. వినాశనానికి దారితీసే వాతావరణ మార్పులను అడ్డుకుందాము. మరింత స్వేచ్ఛ, మరింత సమానతవ&ం అనే మహోన్నత లక్ష్యం కోసం మనం చేతులు కలుపుదాము.


దురాక్రమణలనూ, యుద్ధాలనూ ఆపండి. ప్రపంచ పెత్తనం కోసమూ, మనలను నిలువుదోపిడీ చేయడంకోసం సాగే ప్రయత్నాలను విరమించవలసిందిగా ప్రపంచ ప్రజలమైన మనం అగ్రరాజ్యాలకు చెపుతున్నాము.

సామ్రాజ్యవాదుల సైనిక స్థావరాలూ, సైనిక తిరుగుబాట్లు ఇంకెంతమాత్రం ఉండగూడదు. న్యాయమూ, సమానత్వమూ కలిగిన ఆర్థిక, సాంఘిక వ్యవస్థను నిర్మించుకుందాం. దారిద్ర్యాన్ని నిర్మూలిద్దాం. పెరిగిపోతున్న కాలుష్యాన్ని నిరోధించుదాం. పర్యావరణం నాశనం కావటాన్ని అడ్డుకుందాము. వినాశనానికి దారితీసే వాతావరణ మార్పులను అడ్డుకుందాము. మరింత స్వేచ్ఛ, మరింత సమానత్వం అనే మహోన్నత లక్ష్యం కోసం మనం చేతులు కలుపుదాము. "ప్రకృతి మనకు వ్యతిరేకంగా నిలిస్తే దాన్ని లొంగదీసుకునేలా దానిపై పోరాడుదాము" అంటూ విముక్తి దాత సైమన్ బొలివర్ ప్రకటించాడు. సరిగ్గా, పదేళ్ళ క్రితం వెనిజులా ప్రకృతి విపత్తును ఎదుర్కొన్నది. దీని తరువాత సకల ప్రజానీకానికి న్యాయాన్ని కల్పించేందుకు గాను విప్లవం ప్రయత్నించింది. సోషలిజం ద్వారా మాత్రమే ఇది సాధ్యమని మేము చెప్తాము.

కార్ల్ మార్క్స్ పేర్కొన్న మరో భూతం సోషలిజం. ఇదికూడా ఇక్కడే తిరుగుతున్నది. సోషలిస్టు పంథాలో పయనించటం ద్వారా మాత్రమే ఈ భూగోళాన్ని కాపాడగలము. ఇందులో నాకు అణుమాత్రమైనా అనుమానం లేదు. పెట్టుబడిదారీ విధానం నరకానికి మార్గం. అది ప్రపంచాన్ని నాశనం చేస్తుంది. వెనిజులాలో మేము ఇదే చెప్తాము. కనుకనే అమెరికన్ సామ్రాజ్యవాదం నుంచి సోషలిజం బెదిరింపులను ఎదుర్కొంటున్నది. పెట్టుబడిదారీ విధానం యొక్క వినాశకర స్వభావం మనలను వ్యతిరేకించినట్లయితే, దానిపై పోరాడి లొంగతీసుకుందాము. ఇందుకోసం మానవ జాతి నశించి పోయేవరకు వేచివుండనవసరం లేదు.

సమైక్యత, పోరాటం అనే బాధ్యతలను చరిత్ర మనపై నిలిపింది. పెట్టుబడిదారీ విధానం మనలను వ్యతిరేకించినట్లయితే దానిపై పోరాడుదాం. ఆ రకంగా మానవ జాతి మోక్షానికి దారులు తీద్దాము. మనం గానీ అలా చేయనట్లయితే అపురూపమైన ఈ సృష్టి అంతర్ధానమవుతుంది. మనం, అంటే మానవజాతి లేకుండానే ఈ భూగ్రహం వందల కోట్ల సంవత్సరాలపాటు ఉనికిలో ఉన్నది. దాని ఉనికికి మన అవసరం ఎంతమాత్రం లేదు. కాని భూమి లేకుంటే మనకు ఉనికన్నదే లేదు. ఒక జాతి ప్రమాదంలో పడింది. అది మానవజాతియేనని' ఫైడల్‌కాస్ట్రో ఒక సందర్భంలో వ్యాఖ్యానించాడు. ఇదే విధంగా సోషలిజమా, ఆటవికత్వమా ఏది కావాలంటూ ఒకసారి రోజా లక్సెంబర్గ్ ప్రశ్నించారు. 'పేదలు దీవించబడిన వారు, స్వర్గ రాజ్యము వారిదే' నంటూ ఏసుక్రీస్తు చెప్పాడు.

సభాధ్యక్షా, ఈ భూమిని మానవజాతికి సమాధిగా మార్చవద్దు. సకల మానవులు కోసం ఈ భూమిని స్వర్గతుల్యంగా, శాంతికి నెలవుగా సహోదరత్వానికి ప్రతీకగా మార్చుదాము. ■




April 2010 pages _25.03.2010.pmd 26 3/27/2003, 6:35 PM

## వర్తమానం

# "మతోన్మాదం విషం విరజిమ్ముతూనే వుంది"



**ఆర్. రఘు**

***ఆయనకు ఖతార్ ప్రభుత్వం పౌరసత్వం ప్రకటించగానే ఒక్కసారిగా మనదేశంలోని వివిధ రంగాలకి చెందిన కళాకారులు, మేధావులలో ఒక తీవ్రమైన ఆవేదన, నిస్సహాయత ప్రకటితమయినాయి. ప్రముఖ చిత్రకారిణి అంజోలి ఇలా మీనన్ "ఈ విధంగా మనదేశం సంపదని వెళ్లిపోయిన తరువాత గుర్తించడం మన అలవాటై పోయిందని" ఆవేదన వ్యక్తం చేశారు.***

మక్బుల్ ఫిదా హుస్సేన్ (ఎం.ఎఫ్.హుస్సేన్) - 96 సంవత్సరాల వయోవృద్ధుడు. గొప్ప భారతీయ చిత్రకారుడు. కాషాయ కూటమి హింస భరించలేక దేశం వదిలిపెట్టి వెళ్లిపోయాడు. నిజానికి ఆయన గత రెండు సంవత్సరాలుగా మాతృదేశంలో స్వేచ్ఛగా జీవించలేక విదేశాలలో తలదాచుకుంటున్నారు. ఖతార్ ప్రభుత్వం పౌరసత్వం ఇవ్వడంతో ఆ దేశానికి వెళ్లిపోయారు.

ఒక గొప్ప కళాకారుడు ఈ విధంగా దేశం వదిలిపెట్టి వెళ్లిపోవాల్సిరావడం కళా రంగానికే కాదు. మన లౌకిక వ్యవస్థకు కూడా సిగ్గుచేటు. మన దేశ ఆధునిక చరిత్రలోనే ఇటువంటి విచారకరమైన దుర్ఘటన ఎన్నడూ జరిగివుండదు.

దాదాపు 70 సంవత్సరాలు తన చిత్రకళతో ప్రపంచాన్ని మంత్రముగ్ధం చేసి దేశానికే వన్నె తెచ్చిన ఎం.ఎఫ్.హుస్సేన్ ఈ విధంగా కాషాయ మూకల అరాచకాలు ఒకవైపు, కాంగ్రెస్ ప్రభుత్వం చేతకానితనం మరోవైపు వెన్నాడుతుంటే భరించలేక దేశం వదిలి వెళ్లిపోవడం నిజంగానే బాధాకరం.

ఎం.ఎఫ్. హుస్సేన్ ఒక అసాధారణ చిత్రకారుడు. 1940 లోనే ఆయన చిత్రకళ ప్రపంచాన్ని అబ్బుర పరిచింది. 1947లో ఆయన అభ్యుదయ కళాకారుల బృందంలో సభ్యుడిగా చేరాడు. 1952 లో ఆయన కళాఖండాల ప్రదర్శన జర్మనీలోని జ్యూరిచ్‌లో జరిగింది. అమెరికా, ఐరోపా ఖండాలలో గొప్ప ప్రచారం వచ్చింది. 1955లో భారత ప్రభుత్వం ఆయనని పద్మశ్రీ పురస్కారం ఇచ్చి సత్కరించింది. 1967లో 'ఒక చిత్రకారుడి కళ్ల గుండా" అనే సినిమా తీశారు. బెర్లిన్ ఫిలింఫెస్టివల్‌లో ఆ సినిమాకి ద గోల్డెన్ బేర్ (బంగారం ఎలుగు) ప్రథమ బహుమతి లభించింది. 1971లో సావోపోలో జరిగిన చిత్రకారుల ప్రపంచ మహాసభలో ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారుడు "పాబ్లో పికాసో" తో సమాన హోదా కల్పిస్తూ ఎం.ఎఫ్.హుసేన్‌ను ఆ సభకి ఆహ్వానించడం జరిగింది. భారత ప్రభుత్వం ఆయనకు 1973లో పద్మభూషణ్, 1991లో పద్మవిభూషణ్, బిరుదులిచ్చి సత్కరించింది. 1986లో ఆయన రాజ్యసభకి ఎన్నుకోబడ్డారు. 2006లో ఆయన గీసిన మహాభారత ఇతిహాస చిత్రాలు పి.ఇ. మ్యూజియంలో ప్రదర్శించారు. ఫోర్బ్స్ పత్రిక ఆయనకి భారత పికాసో బిరుదునిచ్చింది. ఇంతటి గొప్ప చిత్రకారుణ్ణి హిందూత్వవాదులు, కాషాయ మూకలు 1996 నుండి హింస పెడుతూ వచ్చాయి.

ఆయనకు ఖతార్ ప్రభుత్వం పౌరసత్వం ప్రకటించగానే ఒక్కసారిగా మనదేశంలోని వివిధ రంగాలకి చెందిన కళాకారులు, మేధావులలో ఒక తీవ్రమైన ఆవేదన, నిస్సహాయత ప్రకటితమయినాయి. ప్రముఖ చిత్రకారిణి అంజోలి ఇలా మీనన్ "ఈ విధంగా మనదేశం సంపదని వెళ్లిపోయిన తరువాత గుర్తించడం మన అలవాటై పోయిందని" ఆవేదన వ్యక్తం చేశారు. ప్రముఖ సినీనటి షర్మిలా ఠాగూర్ "ఇప్పటికైనా ఆయన గొప్ప భారతీయుడని చెప్పలేకపోతే మన జాతికే సిగ్గు" అని చెప్పి ప్రభుత్వంపై తీవ్ర నిరసన తెలియజేశారు. ప్రముఖ సినీ దర్శకులు శ్యాంబెనగల్ "ఈ విధంగా రాజకీయ నిరంకుశత్వం ఆయన పౌరసత్వాన్నే కాదు గొప్ప కళావారసత్వాన్ని కూడా మనకి అందనీకుండా చేయడం నిజంగానే ఒక పెద్ద ట్రాజెడి" అని తేల్చి చెప్పారు. మరో చిత్రకారుడు ఎమ్.కె.రైనా "ఇది మన ప్రజాస్వామ్యానికే సిగ్గుచేటు, సల్మాన్ రష్దికి ఫత్వా జారీ అయితే బ్రిటన్ వంటి అనేక దేశాలు ఆయనకి అండగా నిలబడ్డాయి. మనప్రభుత్వం అదే చేయలేకపోయింది.

రాజకీయంగా బిజెపి ఓడిపోయినా ఫాసిస్టు తరహా హిందూ మతోన్మాదం నిరంతరం పెరుగుతూనే వుంది. పెరగటానికి దారులు వెతుకుతూనే వుంది. ఫాసిజం నిరంతరం ఏదో ఒక అంశం లేదా



April 2010 pages _25.03.2010.pmd 27 3/27/2003, 6:35 PM

సమస్య చుట్టూ విద్వేషాన్ని రెచ్చగొట్టడం తద్వారా పరిస్థితిని హింసాత్మకంగా మార్చడం, ప్రజలని భయకంపితులని చేయడం తద్వారా ఉన్మాది భావాలని వెదజల్లడంచేస్తూనే వుంటుంది. భారత మార్కు ఫాసిజం అయిన హిందూ మతోన్మాదం కూడా ఇదే ఎత్తుగడలను అవలంభించడం మనం చూస్తున్నాం. 1992లో బాబ్రీ మసీదుని కూల్చడానికి ముందు బాబ్రీ మసీదు చుట్టూ విషపూరితం అయిన విద్వేషాలని దాదాపు దశాబ్దం పాటు రెచ్చగొట్టి చివరికి బాబ్రీ మసీదుని కూల్చారు. శాశ్వతంగా భారతదేశంలో మతోన్మాద రాజకీయాలకి బలమైన భూమికను ఏర్పాటు చేశారు. అనంతరం ఈ విద్వేషాలని రెచ్చగొట్టడానికి మరో అంశంకై వెదుకులాడుతున్న నేపథ్యంలో ఎం.ఎఫ్ హుస్సేన్ లక్ష్యంగా నిర్ణయించుకోవడం జరిగింది. 1996 నుండి వదలకుండా ఆయనపైనా, ఆయన గీసిన చిత్రాలపైనా అబద్దాలతో కూడిన విషప్రచారం తీవ్ర స్థాయిలో లేవనెత్తారు.




''మహమ్మద్ ప్రవక్తని తప్పుగా చిత్రించిన డానిష్ కార్టూనిస్టుని చంపితే 51 కోట్ల రూపాయలు ఇస్తామని ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని ఒక మంత్రి గతంలో ప్రకటించిన నేపథ్యంలో ఎం.ఎఫ్. హుస్సేన్‌ని చంపితే 101 కోట్ల రూపాయలు ఇస్తానని హిందులా బోర్డు అధ్యక్షుడిగా చెప్పుకుంటున్న అశోక్‌పాండే ఆ మంత్రికి బహిరంగంగా సవాల్ విసిరారు. గుజరాత్‌లోని ఒక జిల్లా బి.జె.పి అధ్యక్షుడు జేషుభాయిపటేల్ హుస్సేన్ కుడిచెయ్యి నరికి, కళ్లు పీకిచ్చిన వారికి 1 కిలో బంగారం ఇస్తానని ప్రకటించాడు. మధ్యప్రదేశ్‌లోని కాంగ్రెస్ మైనారిటీ సెల్ నాయకుడు హుస్సేన్ చేతులు నరికి తెచ్చిచ్చినవారికి 11 లక్షల రూపాయలు ఇస్తానని ప్రకటించాడు. 1998లో భజరంగ్‌దళ్ కార్యకర్తలు దక్షిణ ముంబాయిలోని హుస్సేన్ ఇంటిపై దాడిచేసి బీభత్సం సృష్టించారు. ఆ తరువాత అహ్మదాబాద్ నగరంలో ఆయన ఆర్ట్స్ గ్యాలరీపై దాడిచేసి సుమారు 1.5 కోట్ల రూపాయల విలువైన చిత్రాలని తగులబెట్టారు. లండన్‌లో హిందూ పౌరహక్కుల ప్రచార కమిటీ అధ్యక్షుడు అర్జున్ మాలిక్ సృష్టించిన అల్లరికి భయపడి 'ఏషియాపేస్ గ్యాలరీ' నిర్వాహకులు హుస్సేన్ చిత్రపటాల ప్రదర్శనని అర్ధాంతరంగా రద్దు చేసుకున్నారు. శివసేన అధినేత బాల్‌థాకరే పార్టీ పత్రిక 'సామ్నా' ఈ "హుస్సేన్‌ని ముంబాయిలోని శివాజిపార్కులో చెట్టుకి కట్టివేసి రాళ్లతో కొట్టి చంపాలి" అని రాశాడు. అంతేకాదు ఆయన ఆర్ట్స్ గ్యాలరీని ధ్వంసం చేసిన శివసైనికులని మెచ్చుకుంటూ "చిత్రపటాలని ధ్వంసం చేసి సరిపుచ్చుకోవడం కాదు. హుస్సేన్ మరొక బొమ్మలను గీయకుండా ఆయన వేళ్లు నరికివేసి ఉండాల్సింది" అంటూ బహిరంగంగా రాశాడు.

ఇంత రాక్షసత్వం, అది కూడా మన దేశానికే ప్రతిష్టాత్మకమైన ఒక గొప్ప కళాకారునిపైన యథేచ్ఛగా సాగిపోతుంటే వీరెవరిపైనా ఒక్క కేసులేదు. హుస్సేన్ ముస్లిం మతస్థుడు కావడం అన్న ఒక్క అంశాన్ని ఆధారంగా చేసుకుని హిందూ మతోన్మాదం ఇంత విషం విరజిమ్ముతుంది.

మతోన్మాదానికి ప్రతిరూపమైన బి.జె.పి – ఆరెస్సెస్‌ల స్పందన సహజంగానే ఈ ఉన్మాదానికి వత్తాసు పలికే విధంగా ఉంది. "బొమ్మలు గీసేటప్పుడు, రాసేటప్పుడు ప్రతి చిత్రకారుడు, రచయిత, పాత్రికేయుడు తమ సృజనాత్మక కృషిలో ఇతరుల మనోభావాలు దెబ్బతీయకూడదని ఎల్లప్పుడూ గుర్తించుకోవాలని" బి.జె.పి రాజ్యసభ నాయకుడు ఎస్.ఎస్. ఆహ్లూవాలియా ప్రకటించాడు. ఆరెస్సెస్ అధినేత మోహన్ భగవత్ "ఆయన్ని వెనక్కి పిలవడం కాని, వ్యతిరేకించడం కాని, ప్రత్యేకంగా మనం ఎందుకు చేయాలి. ఆరెస్సెస్ కళాకారుల స్వేచ్ఛకి వ్యతిరేకం కాదు. అయితే ఇతర స్వేచ్ఛలకి ఉన్నట్లుగానే కళా స్వేచ్ఛకి కూడా ఒక పరిమితి ఉంటుంది." అని చెప్పి ఫాసిస్టు దృక్పథంతో సృజనాత్మకత, కళాకారుల స్వేచ్ఛకి ఒక కొత్త అర్థాన్ని ముందుకు తెచ్చాడు. ఇక బిజెపి నూతన జాతీయ అధ్యక్షుడు గడ్కారి అన్ని రాజకీయ పార్టీలూ, కళాకారులూ ఎం.ఎఫ్.హుస్సేన్‌ని భారతదేశంలోకి రావాలని కోరుకుంటున్న నేపథ్యంలో హుస్సేన్‌ని భారతదేశానికి తిరిగి రావాలని తాము కోరుకుంటున్నామని అంటూనే వచ్చి ఆయన తనపై పెట్టిన కేసులన్నిటినీ ఎదుర్కొవాలని, తన మనస్సులోని అసలు మాటని చెప్పేశాడు. నిజానికి ఆయన మీద పెట్టిన 1200 కేసులు హిందూత్వ శక్తులు పెట్టినవేనని గడ్కారికి తెలియనిది కాదు.

హిందూ ఫాసిజం ముందుకు తీసుకొస్తున్న ఈ వాదనలకు స్పందిస్తూ ప్రముఖ సినీ దర్శకుడు శ్యాంబెనగల్ "వాక్ స్వాతంత్ర్యం హక్కుగా ప్రసాదించబడిన దేశంలో కొందరి మనోభావాలకు దెబ్బతగులుతూనే ఉంటుంది. అందుకు నిరసన చెప్పే పద్ధతులు మనందరికీ ఉన్నాయి. కాని "నీకు జీవించే హక్కే లేదనడం తీవ్రమైన విషయంగా పరిగణించాల్సి ఉంటుంది" అని స్పష్టంగా చెప్పారు.

ఎం.ఎఫ్.హుస్సేన్‌పైనే ఎందుకింత దాడి జరుగుతుంది? ఆయన గీసిన బొమ్మల గురించి హందూమతోన్మాదులు చెప్పే దాంట్లో నిజమెంత? వీటిపై అసలు ఎం.ఎఫ్.హుస్సేన్ ఏం చెప్పారు? న్యాయమూర్తులు ప్రజా కళాకారులు, మేధావులు ఏం చెప్తున్నారు? వంటి ముఖ్యమైన ప్రశ్నల వైపు ప్రజలు, ప్రత్యేకించి మధ్యతరగతి వర్గాల దృష్టి మరల కుండా హిందూత్వశక్తుల శతవిధాల ప్రయత్నిస్తున్నాయి. కొత్త కొత్త వెబ్‌సైట్‌లు సృష్టించబడుతున్నాయి. ఇంటర్‌నెట్ ద్వారా మధ్యతరగతి ప్రజల్ని పక్కదారి పట్టించడానికి, తద్వారా వారిలో అత్యధికుల్ని తమవైపు తిప్పుకోడానికి పెద్ద ప్రయత్నం జరుగుతుంది. మనోన్మాదుల తరుపున వస్తున్న ఈ వాదనలను సమర్థంగా ఎదుర్కోవాలంటే వాస్తవాలను ప్రజల ముందుకు తీసుకురావాలి. అప్పుడే ఈ ఫాసిస్టు ధోరణులను నివారించగలం. కళలని, కళాకారులను కాపాడుకోగలం.



April 2010 pages _25.03.2010.pmd 28 3/27/2003, 6:35 PM

బాబ్రీ మసీదుని కూల్చివేసిన నాలుగు సంవత్సరాలకు అంటే 1996లో హిందూ మతోన్మాదం భయానకమైన పద్ధతుల్లో, విస్తృతమౌతున్న నేపధ్యంలో భోపాల్ పట్టణంలో "విచార మీమాంస" అనే హిందీ పత్రికలో వచ్చిన ఒక వ్యాసం ఈ మొత్తం కల్లోలానికి మొదటిమెట్టు. ఆ వ్యాసంలో 1970లో ఎం.ఎఫ్. హుస్సేన్ గీచిన నగ్నంగా ఉండే సరస్వతీ దేవి బొమ్మని పునర్ముద్రించారు. ఆ వ్యాసానికి 'ఇతడు చిత్రకారుడా ? హంతకుడా? అన్న హెడ్డింగ్ పెట్టారు. వాస్తవానికి ఆ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం వల్ల అల్లర్లు సృష్టించడం సాధ్యపడదని భావించి శివసేన – బిజెపి పరిపాలిస్తున్న మహారాష్ట్రని యుద్ధభూమిగా ఎంచుకున్నారు. ఆ వ్యాసం కాపీని మహారాష్ట్ర సాంస్కృతిక శాఖా మంత్రి, శివసేన నాయకుడు ముంబాయి పోలీసు కమీషనర్‌కి పంపితే దాన్నే ఫిర్యాదుగా స్వీకరించి ఎం.ఎఫ్.హుస్సేన్‌పై సెక్షన్ 153 పి, 295 ఐపిసి (ప్రజల మధ్య మత విద్వేషాలను రెచ్చగొట్టడం) కింద కేసులు నమోదు చేశారు. అనేక మంది కళాకారులు, మేధావులు దీన్ని తీవ్రంగా ఖండించారు. అనాదిగా హిందూ దేవాలయాలపై నగ్న చిత్రాలు ఉండటాన్ని 'హసం" దేవాలయంలో సరస్వతీదేవీ నగ్న చిత్రాన్ని ఉండటాన్ని వారు గుర్తుచేశారు. పురాతన భారత చిత్రలేఖనంలో నగ్నచిత్రాలపై ఎటువంటి అభ్యంతరాలు లేవని అందువల్ల హిందూత్వవాదులు చేస్తున్న వాదనలో పసలేదని తేల్చి చెప్పారు. అయితే ఈ వాదలని ఏమాత్రం పట్టించుకోకుండా కాషాయ కూటమి అత్యంత కిరాతకంగా, మొరటుగా తన వాదనలనే ముందుకు తీసుకొస్తున్నది. 2006లో ఎం.ఎఫ్.హుస్సేన్ భారతమాత నగ్న చిత్రాన్ని వేశాడని మరల పెద్ద దుమారం లేపారు. వాస్తవానికి ఈ చిత్రం చెన్నైలోని "అప్పారావు గ్యాలరీ"లో వేలానికి పెట్టబడింది. హుస్సేన్ ఆ చిత్రంపై భారతమాత అని రాయలేదు. కాని వేలం వేసే నిర్వాహకులు భారతమాత అని రాయడం జరిగింది. తన తప్పులేకపోయినప్పటికీ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని ఆ వేలంపాట నుండి చిత్ర పటాన్ని ఉపసంహరించుకోవడం జరిగింది. ఒక కళా విమర్శకుడు, ఒక న్యాయవాది, ఒక విశ్వహిందూ పరిషత్ నాయకుడితో త్రిసభ్య కమిటీని వేయమని, తాను గీసిన చిత్రాలలో అభ్యంతర కరమైన వాటిని తేలిస్తే వాటిని ధ్వంసం చేస్తానని ఆయన ప్రతి పాదించడం జరిగింది. మతోన్మాదులకి ఈ ప్రతిపాదన నచ్చలేదు. ఈ పరిస్థితులపై కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా సరిగ్గా స్పందించలేదు. ఈరోజు హుస్సేన్ భారత దేశానికి తిరిగి వస్తానంటే రక్షణ కల్పిస్తామంటున్న ఇదే కాంగ్రెస్ ప్రభుత్వం మరి ఆరోజున ఎం.ఎఫ్.హుస్సేన్‌పై తగుచర్యలు తీసుకోమని ఢిల్లీ, ముంబాయి పోలీసు అధికారులను ఎందుకు ఆదేశించింది. ఆ ఆదేశాలపై దేశంలోని మేధావులు, కళాకారులు తీవ్రంగా స్పందించారు. "ప్రభుత్వం యొక్క ఈ చర్యవల్ల మన దేశంలోని ప్రజాస్వామ్య రాజకీయాల పునాదులే విచ్ఛిన్నం అవుతాయి. ఎం.ఎఫ్. హుస్సేన్ ఒక బహుళ, సాంస్కృతిక, బహుళమత, భారత జీవితానికి ఒక ప్రతీక. ముస్లిం మతస్థుడైన ఆయన రామాయణ, మహాభారత ఇతిహాసాన్ని ఎంతో గొప్పగా చిత్రించిన చిత్రాకారుడు అని ప్రభుత్వంపై నిప్పులు చెరిగారు. మేధావులు, కళాకారులే కాకుండా న్యాయస్థానాలు ఈ అంశంపై తీవ్రంగా స్పందించడం జరిగింది. 2006 డిసెంబర్‌లో సుప్రీంకోర్టు మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, బెంగాల్ రాష్ట్రాల్లో ఆయనపై ఉన్న కేసులన్నింటినీ ఢిల్లీ కోర్టుకి మార్చుమని ఆదేశించడం జరిగింది. ఈ సందర్భంగా ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి సంజయ్ కిషన్‌కౌర్ ఇచ్చిన తీర్పు ఎం.ఎఫ్.హుస్సేన్ గీసిన భారత మాత చిత్రంలో ఏ మాత్రం అసభ్యతలేదని, రెచ్చగొట్టే అనారోగ్యకరమైన సెక్స్ భావాలు ఈ చిత్రం నుండి కలగవని స్పష్టం చేశారు. ఆ చిత్రం భారతదేశంలోని పరిస్థితిని ఒక బాధిత మహిళ మనోభావం చిత్రించడం జరిగిందని, అంత గొప్ప ఆరాధనాభావం ముందు మతోన్మాదులు చెప్తున్న అసభ్యం నిజానికి కనపడదని, ఆయన స్పష్టంచేశారు. అంతేకాదు ఈ చిత్రం వల్ల మత భావాలు దెబ్బతింటాయన్న వాదన సరికాదని ఆయన తేల్చిచెప్పడం జరిగింది. న్యాయమూర్తి కౌర్ తీర్పు ముగిస్తూ "ఒక కళాఖండంపై తమ అభ్యంతరాలని చెప్పకోవడానికి క్రిమినల్ న్యాయ వ్యవస్థని ఉపయోగించుకోడానికి అనుమతి ఇవ్వరాదు. దీని వల్ల సృజనాత్మక రంగాలలో పనిచేసే వారికి తీవ్ర నష్టం జరుగుతుంది. దీనివల్ల సమాజంలో అసహనం, వేర్పాటువాదం పెచ్చరిల్లుతాయి. దీంతో దేశం యొక్క ప్రజాస్వామ్య వ్యవస్థ పతనమౌతుంది' అని తీవ్ర పదజాలంతో తీర్పు చెప్పారు.

> ***అనాదిగా హిందూ దేవాలయాలపై నగ్న చిత్రాలు ఉండటాన్ని 'హసం" దేవాలయంలో సరస్వతీదేవీ నగ్న చిత్రాన్ని ఉండటాన్ని వారు గుర్తుచేశారు. పురాతన భారత చిత్రలేఖనంలో నగ్నచిత్రాలపై ఎటువంటి అభ్యంతరాలు లేవని అందువల్ల హిందూత్వవాదులు చేస్తున్న వాదనలో పసలేదని తేల్చి చెప్పారు. అయితే ఈ వాదలని ఏమాత్రం పట్టించుకోకుండా కాషాయ కూటమి అత్యంత కిరాతకంగా, మొరటుగా తన వాదనలనే ముందుకు తీసుకొస్తున్నది.***

మహిళా నాయకురాలు బృందాకరత్ చెప్పినట్లుగా ప్రభుత్వం ఈ దురాగతాలకి కాషాయ కూటమిని బాధ్యురాలిని చేయాలి. ఆయన మీద పెట్టిన కేసుల్లో ఎటువంటి జోక్యం చేసుకోలేదు. ఇప్పుడు ప్రభుత్వం ఇస్తున్న హామీలతో ఆయనకు ఎటువంటి విశ్వాసాన్నీ కల్పించడం సాధ్యంకాదు. ఎం.ఎఫ్. హుసేన్ న్యాయవాది. అఖిల్‌సిబాల్ ఇదే విషయాన్ని మరింత స్పష్టంగా చెప్పాడు. ఆయన ఒక అసాధారణ వ్యక్తి. కాని ఆయన దేశంలో ఆయనని హింసిస్తుంటే ప్రభుత్వం నోరు మెదపకపోవటం విచారకరం.

ఈ ఉదంతంతో దేశంలోని అభివృద్ధి కాముక కళాకారుల్లో ఒక తీవ్రమైన ఆందోళన, అభద్రత చోటుచేసుకుంది. ఎం.ఎఫ్.హుస్సేన్ సమకాలీనుడు 'కిషన్ కన్నా' చెప్పినట్లు హుస్సేన్ జీవితమే కాదు. కళాకారులందరి జీవితాలు ప్రమాదంలో పడ్డాయి. "ఎవరైనా, లేక అందరూ మా మీద కేసు పెట్టవచ్చు. ఎప్పుడైనా దాడులు చేయవచ్చు. ఈ విధంగా హిందూ ఫాసిజం భారత దేశంలో తరతరాలుగా వెల్లివిరుస్తున్న అద్భుతమైన కళలన్నింటినీ మతోన్మాద చక్రంలో బిగించి సర్వనాశనం చేయటానికి పూనుకుంటున్నది. దీనిని ప్రతి ఘటించడం, ఓడించటం వల్లనే కళాకారుల్నే కాదు. మనదేశానికి మూల స్తంభాలైన లౌకికతత్వాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోగలం. ■



April 2010 pages _25.03.2010.pmd 29 3/27/2003, 6:35 PM

నచ్చిన పుస్తకం

# సమకాలీన కథావలోకనం

## గుమ్మన్నగారి బాల శ్రీనివాసమూర్తి




"ఎంత గొప్పగా రచించినా సమకాలీనులు సుతరామూ మెచ్చురుగదా" అని వాపోయాడు అఖండ కవితా ప్రజ్ఞాసంపన్నుడు ఆనాటి చేమకూర వెంకటకవి. ఆ విజయవిలాసకర్త జీవన వేదాంతాన్ని విజయవంతంగా నిజం చేస్తూ వస్తున్నారు మన విమర్శక- సమీక్షకులు. విషయమేమిటంటే- మన వాళ్ళకి కవిత్వం మినహా సమకాలీన రచనల మీద ఎప్పుడూ చిన్న చూపే! "గత కాలమే మేలు వచ్చుకాలము కంటెన్" అన్న నన్నయ్య వేదాంతం పలువురి విశ్లేషణల్లో సుస్పష్టంగా తాండవిస్తుంది. కథ గురించి రాసినప్పుడు చలంతో ఆరంభించి మధురాంతకంతో ముగించడం నవలను ప్రస్తావించినప్పుడు విశ్వనాథ నుండి విశ్వనాథ శాస్త్రి వరకు వచ్చి ఆగిపోవడం- నాటకమైతే కన్యాశుల్కమే ఆద్యంతంగా అభివర్ణించడం కొందరు విమర్శకుల పరిపాటి అలవాటుగా మారింది. ఇటువంటి విమర్శల కారణంగా సమీపగత-సమకాలీన రచనలకు తీవ్రమైన అన్యాయమే జరుగుతుంది. ఎప్పుడూ అలనాటి స్మృతుల్నే నెమరువేసుకుంటే ఎట్లా? నేటి తరం ఏమైపోవాలి? ఈ సత్యాన్ని గుర్తించిన సమీక్షకులు కె.పి.అశోక్‌కుమార్. వాచకాన్ని నిశితంగా అధ్యయనం చేసి నిపుణతతో సమీక్షించే రచయితగా ఇప్పటికే ఆయన గుర్తింపును పొందారు. రమారమి ఈ దశాబ్ది కథా సాహిత్యంలోని వివిధ అంశాల్ని, విభిన్న కోణాల్ని స్పృశిస్తూ క్రమంగా రాసిన వ్యాసాల్ని "కథావలోకనం" పేరుతో ఒక సంకలనంగా తీసుకొని వచ్చారాయన. ఇందులో ఆడెపు లక్ష్మీపతి, జూకంటి జగన్నాథం, సలీం వంటి సమకాలీన కథా రచయితల గురించిన రచనలున్నాయి. అశోక్‌కుమార్ ఇప్పటికే పలు అంశాలపై ఎన్నో పుస్తక సమీక్షలు రాశారు. అయితే ఆయనకు కథానికపైనే ఎక్కువ మక్కువ అని కథావలోకనం నిరూపిస్తోంది. చాలా మంది వీక్షించని, సమీక్షించని అంశాల్ని స్వీకరించినప్పుడే విమర్శకుని అసలు సత్తా బయటకు వస్తుంది. ఈ సూత్రంతో అశోక్‌కుమార్ "కథావలోకనాన్ని" సమీక్షించినప్పుడు, మొదట ఆయనను అభినందించాలి. తెలుగులో వేట కథలు అరుదుగా వచ్చాయి. అల్లం శేషగిరిరావు వేట కథా రచనలో స్పెషలిస్టు. (కథాసాగర్‌లో కనిపించిన వఱడు కథను ఎవరు మరచిపోగలరు? 'వేట చాలించిన కథకుడు అల్లం శేషగిరిరావు' మంచి వ్యాసం, "శ్రీశ్రీ కథల్లో, చైతన్య స్రవంతి ధోరణులు", "సమకాలీన కథానిక- వస్తు రూప పరిణామం, మంచి వ్యాసాలే. అయితే వీటిని మరింత సమగ్రంగానూ తీర్చిదిద్దవచ్చు. గూడూరి సీతారాం, కాళోజీ నారాయణరావుల కథల్ని అశోక్‌కుమార్ చక్కగా పరిచయం చేశారు. "దండోరా కథలు", "తెలుగు కథా సాహిత్యంలో హిందూ ముస్లిం సమైక్యతా ధోరణులు" విభిన్నమైన వ్యాసాలు. "రచయితలు ఇలా కూడా ఉంటారా" అనే వ్యాసాన్ని ఈ సంకలనంలో చేర్చకపోయినా నష్టం ఉండేదికాదు. "కథకుడుగా బైరాగి" వ్యాసం మరికొన్ని వినూత్న విషయాల్ని ఆవిష్కరించేందుకు తోడ్పడుతుంది. ప్రసిద్ధ విమర్శకులు ఆచార్య కె.కె.రంగనాథాచార్యులు "విమర్శలో మౌళికశైలి" పేరుతో ఈ పుస్తకానికి చక్కని పీఠికను అందించారు. "అశోక్ లిఖిత భాషలో మాట్లాడుతున్నప్పుడు అలాగే ఇంగ్లీషు పదాలు అలవోకగా ప్రవేశిస్తూ ఉంటాయి" అని రాశారాయన. కె.కె.ఆర్. గుర్తించినట్టు "ఇటువంటి శైలి ప్రతిపాదిస్తున్న విషయగాంభీర్యాన్ని దెబ్బతీస్తుందని గుర్తించాలి. అత్యవసరమైనప్పుడు స్పష్టత కోసం ముఖ్యంగా సమాన పదాలు దొరకని సాంకేతిక పదాలు అయితే తప్ప ఇంగ్లీషు పదాల్ని పరిహరించడం మంచిది". కె.కె.ఆర్. సూచనను భవిష్యత్తులో అశోక్‌కుమార్ పాటించగలరనే ఆశిద్దాం. కథావలోకనం అటు జర్నలిజానికి ఇటు సాహిత్య విమర్శనా విధానానికీ మధ్యస్థంగా ఉంది. విమర్శలో ఈ ధోరణి మారి మరింత పటిష్టపడుతుందని ఆశించడం కూడా పొరపాటుకాదు. ఈ సంకలనంలోని కొన్ని వ్యాసాల్ని ఇంకా విస్తరించే అవకాశం ఉంది. సమకాలీన కథా సాహిత్య సంపదను చదివించే పద్ధతిలో పరిచయం చేసిన అశోక్ కుమార్ కృషి ప్రశంసనీయం. ■



April 2010 pages _25.03.2010.pmd 30 3/27/2003, 6:35 PM

## పరిచయం

# ఆర్తి నింపే కథలు

వి.ఆర్. తూములూరి




"హార్దిక" అనే కలం పేరుతో ఎ.పి. రావ్ రాసిన రచనల సంకలనం "హార్దిక కథలు". వీటి రచనా కాలం 2006-2008. ఈ కాలంలో రచయిత రాసిన వివిధ రచనల సమాహారం ఈ సంకలనం. దీనికి "హార్దిక కథలు" అనే శీర్షిక కన్నా "హార్దిక రచనలు" అనే శీర్షిక పెట్టి ఉంటే బాగుండేదేమో! రచయిత కలం పేరుకి తగినట్లుగా, పుస్తక శీర్షికకు అద్దినట్లుగా ఇందులోని రచనలన్నీ హార్దికమైనవే.

ఈ సంకలనంలో తొలి కథతో పాటు మరో ఆరేడు కథలను హాస్యకథలుగా చెప్పుకోవచ్చు. తన పేరుని "యాక్‌నోకియా" గా చెప్పుకునే "యాజ్ఞవల్క్య" అనే పేరున్న చిచ్చరపిడుగుని స్కూల్లో చేర్పించే తొలికథ చదవగానే మనసు గిలిగింతలు పెడుతుంది. పెదాలపై చిరునవ్వు లాస్యమాడుతుంది. చాలా కాలానికి తెలుగులో హాస్య రచయిత లభించాడన్న ఆనందం కలుగుతుంది. అలాగే "ఐదడుగుల ఆరంగుళాల ఎత్తు, క్వింటాలు బరువు, యూఫోమ్ బెడ్‌లాంటి సుతిమెత్తని వళ్ళు, గుండ్రటి వినాయకుని బొజ్జ, వెన్నలాంటి మనస్సు" ఉన్న 'బండబావ' కూడా తన చేష్టలతో పాఠకుల్ని అలరిస్తాడు. అతనికి తోడు అరగొండ, బామ్మర్ది కృష్ణ, పిల్లపిడుగులు యాక్ నోకియా, బబ్లూ, హిడింబిలతో పాటు వారి సకుటుంబ సపరివారాలు శఠగోపం స్వామీజీ కలిసి చేసే "విహార యాత్రలు", ఆవిష్కరించే "నగ్న సత్యాలు", వినిపించే "మహానివేదనలు" చూపించే "పౌరుషం" తదితరాలన్నీ హాయిని, మనసుకు ఉల్లాసాన్ని కలిగిస్తాయి. హాస్యానికి, అతి ప్రవర్తనకు మధ్య గల సున్నితమైన రేఖను చెరిపేసి అతిగా ప్రవర్తించడమే హాస్యమనే రీతిలో తెలుగు సినిమాలోకం, కొండొకచో హాస్య రచయితలుగా భ్రమిస్తున్న వారు గుప్పిస్తున్న టన్నుల కొద్దీ చెత్తకు భిన్నంగా ఈ కథలు నిజమైన హాస్యం ఎలా ఉంటుందో ఎత్తి చూపుతాయి. సంకలనానికి ఈ కథలే జీవగర్రలు.

ప్రకృతిపట్ల తనకున్న అభిమానాన్ని, జీవితం పట్ల ఉన్న దృక్పథాన్ని విశదీకరించే ప్రయత్నం చేసారు రచయిత మరికొన్ని కథల్లో. "రాత్రి నిశ్శబ్దంగా ఉంది. వెన్నెలతో పున్నాగపూలు పోటీ పడుతున్నాయి. పచ్చని ఆకులు చందమామతో ఊసులాడుతున్నాయి. ఆ పర్ణాల పరవశాన్ని ఆస్వాదిస్తున్న చల్లని చిరుగాలి పున్నాగ పూల పరిమళాన్ని నింపుకుని, నది కెరటాలపై నాట్యం చెయ్యడానికి మందగమనంతో మత్తుగా సాగింది." అంటూ సాగే వర్ణనలు హృదయాన్ని హత్తుకుంటాయి. రచయితకు బాగా పరిచయమున్న విజయవాడ, విశాఖ పరిసరాల సోయగాలు, వేకువ కువకువలు, సంధ్యాకాలపు గుసగుసలు, "ప్రేమకు వయస్సుతో సంబంధం లేదు... ఆ పిచ్చి ఎప్పుడైనా పట్టొచ్చు" స్నేహానికి ప్రేమకు పెద్ద దూరం ఉంటుందని అనుకోను" లాంటి జీవన వాస్తవాలు, "మనిషి లోకాన్ని అనుసరిస్తే, నువ్వు మనిషినే లోకం అనుసరించాలను కుంటావు. అటువంటి అసాధారణమైన వ్యక్తికి కొండంత ధైర్యం కావాలి, అలుపెరగని పోరాటం చేసే నేర్పుకావాలి. కష్టాలకు వెరువని ఓర్పు కావాలి. కొండల్ని పిండిచేసేంత మనఃశక్తి కావాలి" లాంటి ప్రేరణ నిచ్చే ఉద్బోధలు అడుగడుగునా కన్పిస్తాయి. లాయర్ ఆనంద్, స్వచ్ఛమైన ప్రేమ, అపర్ణ, పార్థివి, మోహన, అహల్య, అర్థంలేని జీవితం తదితర కథల్లో రచయిత ఆర్తిని దర్శించవచ్చు. నెల్లూరులో ప్రసిద్ధమైన మురళీకృష్ణ హోటల్స్ వ్యవస్థాపకుడు "గోపయ్య గారి ఆత్మకథ", రచయిత మిత్రుడు రమణమూర్తి జీవిత కథ "ఆకాశరాజు" కూడా ఈ సంకలనంలో చోటు చేసుకున్నాయి. ఇవి కథలు కాదు జీవితం. "బాధ్యతలేని మంచి బుద్ధికి లక్షణం... అప్పుడు మనిషి యొక్క అన్ని వ్యవహారాలు సవ్యంగా ఉంటాయి. కాబట్టి బాధ్యతనేది యాజమాన్యం యొక్క మొట్టమొదటి, చిట్టచివరి లక్ష్యం.... అప్పుడే వ్యక్తులు సంస్థలుగా మారగలరు. సంస్థలు నిలబడతాయి, సమాజం సవ్యంగా ఉంటుంది" అని సామాజిక బాధ్యతను గుర్తుచేసే గోపాలయ్య, "సంస్థను నిర్మించు. దాన్ని నడపడానికి సరైన వాళ్లను నియమించు. ప్రవర్తన నియమావళి విధించు. ఉన్నత లక్ష్యాల సాధనకు ప్రేరేపించు. అన్నింటినీ మించి ప్రతి చిన్న విషయంపై డేగ కన్ను సారించు – ఇదే కార్య నిర్వహణ అంటే, ఇదే నాయకత్వమంటే" అంటూ మిత్రుడు రమణ కోణం నుంచి ఆకాశరాజులో విశ్లేషించే రచయితా పాఠకుల్ని ఆకట్టుకుంటారు.

"లూయ్‌చీ మాస్టర్" పేరుతో తెలుగు ప్రాంతానికి పరిచయంలేని చిత్రమైన ఫిక్షన్‌ను అందించారు రచయిత. అలాగే కాంతిమతి ఊసే లేని "కాంతిమతీ కళ్యాణం" అనే కథ జానపద



April 2010 pages _25.03.2010.pmd 31 3/27/2003, 6:35 PM

## భాగస్వామి

### ఇరువింటి వెంకటేశ్వర్ శర్మ



ఆధునిక నాగరికతాపరుగులో
అందాలను చిందిస్తున్న
ఆకాశహర్మ్యాల దొంతరల్లో
తానూ ఒక పునాదిరాయిగా
ఒదిగిపోతాడు

నీళ్లున్నా లేకున్నా
నదీమ తల్లిమేనికి
జలహారాలను కూర్చుతూ
అపరభగీరథుడై సాగిపోతున్నప్పుడు
తానూ ఓ గంపెడు
మట్టి అవుతాడు.

ఏడాది పొడవునా
తనకడుపును చూచే
భూదేవికి
హలాయుధుడై
పచ్చని చీరను
బహూకరిస్తున్నప్పుడు
తానూ ఒక విత్తనమై
మట్టిలో కూరుకుపోతాడు

తన పేగు బంధానికి
అందమైన జీవితాన్ని
ఊహిస్తూ
సాగరీకరణ అంచుల్లో
తలలెత్తే పారిశ్రామిక వాడలకు
తానూ ఒక ఇనుపకంభమై
ఊతమిస్తాడు.

ఇలా ప్రతి చోట ప్రతిపనిలో
భాగస్వామి అయినప్పుడు
మరెందుకూ వివక్ష
ఆ గొంతును విప్పనీయండి
ఆ హక్కును చెప్పనీయండి

## బ్రతుకుబండి

### పొత్తూరి సుబ్బారావు

వేగంగా పట్టాలపై
పరుగిడుతున్న రైలు బండిలో
అంతకన్నా వేగంగా పరుగెత్తుతున్న
ఆలోచనలలో వున్న ప్రయాణికుడు
తన పాదాన్ని తాకిన
ఆకారాన్ని చూడగానే
అలలు అలలుగా ఎగసిపడుతున్న
ఆ దైన్య జీవితం
తననెక్కడ చుట్టుకుంటుందోనని
ఓ చిల్లర నాణెం విసిరేసి చేయి
దులుపుకొని
గమ్యస్థానం రాగానే దిగిపోతే
ఏ గమ్యమెరుగని బాలుడు మాత్రం
ప్రయాణికుల సంపాదనలో
తనకేదో వాటా వున్నట్లు
వాళ్ల పాదాలను సృజించి
మరీ చేయి చాస్తుంటాడు
ఊరకనే కాదు
వాళ్లు పడేసే చెత్తాచెదారాన్ని
ఊడ్చి ఊడిగంచేసిన తరువాతనే !
మరి పట్టాలు తప్పిన
ఈ బాలభిక్షువు బ్రతుకుబండి
ఎన్నెన్ని మలుపులు తిరుగుతుందో?



ధోరణిలో సాగుతుంది. ఈ కథల ద్వారా రచయిత ఏం చెప్పదలచుకున్నాడో అర్థంకాక పోయినా రచనాశైలి ఆద్యంతం ఆసక్తిగా చదివిస్తుంది.

**"Brevity is the soul..."** రచయిత అంతరంగ మథనం కాగా "మందస్మిత బుద్ధ" తాత్విక చర్చ. ఈ రెండింటిని వ్యాసాలుగా చెప్పుకోవచ్చు. మొత్తంగా ఈ సంకలనాన్ని పరిశీలిస్తే, రచయితే స్వయంగా చెప్పుకున్నట్లు "నేనో ప్రకృతి ఆరాధకుడ్ని, సంగీత పిపాసిని, పుస్తకాల పురుగుని.... నేను అశేష జనసమూహాలను ఓ మహోన్నత లక్ష్యం వైపు నడిపించే శక్తి ఉన్న నాయకుడిని కాను, ఈ లోకపు మర్మాలన్నీ అర్థం చేసుకోగల తాత్వికుడినీ కాను... అందువల్ల ఇంతవరకు నేను చదివినదంతా మళ్ళీ మళ్ళీ చదివి చరిత్ర నుంచీ, మహనీయుల నుంచీ, మంచిని నేర్చుకోవడానికి ప్రయత్నించాను. నేను అలా నేర్చుకున్నదంతా తోటి వారితో పంచుకోవడానికి నడుం బిగించాను" అనే లక్ష్యంతో రచనలు చేసినట్లు కన్పిస్తుంది. ఆ మేరకు రచయిత కృతకృత్యుడైనట్లే. అయితే "కథ" అన్నప్పుడు దానికి ఉండాల్సిన లక్షణాలను రచయిత పరిగణనలోకి తీసుకోలేదేమో అన్పిస్తుంది. వ్యాస రూపంలో ప్రారంభమై కొంత గమనం తర్వాత సంభాషణల్లోకి వెళ్ళడమూ, కథకు ఉండాల్సిన ప్రారంభము, ముగింపుల్ని పట్టించుకోకుండా కొన్ని సంఘటనల్ని యదాతథంగా చిత్రించి వదిలెయ్యడమూ, దాదాపుగా అన్ని కథలకు అర్థవంతమైన, సందర్భోచితమైన, కథానుగుణమైన పేర్లు పెట్టలేకపోవడమూ, అపర్ణ, మోహన, అహల్య లాంటి నవల కాదగిన కాన్వాసుల్ని కథలుగా కుదించేందుకు ప్రయత్నించడమూ, సొంత ఊరి రాజకీయాల్ని చిత్రిస్తూ ఎందుకు రాశారో తెలియని "అర్థం లేని జీవితం", డ్రమెటిక్ సంఘటనలతో కూడిన "ఒక ఊరి కథ" రచయిత మరిన్ని జాగ్రత్తలు తీసుకుంటే బావుండేదేమో అనిపిస్తాయి. **Peace, Expendable** అనే ఆంగ్ల కథా శీర్షికలు కొంచెం ఇబ్బంది పెడతాయి. అలాగే సామాన్య పాఠకులకి పట్టని సంస్కృత శ్లోకాలు, వాటి వివరణలు అర్థవంతమైనవే అయినా పంటి కింద రాయిలా తగులుతాయి.

ఏతావాతా చెప్పొచ్చేదేమిటంటే రచయితే పేర్కొన్నట్లు "ఏదో ఒక మతం, మార్గం అనుసరించే వాడికి జీవితం సాఫీగా ఉంటుంది. అన్ని మతాలు తనవే అయితే? అబ్బో చాలా కన్‌ఫ్యూజన్... క్లిష్టమైన జీవితం?" ఇది రచయితకు చక్కగా వర్తిస్తుంది. అన్ని ప్రక్రియలు తనవిగా చేసుకుంటే ఈ కన్‌ఫ్యూజన్ తప్పదేమో. Jack in all master in none అన్నట్లు శక్తివంతమైన శైలి, అద్భుత పరిశీలనా శక్తి ఉన్న "హార్దిక" చివరకు Master in none గా మిగిలిపోయే ప్రమాదం ఉంది. అలా కాకుండా హాస్యాన్ని సున్నితంగా, పండించగలిగిన ఈ రచయిత ఆ దిశగా కృషి చేస్తే బావుంటుంది.

■



April 2010 pages _25.03.2010.pmd 32 3/27/2003, 6:35 PM

**పరిశీలన**

# 'శతాబ్దాల నిశ్శబ్దం' నవల్లో గ్రామీణ స్త్రీలు



**ఎల్.కస్తూరి**

'శతాబ్దాల నిశ్శబ్దం' అనే నవలను మామిడిపల్లి దశరథ్ రచించారు. ఈయన 1946వ సంవత్సరం జూలై 15వ తేదీన ఖమ్మం జిల్లా కొత్తగూడెం తాలూకాలో జన్మించారు. అక్కడే చదువును కొనసాగించారు. నిరుద్యోగిగా చాలా కాలం గడిపారు. కరీంనగర్ జిల్లా, మహదేవపురంలోని అభ్యుదయ ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేశారు. రచనల్లోనే కాక చిత్రలేఖనం, పాటలు పాడడంలో కూడా ఈయనకు ప్రవేశముంది. అభిమాన రచయితలు శ్రీశ్రీ, కిషన్ చందర్, దాశరథి రంగాచార్య మొదలగువారు. శతాబ్దాల నిశ్శబ్దం, చీకటి చెదిరింది మొదలైనవి వీరి రచనలు(నవలలు). విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్‌వారి ఆధ్వర్యంలో 1979 లో జరిగిన నవలల పోటీలో 'శతాబ్దాల నిశ్శబ్దం' నవల, 1981లో జరిగిన నవలల పోటీలో 'చీకటి చెదిరింది' అనే నవల తృతీయ బహుమతులను పొందాయి.

శతాబ్దాలు గడుస్తూ వున్నా భూస్వామ్య వ్యవస్థలో ధనవంతులు పేదవారిని నీచంగా చూడడంలో ఏ విధమైన మార్పూ రాలేదు. పేదలు వారి అరాచకాలను, అన్యాయాలను ఎదుర్కోకుండా మౌనంగా భరిస్తూనే ఉన్నారు. ఆ విధంగా గ్రామీణ ప్రాంతాలలో ఏ రకమైన రక్షణ లేకుండా తెలంగాణా ప్రాంతం వారి పోరాటాలలో హింసకు గురవుతున్న పీడిత ప్రజల జీవిత చిత్రణమే దశరథ్ గారి 'శతాబ్దాల నిశ్శబ్దం'.

గోదావరి తీర ప్రాంతాల్లో గ్రామీణ స్త్రీల జీవిత సమస్యలకు సంబంధించిన నవల ఇది. ఇందులో అగ్రవర్ణాలకు చెందిన స్త్రీలు వసుంధర, కనక తాయారమ్మ, పద్మ. అయితే దళిత వర్ణాలకు చెందిన స్త్రీలు లచ్చి, బక్కమ్మ, సుక్కి, గంగి మొదలైన వారు. రాజమ్మ గొల్ల కులానికి చెందింది. వీరే ఈ నవల్లో ప్రధానంగా కనిపించే పాత్రలు.

**లచ్చి:** గంటయ్య భార్య లచ్చి. భర్త గంటయ్య, తనూ కరువు వల్ల ఆ ఊరి దొర చంద్రారెడ్డి దగ్గర ధాన్యం నాలుగు కుండలు అప్పుతెచ్చుకున్నారు. ఆ అప్పు తీర్చడానికి దొర మరుసటి సంవత్సరం వరికోత కొయ్యడానికి రమ్మని కబురు పెడతాడు. గంటయ్య వరి కోత కొయ్యడానికి వెళ్లగా లచ్చి వెళ్లనందుకు చంద్రారెడ్డికి పెద్దనాన్న అయిన పిచ్చిరెడ్డి పాలేర్ని పిలిచి 'శంభా నువ్వెళ్లి వాళ్ల అంతేదో కనుక్కొని రారా' అని గదమాయించాడు. శంభడు ముల్లు గర్రను చేతబట్టుకొని మాదిగ గూడెం వైపు బయలుదేరి పావుగంటలో ముగ్గుర్నీ తీసుకొచ్చాడు. పిచ్చిరెడ్డికి ఆవేశమెక్కువై గట్టుమీది నుంచి కిందకు దూకి ముల్లుకర్రతో తలా నాలుగు బాదాడు. లచ్చిని చెంప మీద చెళ్లుమని కొట్టాడు. లచ్చి భర్త గంటయ్య ఎదురుగానే భార్యను కొడుతున్నా ఏమీ చెయ్యలేని నిస్సహాయుడిలా నిశ్శబ్దంగా చూస్తుండిపోయాడు.

ఈ విషయం తెలిసిన తాయారమ్మ చేతిలో కూడా లచ్చి తన్నులు తిని ఏమీ చెయ్యలేని నిస్సహాయురాలిలా ఉండిపోయింది. ఇక్కడ లచ్చిని స్త్రీ అని కూడా చూడకుండా తనకు ఇష్టమొచ్చినట్లు బాధించి, హింసించిన అగ్రవర్ణ పురుషుడే కాక, అగ్రవర్ణ స్త్రీ కూడా చీవాట్లు పెట్టి ఇబ్బందుల పాలుచేసిన విధం తెలుస్తుంది.



April 2010 pages _25.03.2010.pmd 33 3/27/2003, 6:35 PM

**బక్కమ్మ:** బక్కమ్మ దొరగారింట్లో పనిమనిషి. బక్కమ్మ తండ్రి చిన్నప్పుడే చనిపోగా తల్లి మంగమ్మ బక్కమ్మను 12 సంవత్సరాల వరకు పెంచి పెద్దచేసి కాలం చేసింది. బక్కమ్మను దొర చేరదీయగా అక్కడే అంట్లు తోముకుంటూ, ఇంట్లో పని చేస్తూ కాలం గడుపుతూ ఉండేది. నీడనుంటూ రెండు ముద్దలు ఎక్కువ తినేసరికి రోజురోజుకీ బాగా ఒళ్లొచ్చి రంగొచ్చింది. పెద్దమనిషైన మూడో రోజు నుంచే దొర బక్కమ్మను దోచుకుంటున్నాడు. దొరసాని ఊరెళ్లినా, పక్కమంచమెక్కినా దొరగారి కౌగిట్లో నలిగిపోయేది.

యుక్త వయస్సు రాగానే పసుపు కుంకుమలతో అత్తగారింటికి పోయి భర్త ఒడిలో ఆదమరచి నిద్రపోవాల్సిన వయస్సు బక్కమ్మది. కాని పీడ కలలాగా చెదిరిపోయిన అలలా వుంది బక్కమ్మ బతుకు. కొంతసేపు ఆలోచించింది. అందులోంచి బయటపడే మార్గాలేవీ కనిపించలేదు. తనకు కడుపొస్తే, దొర తన బిడ్డే అని ఆదరిస్తాడా అని అయోమయంగా ఎటూ తేల్చుకోలేక అంతర్మథనం చెందుతున్న స్థితి బక్కమ్మది. అన్ని విషయాల్లో అడ్డొచ్చే అంటరాని తనం కామవాంఛ తీర్చుకునే సందర్భంలో ఏమైనట్లు?

**సుక్కి, గంగి:** సుక్కి బజారుగాని చెల్లెలు. చుక్కలాగుంటుంది. బక్క పలుచని మనిషి. మెరుపు తీగలాగుంటుంది. బడిపంతులుగా పనిచేస్తున్న యాదగిరికి సుక్కి అంటే చాలా ఇష్టం.

పోలిగాడి భార్య గంగి. నల్ల మబ్బులాగ ఉంటుంది. గంగికి పెండ్లయి నెలైనా కాకముందే పనిపాటల్లో మునిగిపోయింది.

సుక్కి, గంగీలు ఇద్దరూ దొరగారి మిరపచేను కోసి, మిరప తట్టల్ని మోస్తున్నారు. గంగి పరుగులు తీస్తూ తట్టలు మోస్తుంది. దాన్ని దొరచూసి ఉక్కిరిబిక్కిరవుతూ వాళ్లని "నవ్వేనా పనేమన్నా జేసేదుందా! మాదిగ లంజెల్లారా !"(పు.56) అని తిట్టినా సుక్కి నవ్వుకుంటూ ముందుకెళ్లింది.

"ఏందా నవ్వు ! నీ తల్లీ మాదిగ లంజా ! భయం లేకుంటే సరి" అని దొర తిట్టగానే భద్రిగాడు 'దాన్ని పంతులు జేసుకుంటాడట' అంటే, దొర "పంతులా: ఆ మాదిగ నాకొడికెనా: వాని తల్లి బుద్ధి పోనిచ్చుకున్నాడు కాదు" అని లోలోన 'అలాంటి అదృష్టం నాకు దొరకలేదు. పంతులుకు దక్కిందని (పు.56, 57)' అనుకుంటాడు.

సుక్కి పంతుల్ని పెళ్లిచేసుకొని, దొరపెట్టే బాధల్ని భరిస్తూ చివరికి భర్తను కోల్పోతుంది. అలాగే గంగి భర్తను కోల్పోతుంది.

ఈ పాత్రల ద్వారా అగ్రవర్ణాల వారు (పురుషులు) దళిత స్త్రీలను కులం పేరుతో దూషించి, వారిని నానా మాటలు అంటున్నా, వారిని ఎదిరించలేని దౌర్భాగ్యపు స్థితి కన్పిస్తుంది.

**రాజమ్మ :** గొల్ల కులానికి చెందింది రాజమ్మ. దొర పోలిగాడిని రాజమ్మే చంపిందని జైలుపాలు చేసి, వాళ్లు ఏర్పరచుకున్న పార్టీల గొడవల్లో ఇరికించాలని పన్నాగాలు పన్నడంతో శ్యామలరావు అనే లాయరుతో న్యాయం జరుగుతుంది. భూస్వాముల అన్యాయాలకి, అక్రమాలకి గురిచేసినా ధైర్యంగా ఎదుర్కొన్న తీరు గోచరిస్తుంది.

**వసుంధర:** వసుంధర చంద్రారెడ్డి (దొర) భార్య. ఈమె బడుగు వర్గాల పీడిత ప్రజల మీదనైతే పెత్తనాన్ని చెలాయిస్తుంది కానీ, భర్త ఎంతో మంది స్త్రీలను తన అవసరాలకి వాడుకున్నా, అతన్ని ఏ మాత్రం నిలదీయలేని దయనీయమైన స్థితి.

**కనక తాయారమ్మ:** ఈమె చంద్రారెడ్డి తల్లి. పనులన్నీ ఆమె ఆజ్ఞ మేరకే జరిగేవి. లెక్కలైతే దొర చూసుకునేవాడు. వయసులో ముసలిదయినా పట్టింపులకు మాత్రం ముసలితనం రాలేదు. లచ్చి పనికెళ్లనందుకు శంభడ్ని పంపించడం, తీసుకొచ్చిన తర్వాత అగ్రవర్ణాల వారి మాటలకు కట్టుబడి తన కులపు స్త్రీ అని కూడా చూడకుండా లచ్చిని బాధించడం జరుగుతుంది. "దేవుడా మమ్మల్నెందుకు పుట్టించావ"ని లచ్చి వాపోగా, దేవుడేం చేశాడే ! మీరు చేసిన పాపాలివి ! అన్న మాటల్ని చూస్తే మాదిగ కులంలో పుట్టడమే ఒక శాపం. మహా పాపమేమో? స్త్రీలే అగ్రవర్ణ స్త్రీ పురుషుల వల్లనే గాక సాటికులంలోని పురుషుల వల్ల కూడా హింసకు గురవక తప్పడం లేదు.

**పద్మ:** చంద్రారెడ్డి కుమార్తె. దళితుడైన వీరన్న, పద్మ కలిసి చదువుకున్నారు. కులాంతర వివాహం చేసుకున్నా, తండ్రి పెట్టే హింసలకు తట్టుకోలేక, చదువుకొని చైతన్యవంతురాలైనా, తనకు నచ్చిన వ్యక్తిని పెళ్లిచేసుకొని సుఖంగా జీవించే స్వేచ్ఛ లేకుండా, సమాజంలో మనలేకపోయింది.

**ధనిక పేద వర్గాల మధ్య కనిపించే వైరుధ్యం:**

భూస్వామ్య వ్యవస్థలో ధనికుల కామదాహానికి బలయ్యే పేద దళిత స్త్రీ అనుభవించే ఆవేదన బక్కమ్మలో గోచరిస్తుంది.

రాజమ్మ పాత్ర స్త్రీలలో పెరుగుతున్న చైతన్యాన్ని, తద్వారా అగ్రవర్ణాల వారిని ఎదుర్కొన్న తీరును రచయిత మన కళ్లముందుంచాడు.

పద్మ అగ్రవర్ణానికి చెందినా సామాన్య దళితుణ్ని ఇష్టపడి తల్లిదండ్రుల్ని ఎదిరించి కులాంతర వివాహం చేసుకొన్న సంస్కరణతో కూడిన చైతన్యవంతమైన పాత్రగా కనిపిస్తుంది.

ఈ నవల్లో ధనిక వర్గాలు, బలహీన వర్గాల వారిపై ప్రదర్శించే అధికార దర్పం, అడుగడుగునా చూపే అహంకారం, కులవివక్ష, స్త్రీల అణచివేతలే భవిష్యత్తులో భూమి కోసం, భుక్తి కోసం పేదలు సాగించే పోరాటానికి, వారిలో చైతన్యానికి నాంది కాగలవనే ఆశావహ దృక్పథాన్ని రచయిత వ్యక్తం చేశారు. చీకట్లను చీల్చుకొచ్చే ఆ వెలుగు రేఖలకై అందరం నిరీక్షించుదాం !



April 2010 pages _25.03.2010.pmd 34 3/27/2003, 6:35 PM

# గుండెను తట్టిలేపే కవిత్వం




## కోసూరి రవికుమార్

***'కణకణకాలితే కదా!***
***కాంతులీనేది***
***మేలిమయ్యేదీ'***

కొన్ని వాక్యాలు ఏవో లోపలి పొరల్నితట్టి లేపి లోలోపలికి దూసుకొచ్చి, లోపల్నుంచి మనల్ని లాక్కొచ్చి, పరిశుభ్రపవనాలలో తేల్చి, ఒక్కసారిగా బీరువాలో బట్టలు సర్దినట్లు మన అలోకనమును, అనుభూతులను అన్నిట్నీ సర్ది, గంజిపెట్టి ఇస్త్రీచేసిన మంచి ఖద్ధరు చొక్కా, ఫ్యాంటు వేసుకున్న మనిషికి మల్లే మనల్ని నిటారుగా నిలబెట్టిపోతాయి. అదుగో అలాంటి వాక్యాలే "కరువు కురిసిన మేఘం" నిండా వున్నాయి.

కవిత్వం రాయడం కోసం కవిత్వం కావటం, కవిత్వం చేయటం కోసం సంఘటనను, సమస్యను ఊహించుకోవటం.. ఇలా కాక కవితా పదాలలో అనుకోకుండా హృదయస్పందనవలననొ... మనస్సు మెలితిరగటం వలననొ కవిత రాస్తున్నాడంటే తప్పక ఆ కవిత్వం పది కాలాలపాటు మనగలిగేదవుతుంది. వై. హెచ్.కె. మోహన్‌రావు కవిత్వమూ అలాంటిదే

పల్నాట మండే ఎండలకు, రగిలే ఉద్యమాలలో కణకణలాడితేనే కదా! కాంతులీనే అక్షరాలనూ, మేలిమైన కవిత్వాన్ని కౌలు భూముల్లో "పత్తి తలదగ్గర వత్తిగా మారే" దృశ్యాలను అక్షరీకరింపగలిగేది. ఆ కోవలోనే కవిత్వం రాసినా, పాట రాసినా గుండె తడితో రాశాడు వై. హెచ్.కె.

"ఆకులతో పాటు ఆసువులూ రాలుతున్నాయి" అని కవితా సంపుటి శీర్షిక కవితలో బలంగా రైతు జీవితాన్ని దృశ్యమానం చేశాడు. "కరువు కురిసిన మేఘం" ఆనవాళ్ళను కవిత్వంలో నిలబెట్టి బొమ్మ కట్టాడు. "పనికి బాష్యం చెప్పేవాడ్ని పగ్గం పగబడితే" పల్లె చీకటయ్యేవైనాన్ని మన ముఖాల మీదకు ప్రశ్నలా విసిరేశాడు. చేతివృత్తులు మాయమై చేతులకు మరలు తొడుక్కొని మనల్ని "మర" లకు మనమే బానిసలుగా మార్చుకుంటున్న పరిస్థితుల్ని వివరిస్తూ "నైరుతి రుతుపవనాలమై" అందరం రైతు గుండె పైన వర్షించాల్సిన అవసరాన్ని తెలిపాడు తన కవితలో. "నీరు ఇపుడు విస్ఫోటనాయుధం" అని "నది మదిలో" అనే కవితలో అంటాడు. అణుకువ పేలుతుంది. విధ్వంసం సృష్టిస్తుంది. అంతరంగమూ పేలుతుంది. అక్షరాలు కూడా పేలుతాయనిపిస్తుంది. మోహన్‌రావు కవిత్వం చదివితే. నీళ్ళ కోసం భగిరథుడు తపస్సు చేశాడని పురాణాలు చెబుతాయి కానీ, మనిషి జలం కోసమే యజ్ఞాలు చేయటమూ, ప్రాజెక్టుల దగ్గర రక్త పారాణి పూయటము, నీళ్ళు దోచుకొని, దాచుకునే సొత్తుగా మారటమూ చూస్తున్న తరువాత "నీరు విస్ఫోటనాయుధం" అనటం అర్థవంతంగానే అనిపిస్తుంది.

మోహన్‌రావు కవిత్వం శీర్షిక నుంచే వైవిధ్యం ప్రదర్శిస్తుంది. "కరువు కురిసిన మేఘం" తో మొదలైన వైవిధ్యం "ఔను నేను అపవిత్రుడ్నే, నది మదిలో ప్రవహించాలి, ఒక నాలుక అనేక చీలికలు, మట్టి చెట్టు, సుంకురాలిన కంకి, కరువు కథనానికి మేతకు శీర్షికనై" వంటి శీర్షికలు పాఠకుల్ని కవిత్వంలోకి లాక్కెళ్తాయి. సమస్యలూ వాటి తాలుకూ లోతైన తాత్విక కోణాలూ, వాటిపైన తీవ్రమైన స్పందనలూ అన్నీ ప్రోదిచేసుకున్న కవిత్వం మోహన్‌రావుది.

మోహన్‌రావు కవిత్వపు దారిలో "ప్రతి విధ్వంసం తరువాత ఒక స్మశానం ఆవిష్కరణ అయినట్టు" కరువు కురిసిన మేఘం చదివాక ఒకానొక చిత్రమైన స్థితిలోకి జారుకుంటాం. ఆవేశము, ఆలోచన, ఆవేదన, లొలోపల రగిలే ఏదో జ్వాల బిగిసిన పిడికిలి, దీర్ఘమైన నిట్టూర్పు, కనబడని సంకెళ్ళేవో తెంచుకోవాలని అనిపించినట్లు, నిలువునా కనిపించని ఊబుల్లోకి దిగబడి పోతున్నట్లూ, ఒక కాగడాలా మారి దారులవెంట పరుగులు తీయాలని అనపిస్తుంది. అందుకనే "కరువు కురిసిన మేఘాన్ని" చదవండి.

■



April 2010 pages _25.03.2010.pmd 35 3/27/2003, 6:35 PM

నివేదిక

# సాగర తీరాన కావ్య సుధామధురం

గుడిమెట్ల చెన్నయ్య.




**తూ**ర్పున సముద్రపు అలల హోరు. ఎదుట శ్రీశ్రీ శతజయంతి సందర్భంగా "శ్రీశ్రీ జీవితం, సాహిత్యం, దృక్పథం"పై మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు విభాగంచే నిర్వహింపబడ్డ అంతర్జాతీయ సదస్సులో సాహితీవేత్తల ప్రసంగాల జోరు.

అక్కడ ఎగిసిపడే అలలు చలచల్లగా పాదాలను తాకుతుంటే ఇక్కడ పండితులు 'పదండి ముందుకు పదండి పోదాం' అంటూ తమ ఉద్వేగ ప్రసంగాలతో చల్లటి ప్రాంగణములో కూడా వేడి వాతావరణం సృష్టించారు.

మార్చి8–9, 2010 రెండు రోజుల అంతర్జాతీయ సదస్సుకు మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పూర్వాధ్యక్షులు డా॥జి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి అధ్యక్షత వహించగా ప్రముఖ నేపథ్యగాయని ఎస్.జానకి ప్రారంభోపన్యాసం చేశారు. తమ కీలకోపన్యాసంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగుశాఖ ఎస్.వి.సత్యనారాయణ, మహాకవి శ్రీశ్రీ ఒక వర్గానికి ఉద్యమానికి చెందినవాడు కాదని చెపుతూ నేటితరంపై శ్రీశ్రీ ప్రభావముందని తెలియచేశారు. ఈ సభలో ప్రముఖ నటులు మాదాల రంగారావు, వ్యాపారవేత్తలు పసుమర్తి బద్రీనాధ్, పందిరి కృష్ణమోహన్ మరియు చలసాని ప్రసాద్, శ్రీశ్రీ సతీమణి




సరోజ పాల్గొన్నారు. రెంటాల జయదేవ్ వ్యాఖ్యాతగా వ్యవహరించిన ఈ కార్యక్రమంలో శ్రేయ ప్రార్థనా గీతం పాడగా, పొన్నూరు హర్షిణి నృత్యప్రదర్శన జరిగింది. తెలుగు విభాగాధిపతి డాక్టర్ మాడభూషి సంపత్‌కుమార్ ఈ సదస్సును సమన్వయం చేశారు.

సదస్సు మొదటి సమావేశానికి ప్రముఖ విమర్శకులు చలసాని ప్రసాద్ అధ్యక్షత వహించారు. వారు తమ ప్రసంగంలో శ్రీశ్రీని కవిగా, నవ్యకవిగా విశ్లేషించారు. ఇంకా ఈ సమావేశంలో నాగలాపురం ప్రభుత్వ కళాశాల అధ్యాపకులు డాక్టర్ ఎం.మునిరత్నం, చెన్నై పి.జి.వైష్ణవ కళాశాల తెలుగు శాఖాధ్యక్షులు డాక్టర్ కాసల నాగభూషణం, గుంటూరుకు చెందిన ప్రముఖ విమర్శకులు డాక్టర్ కడియాల రామమోహన్‌రాయ్, చెన్నై వివేకానంద కళాశాల డాక్టర్ వై.వి. ఎస్.ఎస్.ఎన్.మూర్తి, వరంగల్ యూనివర్సిటీ ఆర్ట్స్& సైన్స్ కళాశాల తెలుగు శాఖ డాక్టర్ పంతంగి వెంకటేశ్వర్లు పాల్గొని శ్రీశ్రీపై తమ అభిప్రాయాలను తెలియ చేశారు.

తదుపరి జరిగిన రెండో సమావేశానికి డాక్టర్ అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షత వహించారు. ఆయన తన ప్రసంగంలో "శ్రీశ్రీని ఒక త్రాచులో తూచాలనుకోవడం సరికాదు.. ఆయనను ఒక వాదానికి మాత్రమే పరిమితం చేస్తూ విమర్శించడం సరైన విమర్శ కాదు.. శ్రీశ్రీ గాంధీపై రచించిన అద్భుతమైన నాటకం హృదయాన్ని కదిలిస్తుందని ఉద్వేగంతో పలికారు. ఈ సమావేశంలో శ్రీశ్రీ కథలపై డాక్టర్ వెస్తాలి శంకరరావు, శ్రీశ్రీ అనువాదాలపై హైదరాబాదు సాక్షి ఇంటర్‌నెట్ సంపాదకులు మందలపర్తి కిషోర్ కూలంకషంగా వివరించారు. ఇందులో కొన్ని వివాదాస్పద వ్యాఖ్యలు విమర్శనెదుర్కొన్నాయి.

ఇక ఆరోజు చివరి సమావేశంలో ప్రముఖ చలన చిత్ర నిర్మాత కె.మురారి అధ్యక్షత వహించగా శ్రీశ్రీ సినిమా పాటలు శ్రీశ్రీ అనువాద పాటలు అన్న అంశాలపై ప్రముఖ విమర్శకులు పైడిపాల, చలన చిత్ర గేయ రచయిత వెన్నెలకంటి ప్రసంగించారు. వెన్నెలకంటి తన ప్రసంగంలో 'అనుసృజనకు ఆద్యుడు శ్రీశ్రీ' అని కొనియాడారు. వెల్చేరు నారాయణరావు పత్రాన్ని లక్ష్మణ్ చదివి వినిపించారు.

9వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభమైన నాలుగో



April 2010 pages _25.03.2010.pmd 36 3/27/2003, 6:35 PM

సమావేశానికి డాక్టర్ ఎల్.బి.శంకరరావు అధ్యక్షత వహించారు. 'శ్రీశ్రీ మార్క్సిస్టు దృక్పథం'పై ప్రస్థానం సంపాదకులు తెలకపల్లి రవి, శ్రీశ్రీ రచనల్లో మార్క్స్, లెనినిజం అంతస్సూత్రంగా వుందని అన్నారు. శ్రీశ్రీ గురజాడ, వీరేశలింగం పంతులు వంటి తొలి తెలుగు పురోగమన కవులకు మద్రాసు నగరంతో వున్న అనుబంధం విడదీయరానిదని గుర్తుచేశారు. వారిలో శ్రీశ్రీ మార్క్స్ దృక్పథంతో ముందుకు సాగినవాడు. తెలుగు సాహిత్యాక్షరం శ్రీశ్రీ. సమాజం వ్యక్తిని ప్రభావితం చేస్తుంది. అలా 1930ల నాటి సామాజిక స్థితిగతులు, శ్రీశ్రీ అనుభవాలే ఆయన కవిత్వ వస్తువులు. కాలం సృష్టించిన మహాకవి శ్రీశ్రీ అని చెప్పారు. జనసాహితి నాయకులు దివికుమార్ తమ ప్రసంగంలో తెలుగు సాహిత్యంలో శ్రీశ్రీ ఒక అరుణ పతాకం' అని నొక్కి వక్కాణించారు. ఇంకా ఈ సభలో డా॥ మాడభూషి సంపత్‌కుమార్, వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం తెలుగు శాఖ ఆచార్య కాత్యాయనీ విద్మహే శ్రీశ్రీ స్త్రీ దృక్పథంపై ప్రసంగించగా, డాక్టర్ అప్సర్ ప్రసంగ ప్రతిని భవాని చదివి వినిపించారు.

తరువాత జరిగిన అయిదో సమావేశానికి ఆచార్య డి.చెంగారెడ్డి అధ్యక్షత వహించారు. తిరుపతి, పద్మావతీ మహిళా విశ్వవిద్యాలయం, తెలుగు శాఖ అధ్యక్షులు డా॥ కొలకలూరి మధుజ్యోతి ప్రసంగిస్తూ "ఆయనో పొడుపు కథ అంటూ ప్రారంభించి, ఆయన ప్రయోగాలు వైవిధ్యమైనవని, ఆయనను ఇన్ని మార్గాలలో నడిపిన శక్తి ఏదో తెలుసుకోవాలని ఉబలాటం తనకు ఉండేదని చెప్పారు. ప్రయోగాలు చేయడం శ్రీశ్రీ లక్షణం. భావ కవిత్వం నుండి మహాప్రస్థానం ద్వారా అభ్యుదయ కవిత్వంవైపు నడచినవాడు. 15 ఏళ్ల వయస్సులో డిటెక్టివ్ నవల రాసి పద్యాల నుండి వచనానికి మళ్లినవాడు. శ్రీశ్రీ వైరుద్యాల పుట్ట. చాలా కొద్ది కాలంలోనే నవల, కథ, పద్యం, వ్యాసం, విమర్శ రాయగలిగాడు. చాలా సున్నితమనస్కుడు శ్రీశ్రీ' అని కొనియాడారు. డా॥ బూదాటి వెంకటేశ్వర్లు 'శ్రీశ్రీ కవిత్వం, గతి, వైవిధ్యం'పై ప్రసంగించారు.

అందరినీ ఆకట్టుకొన్న కార్యక్రమాలలో 'పాడవోయి భారతీయుడా'. శ్రీశ్రీ సినిమా పాటలు చెప్పుకోదగ్గ కార్యక్రమం. కార్యక్రమంలో గాయనీగాయకులు శ్రీశ్రీ పాటలను చక్కగా పాడి వినిపించారు. 'అమరగాయకుడు ఘంటసాల పుత్రుడు ఘంటసాల వెంకటరత్నకుమార్ అధ్యక్షత వహించగా, ప్రముఖ నేపథ్య గాయకులు జి.ఆనంద్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మురళీకృష్ణ, ఎస్.పి.వసంతలక్ష్మి, ఎం.రాము, డాక్టర్ విస్తాలి శంకర్‌రావు శ్రీశ్రీ పాటలను పాడి ఆహూతులను ఆనందింప చేశారు. ఎం.ఆర్. సుబ్రహ్మణ్యం ఈల పాట ప్రత్యేక ఆకర్షణ.

"నా తొలి గీతం శ్రీశ్రీనే" అంటూ సమాపనోత్సవ సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న గానకోకిల, పద్మ భూషణ్ పి.సుశీల ఆనందోత్సాహంతో పలికారు. తన ప్రసంగంలో 'కన్న తల్లి' చిత్రంలో ఏ.ఎం. రాజాతో కలిసి పాడిన శ్రీశ్రీ పాట 'ఎందుకు పిలిచావు..' అని అజరామరమైన శ్రీశ్రీ పాటల్లో ఎన్నింటినో మహాగాయకుడు



ఘంటసాలతో పాడానని, అది తన అదృష్టంగా భావిస్తున్నానని వినమ్రతతో తెలిపారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డా॥ రామచంద్ర, శ్రీశ్రీ ఆవేశాన్ని, ఆవేదనను గ్రహించి ఆయన ఆశయాలను ఆచరణలోకి తీసుకురావాలని ఉద్బోధించారు. డా॥ ఎస్.అక్కిరెడ్డి తన ప్రసంగంలో 'తెలుగు కవులకు జాతీయ స్థాయి గుర్తింపు కూడా నోచుకోని సమయములో మహాకవి శ్రీశ్రీ పేర ఒక అంతర్జాతీయ సదస్సు నిర్వహించడం ద్వారా మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ మంచి కీర్తిని పొందినదని, ఈ సభ ద్వారా ఈ తరం విద్యార్థులకు శ్రీశ్రీ గురించి తెలుసుకొనే అవకాశం కలిగిందని అందుకు కారణమైన మద్రాసు విశ్వవిద్యాలయానికి చెందిన ప్రతి ఒక్కరూ అభినందనీయులని కొనియాడారు.

కార్యక్రమములో ప్రముఖ పారిశ్రామిక వేత్తలు కె.వెంకటేశ్వరరావు, పొన్నూరు రంగనాయకులు పాల్గొన్నారు.

మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ పరిశోధక విద్యార్థులు వై.చంద్రప్ప, పి.ఎస్.మైథిలి, ఎం.నటరాజ్, ఎం.సునీత, పి.కాళియప్పలు ఆయా సమావేశాల నిర్వహణ బాధ్యతలను చేపట్టడం ముదావహం.

ఈ సమావేశానికి చెన్న పట్టణం నలుచెరగుల నుండి తెలుగు తల్లి ముద్దుబిడ్డలెందరో వచ్చి పాల్గొనడం సమావేశాలకు నిండుదనం చేకూర్చింది.

ముఖ్యంగా సుదూరమైన ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి నుండి రచయిత మాధవీ సనారా, నందలూరు కథానిలయం ఏ.రాజేంద్రప్రసాద్, వారి సతీమణి పాల్గొనడం తెలుగు భాషపై సాహిత్యంపై ముఖ్యంగా శ్రీశ్రీపై వారికున్న అభిమానానికి నిదర్శనం.

వచ్చిన ప్రతి వ్యక్తినీ సాదరంగా ఆహ్వానించి భోజన వసతులు కూడా కల్పించి అంతకంటే మిన్నగా శ్రీశ్రీ గురించిన వివరాలు తమిళంలోను, తెలుగులోను సూచికల ద్వారా తెలియజేసిన మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ నిర్వాహకులు అభినందనీయులు.

చివరగా మన్నవ గంగాధర ప్రసాద్ వందన సమర్పణతో సభ జయప్రదంగా ముగిసింది.

■



April 2010 pages _25.03.2010.pmd 37 3/27/2003, 6:35 PM

# కొత్త పుస్తకాలు

## ఇంద్రధనుస్సు(నవల)




**వాండా వాస్సిలెవస్కా**

**అనువాదం: మానేపల్లి తాతాచార్య**

**పేజీలు : 192 వెల :75/-**

**లభ్యత: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. 040-27660013**

ద్వితీయ ప్రపంచ మహా సంగ్రామంలో సోవియట్ ప్రజల ధీరోదాత్తతను, త్యాగనిరతిని అద్భుతంగా చిత్రించిన మరవరాని మహత్తర నవల ఇంద్రధనుస్సు. ఇది స్టాలిన్ బహుమతి పొందిన పుస్తకం.

**- పబ్లిషర్స్**

## డాన్ నది ప్రవహిస్తూనే ఉంది




**మిహైల్ షోలఖోవ్ ప్రసిద్ధ రష్యన్ నవల**

**'అండ్ క్వైట్ ఫ్లోస్ ది డాన్'**

**సంక్షిప్త పరిచయం: మహీధర రామమోహనరావు**

**పేజీలు : 86 వెల :35/-**

**లభ్యత: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. 040-27660013**

ఇది మిహైల్ షోలఖోవ్ రాసిన అత్యంత ప్రసిద్ధి పొందిన నవల. 1917 నుంచి షోలఖోవ్ కళ్ళారా చూసి, అనుభవించిన జీవితాన్ని నవలగా రాసాడు. రష్యా విప్లవ కాలంలో డాన్ నదీతీరంలో జీవించే కోసక్కుల పూర్వ చరిత్ర, సాంఘిక, రాజకీయ చరిత్రలకు అద్దంపట్టిన బృహన్నవల. వర్గాలూ, వర్గపోరాటాలూ అనే పదాలు ఉపయోగించకుండా వర్గాల మధ్య ఉండే అంతరాన్ని అత్యంత విశేషంగా మలచిన నవల.

**- పబ్లిషర్స్**

## దిటవు గుండెలు




**రెండవ ప్రపంచ యుద్ధకాలంలో సోవియట్ గెరిల్లాల వీరగాథ**

**రచయిత: ద్మీత్రియ్ మెద్వేదెవ్ అనువాదం: ఉప్పల లక్ష్మణరావు**

**పేజీలు : 266 వెల :75/-**

**లభ్యత: ప్రజాశక్తి బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు. 040-27660013**

"రష్యన్ దేశభక్తుడూ, బోల్‌షెవికూ ఎంతటి సమర్థవంతుడో ఫాసిస్టులు తెలుసుకొందురు గాక. సూర్యుణ్ణి రూపుమాపడం ఎంతటి అసాధ్యమో, మన ప్రజలను లొంగదీయడమూ అంత అసాధ్యమే అని వారు తెలుసుకొందురు గాక."

"నువ్వు చనిపోవు, నిజమే. కానీ జడుపు ఎరగని దిటవు గుండెల నుండి వెడలే పాటలో నువ్వు ఎల్లప్పుడూ సజీవమై ఉదాహరణగా, స్వాతంత్ర్యానికీ, వెలుగుకూ సగర్వమైన పిలుపుగా వుంటావు..."

**నవలలోని భాగం**

## హృదయజలధి




**వచన కవితా సంపుటి**

**రచయిత: 'రఘువర్మ'**

**పేజీలు : 62 వెల 35/-**

**లభ్యత: నవోదయ బుక్‌హౌస్, హైదరాబాద్**

"రఘువర్మ" అనే కలం పేరుతో వివిధ తెలుగు పత్రికలకు కవితలు, కథలు, వ్యాసాలు రాస్తున్న డా॥తుమ్మనపల్లి లక్ష్మీనారాయణ 1980 నుంచి వివిధ పత్రికల్లో ప్రచురణ పొందిన తన వచనకవితలను "హృదయజలధి" పేర ప్రచురించుకున్నారు. వీరి కవితలు "భారతి" వంటి సాహిత్య పత్రికలోనూ, "ఆంధ్రప్రభ", "ఆంధ్రజ్యోతి", "ఆంధ్రభూమి", "సుప్రభాతం", "మయూరి", "ఆంధ్రప్రదేశ్" వంటి సుప్రసిద్ధ పత్రికల్లోనూ ప్రచురణ పొందినాయంటే వీరి కవిత ఎంతటి ఉత్తమమైనదో గ్రహించవచ్చు.

**- సామల సదాశివ**

## కవిత్వ నిజ స్వభావం




**రోణంకి అప్పలస్వామి గారి రచనలు**

**సంపాదకుడు: డాక్టర్ మానేపల్లి**

**పేజీలు : 111 వెల :50/-**

**లభ్యత: 08931-231834**

ఇది కనీసం పాతికేళ్ల క్రితం 1984 ప్రాంతాల్లో జరగవలసినపని. నేను అప్పలస్వామి మేస్టారి దగ్గర (1959-1987) 27 ఏళ్ల సుదీర్ఘకాలం శిష్యరికం నెరపి, ఆయన రచనలు బహు ప్రయాసలకోర్చి, పుస్తక రూపంలో వెలువరించాలని కలలుకన్నాను. ఆయన బహుభాషా పాండిత్యాన్ని కవితా లుబ్ధత్వాన్ని తెలుగుదేశం గుర్తించలేదు. రాయని భాస్కరుడు కాదుగాని, అరుదుగా చేసిన రచన వారిది.

**- రచయిత**

## మట్టి నా ఆలాపన




**నాంపల్లి సుజాత**

**పేజీలు : 65 వెల 50/-**

**లభ్యత: విశాలాంధ్ర బుక్‌హౌస్ అన్ని బ్రాంచీలు**

"నెమలీకలు" పేరిట నానీల సంపుటితో కవితా జగత్తులో సముచితస్థానం సంపాదించుకున్న శ్రీమతి నాంపల్లి సుజాత వెలువరించిన సరికొత్త కవితా సంపుటి ఈ "మట్టి నా ఆలాపన". ఈ శీర్షికను చూడగానే నగర జీవితానికి సంలగ్నమైన నా హృదయం నేను పుట్టిన పల్లెలోకి వెళ్లిపోయింది. మా ఊరి మట్టిని దోసిళ్లలో నింపుకొని ఆప్యాయంగా గుండెకు హత్తుకుంది.

**- డాక్టర్ సి. నారాయణ రెడ్డి**




April 2010 pages _25.03.2010.pmd 38 3/27/2003, 6:35 PM

# కొత్త పుస్తకాలు




## నిశ్శబ్దం నీడల్లో (కవిత్వం)

**ముకుంద రామారావు**

**పేజీలు : 64, వెల : 50/-**

**లభ్యత: 9908347273**

కవిత్వం తలుపులు తెరిచి. నేను చూసే విశాల విశ్వాన్ని అనంతాకాశాన్ని, అద్భుతమైన ప్రకృతిని, అర్థం కాని ప్రపంచాన్ని అందరితో పంచుకోవాలన్న తపన నా చేత రాయిస్తూనే ఉంది. నాలోని అసంతృప్తికి కారణాల్ని నా లోపలి ప్రపంచంలో వెదుకుతూనే ఉన్నాను. నన్ను తెలిపే పదాలేవో నిశ్శబ్దంలోనే కలిసిపోతున్నాయోమో.

**- రచయిత**



## మానస మదర్పిత... తాంబూలాది...

**(కథా సంకలనం)**

రచయిత: **మానస**

**పేజీలు : 422, వెల : 200/-**

**లభ్యత: 9848167978**

మిడిల్ క్లాస్ లైఫ్‌దే మెజారిటీ అనిపించుకున్న ఈ కథల్లో వల్లమాలిన వైవిధ్యం చోటుచేసుకుంది. కేంపస్‌లైఫ్‌లోని ఏడాలసెంట్‌లవ్‌కి పెద్దపీట వెయ్యడం గమనించవచ్చు. మానవ సంబంధాల చిత్రణకి చిన్నబీట అయినా పడనంతకాలం ఎవరి గురించి ఏం చెబితే ఏం! కళ్లకు కట్టినట్టు కథకు తగిన వాతావరణం, పాత్రకు తగిన సంభాషణం చేకూర్చగల నేర్పు ఉన్నప్పుడు ఏ కథ అయినా చదివించి తీరుతుంది.

**- అవసరాల రామకృష్ణారావు**

---




## మూడో అందం

**గోటేటి లలితాశేఖర్ (కథలు)**

**పేజీలు : 143, వెల : 90/-**

**లభ్యత: 9394793921**

లలితాశేఖర్ కథల్లో వాస్తవికత కన్నా ఊహా శబలతే ఎక్కువ. అయితే ఆ ఊహలు గాలిలో తేలియాడేవి కావు. గడుసుతనం సంతరించుకున్నవీ కావు. సున్నితమైనవీ సూటితనం కలిగినవీ. లలితాశేఖర కథల్లో మానవతకు హారతి పట్టటం కనిపిస్తుంది. లలితాశేఖర్ కథలు ఆధర్శాలను ప్రబోధిస్తాయి. ఆదర్శమూర్తులతో పాటు చెడ్డవాళ్ళు కనిపిస్తారు. అయితే చెడ్డవాళ్ళు మంచివాళ్ళుగా పరివర్తన చెందటాన్ని మనం గ్రహిస్తాం.

**- పెనుగొండ లక్ష్మీనారాయణ**




## మువ్వలు

**(కథా సంకలనం)**

**భమిడిపాటి జగన్నాథ రావు**

**పేజీలు : 124, వెల : 80/-**

**లభ్యత: 9440883812**

భమిడిపాటి జగన్నాథరావు గారు సీనియర్ కథకులు. అరుదుగా రాసే అలవాటు వీరికి. చక్కటి శైలితో ఉండే వీరి కథల్లోని జీవిత దృశ్యాలు సజీవతను నింపుకుని పాఠకులను అలరిస్తాయి. గతంలో భమిడిపాటి జగన్నాథరావు కథల సంపుటి పేరుతో వేసారు. మువ్వలు వీరి రెండో కథా సంపుటి.

---




## సూర్యుని ఏడో గుర్రం

**కవితా సంపుటి**

**ఏ. సూర్యప్రకాశ్**

**పేజీలు : 94, వెల : 60/-**

**లభ్యత: 9885610069**

తొలి కవితా సంపుటి 'సంస్పందన' (1971) తర్వాత, 'మళ్లీ సూర్యోదయం'. 'కాగితం పువ్వు'. 'పత్రహరితం' వంటి కవితా సంపుటాలు వెలువరించాడు. ఇప్పుడు మీ చేతుల్లో వున్న 'సూర్యుని ఏడో గుర్రం' సూర్యప్రకాశ్ ఇటీవలి కవితల సంపుటి. ప్రతి సంపుటికి ఏదో రకమైన గుర్తింపు లభించింది. దశాబ్దం క్రితమే ఆయన కవిత ఆకాశవాణి జాతీయ కవి సమ్మేళనానికి ఎంపికైంది. 1983లోనే ప్రముఖ విమర్శకుడు టి.యల్.కాంతారావు సూర్యప్రకాశ్ కవిత్వాన్ని గుండెకు హత్తుకొన్నాడు.

**-డాక్టర్ అమ్మంగి వేణుగోపాల్**




## తెలంగాణ కవిత 2008

**సంపాదకుడు: సుంకర రమేశ్**

**పేజీలు : 203, వెల : 60/-**

**లభ్యత: పుట్ట పుస్తక కేంద్రం, ఆలగడప, నల్లగొండ జిల్లా**

'తెలంగాణా కవిత' రాస్తాలో మరో మైలురాయికి చేరుకున్నాం. ఇంతకు ముందు వచ్చిన తెలంగాణా కవిత–2006, తెలంగాణా కవిత–2007 పాఠకుల అభిమానాన్ని పొందాయి. తెలంగాణా సమకాలీన జీవితాన్ని భిన్న కోణాల్లో చిత్రించడం నిరంతర ప్రక్రియ. ఈ సంకలనం దీనికి కొనసాగింపు.

**-సంపాదకులు**



April 2010 pages _25.03.2010.pmd 39 3/27/2003, 6:35 PM

# మహాకావ్యం మా ఊరు

**డా॥ ఎన్.గోపి**



నా ప్రజలకన్నా
నా కవిత్వం గొప్పదేం కాదు
వారి పాదాల కన్నా
నా కవిత్వ పాదాలు చురుకైనవేం కాదు
వారి ముఖాల్లోని కాంతి
నా భావాల్లో పూర్తిగా వెలగదు
వారి కష్టాలూ కడగండ్లూ
వారి కనుల్లోని కవోష్ణధారలకన్నా
వారి పోరాట పటిమకన్నా
నా కవిత్వం తీవ్రమైందేం కాదు.

మా ఊరి ఆకాశం
మా ఊరి కొండా
ఊరినిండా గాలిలో వ్యాపించిన ధూళి
ఎవరో ఎప్పుడో రాసిన కవితలే,
కాల పరిమితి లేనివీ
ఎప్పటికీ అయిపోనివి.
చిత్రమేమిటంటే
నిన్న చదివిన దానికే
ఇవాళ మరో కొత్త స్ఫురణ!
క్షణక్షణం నవనవంగా
రచితమయ్యే

గచ్ఛత్ మహాకావ్యం మా ఊరు
మా ఊరు కన్నా
నా చైతన్యం గొప్పదేం కాదు.

ఏకపక్షమే కావొచ్చు
అవ్యక్త ప్రేయసీమణుల
విరహాన్ని అనుభవించలేదనికాదు
విలువైన స్నేహితుల ఆత్మీయత
గుండె గోడపై చిత్తరువుగా
మిగిలిపోలేదని కాదు
ఏదో ఆర్తి
సంవేదన

అర్థంకాని దిగులు
ఆకలి రేఖలతో రూపొందిన
అతిదీన చిత్రాలు
అయినా ఒక చిరునవ్వు
ఒక ఓదార్పునిచ్చిన
ప్రేమమూర్తులకన్నా
నా కవిత్వం మృదువైందేం కాదు.

నా భావనలకు మెరుగులద్దిన
హరితగీతాలు ఈ చెట్లు,
నా ఆలోచనలకు
రంగులు పూసిన సూర్యోదయాలు
ప్రతిపక్షీ
నా అక్షరాలకు
రెక్కలు మొలిపించేదే.

నా ఉత్తేజాన్ని తవ్వితీసినందుకు
ఆ పాటకు నమస్కారం
నా గుండెను తడిపినందుకు
ఆ వర్షానికి కృతజ్ఞత
ఇలా ఎంత రాసినా
మా ఊరి అనుభవాలకన్నా
నా కవిత్వం గొప్పదేం కాదు.

---


## ‘ప్రస్థానం’కు చందా కట్టండి!
## నెల నెలా మీ ఇంటికే ప్రస్థానం తెప్పించుకోండి!!

సాహిత్య ప్రస్థానం మాసపత్రిక చందా వివరాలు

**సంవత్సర చందా (వ్యక్తులకు) : రు.120/-** | **సంవత్సర చందా (సంస్థలకు) : రు. 150/-**

**అయిదేళ్లకు : రు. 500/-** — **పదేళ్లకు : రు. 1000/-** — **విడి ప్రతి : రు. 10/-**

**చందా దారులకు విజ్ఞప్తి**
చిరునామా పైన చందా ప్రారంభ మరియు ముగింపు నెలలు సూచించబడినవి. దయచేసి చందా ముగిసిన వారు తమ ముగింపు నెలను గుర్తించి వెంటనే చందాను పునరుద్ధరించుకోగలరు.

మేనేజర్
ప్రస్థానం
ఎం.హెచ్.భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్టిసి కళ్యాణమండపం దగ్గర, హైదరాబాద్-20
వివరాలకు : 040-27660013, సెల్: 9490099059 ; ఇ.మెయిల్:Prasthanam_ss@yahoo.co.in





April 2010 pages _25.03.2010.pmd 40 3/27/2003, 6:35 PM

## సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం




**ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రసంగిస్తున్న డాక్టర్ రాజేశ్‌గార్గె. చిత్రంలో సాహితీస్రవంతి ఖమ్మం జిల్లా కార్యదర్శి రౌతురవి, అద్దంకి కృష్ణప్రసాద్, సాహితీస్రవంతి ఖమ్మం జిల్లా అధ్యక్షులు కె. ఆనందాచారి ఉన్నారు.**

ఉగాది తెలుగు సంవత్సరం సందర్భంగా ఖమ్మం జిల్లా కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో కవిసమ్మేళనం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన డాక్టర్ రాజేశ్‌గార్గే మాట్లాడుతూ మనం రాసే కవిత్వం, రచనలు జన సామాన్యంలోకి వెళ్లాలని, వారు మా కోసమే వ్రాశారని తృప్తి చెందేలా చేస్తే శ్రీశ్రీలా, గురజాడ, చలం, జాషువా, వేమనలుగా జనంలో చిరంజీవులుగా మిగులుతారని అన్నారు. ప్రతి నెలా కార్యక్రమాలు నిర్వహిస్తున్న సాహితీ స్రవంతి ప్రయత్నాన్ని కొనియాడారు. భవిష్యత్‌లో ఇంకా మరిన్ని కార్యక్రమాలను నిర్వహిస్తూ మరింత మంది వర్ధమాన కవులను ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమానికి కె.ఆనందారి అధ్యక్షత వహించగా, సమన్వయ కర్తగా రౌతు రవి వ్యవహరించారు. డాక్టర్ పొత్తూరి వెంకట సుబ్బారావు, అద్దంకి, కృష్ణ ప్రసాద్‌లు కవి సమ్మేళనాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఉగాది సందర్భంగా ప్రభుత్వ సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ శ్రీమతి వాసిరెడ్డి ఉషారాణి చేతుల మీదుగా సన్మానం పొందిన సాహితీ స్రవంతి జిల్లా బాధ్యులు అంకిత కేశవులు, యం.శేషగిరి, సాధనాల వేంకటస్వామి నాయుడు, వురిమళ్ల సునంద, లెనిన్ శ్రీనివాస్, జి.వెంకటరమణ, గరికిపాటి మణిందర్‌లకు సాహితీస్రవంతి జిల్లా కమిటీ అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో బోడేపుడి విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు కందాడి శ్రీనివాసులు, జోసఫ్ టి. లక్ష్మీనర్సయ్యలు డా॥పివి.సుబ్బారావు, అంకిత.కేశవులు, కృష్ణ ప్రసాద్‌లను సత్కరించారు. లెనిన్ శ్రీనివాస్‌ను ప్రముఖ న్యాయవాది మద్ది శ్రీనివాసరెడ్డి సన్మానించారు. ఉగాది కవి సమ్మేళనంలో కపిల రాంకుమార్, కే.శ్రీధర్‌రావు, శంకర్‌రెడ్డి, కె.యల్.ఎన్.మూర్తి, భీష్మారెడ్డి, నాజర్, నూతక్కి, గురులక్ష్మి, అమ్మ ఒడిబాబు, శశిశ్రీ, మనోరమ, వంశీకృష్ణ, క్రాంతి తదితర వర్ధమాన కవులు తమ కవితలు చదివి వినిపించారు. శశిశ్రీ, మనోరమ, శేషగిరి పాటలు పాడి అలరించారు. లెనిన్ శ్రీనివాస్ వందన సమర్పణతో సభాకార్యక్రమం ముగిసింది.

## ‘నింగీ-నేలా’ ఆవిష్కరణ




**అంకిత కేశవులు రచించిన ‘నింగీ-నేలా’ హైకూ కవితా సంపుటిని ఆవిష్కరిస్తున్న సమీనా అఫ్రోజ్. చిత్రంలో రౌతురవి, కన్నెగంటి వెంకటయ్య, డాక్టర్ వై. రాధాకృష్ణమూర్తి, కె. ఆనందాచారి, పుస్తక రచయిత అంకిత కేశవులు ఉన్నారు.**

సాహితీస్రవంతి ఖమ్మం జిల్లా స్థాపకుల్లో ఒకరైన అంకిత కేశవులు వ్రాసిన “నింగీ-నేలా” పుస్తకావిష్కరణ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో మార్చి 7న జరిగింది. పుస్తకావ్కిరణకు ముందు మరో సీనియర్ కవి కె.సత్యశ్రీ మరణానికి సభ సంతాపం ప్రకటించి జోహార్లు అర్పించింది. ‘నింగీ-నేలా’ పుస్తకాన్ని ఖమ్మం మున్సిపల్ ఛైర్‌పర్సన్ శ్రీమతి సమీనా అఫ్రోజ్ ఆవిష్కరించగా కె. ఆనందాచారి సభకు అధ్యక్షత వహించారు. ఆత్మీయ అతిథిగా మాజీ ఎంపి డాక్టర్ వై.రాధకృష్ణమూర్తి పాల్గొని హైకులు రాసిన కేశవులను అభినందించారు. కన్నెగంటి వెంకటయ్య పుస్తకాన్ని సమీక్షిస్తూ మాట్లాడారు. పుస్తకంలోని 365 హైకులున్నాయని తెలుపుతూ, సంవత్సరానికి 365 రోజులు గనుక హైకు వార్షికంగాను, సామాన్యులను ఆలోచింపజేసేలా ఉన్నాయని అన్నారు. అల్పమైన అక్షరాలతో అనల్పమైన అర్థం స్ఫురించేలా ఉన్న హైకూలు నేటితరం యువకులకు స్ఫూర్తినిస్తాయని అన్నారు. అన్ని వర్గాల వారికి ఉపయుక్తంగా ‘నీంగీ-నేలా’ ఉందని అన్నారు. ఆవిష్కరణ సందర్భంగా రచయిత కేశవులుకు సన్నిహితుడు, సమకాలిక రచయిత డి.ఆర్.నర్సింహారావు, జిల్లా కార్యదర్శి రౌతు రవి ఆత్మీయ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కె.శంకర్‌రెడ్డి, అమ్మఒడిబాబు, కె.శ్రీధర్‌రావు, పోతగాని సత్యనారాయణ, టి.లక్ష్మీనర్సయ్య, అంకిత రవి పాల్గొన్నారు. వక్తలను శ్రీమతి వురిమళ్ల సునంద ఆహ్వానం పలుకగా, లెనిన్ శ్రీనివాస్ వందన సమర్పణ చేశారు.



**హైదరాబాద్ నగర కేంద్ర గ్రంథాలయంలో మానస ఆర్ట్ థియేటర్ ఆధ్వర్యంలో మార్చి 14న జరిగిన సభలో రచయిత వివేకానందను ఉగాది విశిష్ట పురస్కారంతో సత్కరిస్తున్న ప్రముఖ రచయిత కొలకలూరి ఇనాక్. చిత్రంలో రఘువీరప్రతాప్, ఆచార్య పి. చెన్నారెడ్డి, కోకాప్రసాద్, డాక్టర్ వి.వి.ఎల్. నరసింహారావు, రఘుశ్రీ, సరికొండ నరసింహరాజు**



April 2010 pages _25.03.2010.pmd 41 3/27/2003, 6:35 PM

## వ్యవసాయ ప్రణాళికే ఉగాది



విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి, యువస్పందన సంయుక్త ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి చీకటి దివాకర్, మానాపురం చంద్రశేఖర్ నిర్వాహకులుగా వ్యవహరించారు. సాహితీస్రవంతి కన్వీనర్ చీకటి దివాకర్ మాట్లాడుతూ "ఉగాది వ్యవసాయ సంబంధమైన పండుగ. వ్యవసాయానికి అనుకూలంగా భూమిని తయారుచేసుకోవడం, వ్యవసాయ పరికరాలను సిద్ధం చేసుకోవడం ఈపండుగతోనే మొదలవుతుంది' అని అన్నారు. యువస్పందన వ్యవస్థాపకులు డాక్టర్ రామసూరి మాట్లాడుతూ 'ఉత్తరాంధ్ర సాంస్కృతికంగా జవసత్వాలు కలిగి ఉందని యువకవులు, కవయిత్రులు నిరూపించాలని అన్నారు. యువత స్వతంత్రంగా తమయొక్క అభిప్రాయాలను వ్యక్తపరచాలని ఉద్బోధించారు. యువత వారియొక్క వ్యక్తిత్వ వికాసం కొరకు సాహితీస్రవంతి వంటి వేదికలను చక్కగా ఉపయోగించుకోవాలని సూచించారు. కవిసమ్మేళనంలో డాక్టర్ చాగంటి తులసి, డాక్టర్ రామసూరి, డాక్టర్ పి.వి.వి.యల్. సుబ్బారావు, చింతా అప్పలనాయుడు, సిరికి స్వామినాయుడు, అల, గవిడి శ్రీనివాస్, పాయల మురళీకృష్ణ, సంతోష్, మిర్యాల రామకృష్ణారావు, చెళ్ళపిళ్ళ శ్యామల, సుభద్ర, లావణ్య, మెహర్‌లత, ఆనంద్, శ్రేయ, చంద్రిక, పి. లక్ష్మణరావు, బులుసు సరోజాదేవి, బాలు తదితరులు పాల్గొన్నారు. ఈలపాటలు, జానపద కళలు, సమైక్యాంధ్ర, చట్టసభల్లో 33% రిజర్వేషన్ బిల్లు, మహిళలు, విద్యార్థినిలపై దాడులు, అత్యాచారాలు, పర్యావరణం తదితర సామాజికాంశాలను వస్తువుగా తీసుకుని వైవిధ్యభరితంగా తమ కవితలను చదివి వినిపించారు. ముఖ్యంగా ఆరేళ్ళ చిన్నారి శ్రేయ తన స్వీయ కవితను గానం చేసి ప్రేక్షకుల ప్రశంసలు పొందింది. 'మా' టీవీ 'రేలా రేలా' కార్యక్రమంలో పాల్గొన్న యువగాయకుడు జానకీరామ్ 'పల్లె మారింది, నా పల్లె మారింది' అంటూ మారుతున్న పల్లెల్లోని ఆటలు, జానపద కళలను ప్రస్తావిస్తూ పాడిన పాట సభికుల్ని విశేషంగా అలరించింది. ఈ కార్యక్రమానికి రాజాం, శ్రీకాకుళం, పార్వతీపురం,



విశాఖపట్నం, తదితర ప్రాంతాల నుండి కవులు, రచయితలు, రచయిత్రులు విచ్చేసారు. శ్రేయ దేశభక్తి గేయంతో ఈ కార్యక్రమం ప్రారంభమై మరువాడ భానోజి వందన సమర్పణతో ముగిసింది.

**– చంద్రిక**

## 'నూరేళ్ల తెలుగు కథ'పై సదస్సు



భద్రాచలంలో సాహితీ స్రవంతి ఆధ్వర్యంలో నెలనెలా జాబిలి ప్రత్యేక సాహిత్య కార్యక్రమంగా మార్చి 7న 'నూరేళ్ల తెలుగు కథ'పై సదస్సు నిర్వహించబడింది. స్థానిక లిటిల్ ఫ్లవర్స్ జూనియర్ కాలేజీ ప్రాంగణంలో జరిగిన ఈ సభకు ముఖ్య అతిథిగా "సాహితీ బంధు" మాగంటి సూర్యం హాజరయ్యారు. తెలుగు సాహిత్యంలో 'కథ'కు ప్రముఖ స్థానం వుందని ఎందరో కథకులు మన తెలుగు నాట విలసిల్లారని, ఈ రోజుల్లో కూడా ఎంతో వైవిధ్యం వున్న కథలు వస్తున్నాయని పాఠకులంతా తెలుగు కథలు చదవాలని ఆయన అన్నారు. ఈసభకు సభాధ్యక్షులుగా ఎన్.సి.హెచ్.చక్రవర్తి, సమన్వయకర్తగా మాల్యశ్రీ – 'నూరేళ్ల కథ' గురించి వివరించారు. సభకు ప్రధాన వక్తగా విచ్చేసిన శిరంశెట్టి కాంతారావు 'తెలుగు కథ' గురించి, పుట్టు పూర్వోత్తరాల గురించి స్వరూప స్వభావాల గురించి వివరించారు. ఈ కార్యక్రమానికి వీధుల రాంబాబు స్వాగతం పలుకగా, తాతోలు దుర్గాచారి– గురజాడ గీతాన్ని ప్రారంభగీతంగా ఆలపించారు. సభా ప్రారంభంలో దుర్గాచారి రచించిన "నేనేం పాపం చేసాననీ…?" శీర్షికన ఆర్టీసీపై రాసిన కవితను మాగంటి సూర్యం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎస్.కాంతారావును, మాల్యశ్రీని సాహితీ స్రవంతి సత్కరించింది. ఈ సభలో శ్రీధిరాల వెంకటాచారి, సర్వోత్తమ్, జి.రామరాజు, సి.హెచ్.తిరుపాలు, కె.పార్థసారథి, రఘునాథ్, పి.కామేశ్వరరావు, వి.చంద్ర, కాసర్ల రంగారావు, శంకర్‌సింగ్, ఐ.వి.పి. పూర్ణానంద్, నారాయణ, బి.విజయకుమార్, ప్రశాంత్, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

**– తాతోలు దుర్గాచారి**



April 2010 pages _25.03.2010.pmd 42 3/27/2003, 6:35 PM

# తెలుగు భాషాభివృద్ధికి ప్రణాళికేది?



**తె**లుగు భాషాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం కేటాయించిన 150 కోట్ల రూపాయలను ఖర్చు చేసే పరిస్థితి కనిపించడం లేదని కృష్ణాజిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ జి.వి. పూర్ణచంద్ ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి పరిస్థితి నెలకొని ఉండడం విచారకరమని అన్నారు. సాహితీస్రవంతి విజయవాడ నగర కమిటీ ఆధ్వర్యాన మార్చి 20న గవర్నరుపేటలోని శ్రీశ్రీ సభామందిరంలో ఉగాది కవి సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రజాశక్తి అసిస్టెంట్ ఎడిటర్ ఎస్. వెంకట్రావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా 'తెలుగు వెలిగేనా?' అంశంపై పూర్ణచంద్ మాట్లాడుతూ తెలుగుకు ప్రాచీన హోదా కల్పించడం హర్షణీయమని అన్నారు. అయితే ప్రాచీన హోదా అనడం కన్నా ప్రాచీన విశిష్టత అనటం సమంజసంగా ఉంటుందన్నారు. సుదీర్ఘకాల పోరాట ఫలితంగా ఆ హోదా లభించిందన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలుగు, కన్నడ భాషల అభివృద్ధికి రూ.150 కోట్ల చొప్పున కేటాయించిందనీ అన్నారు. అయితే కన్నడ భాషాభివృద్ధికి కర్నాటక ప్రభుత్వం 60 రకాల పథకాలతో సిద్ధంగా ఉందనీ, ఇంకో 150 కోట్లు ఇచ్చినా ఖర్చు చేసేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. అయితే తెలుగు భాషాభివృద్ధికి ఆ 150 కోట్లు ఖర్చు చేసేందుకు ఎలాంటి భవిష్యత్తు కార్యక్రమం రూపొందించలేదని నిస్సహాయ స్థితిలో ఉందని అన్నారు. ఇది తెలుగువారి దౌర్భాగ్యమన్నారు. ఇలా అయితే ప్రాచీన హోదా లభించిందనే ఆత్మతృప్తి తప్ప తెలుగువారికి ఒనగూడే ప్రయోజనం ఏమీ ఉండదని అన్నారు. తెలుగు భాషాభివృద్ధి పట్ల బ్రిటీష్ వారు నిర్లక్ష్యం వహించారంటే అర్థముందనీ, కానీ తెలుగు వారు కూడా ఇలా ప్రవర్తించటం ఏమిటని ప్రశ్నించారు. తెలుగుకు విశిష్టమైన లక్షణం ఉందని, ఇందులో ఉన్న పదాలు మరే భాషలో వెతికినా దొరకవని అన్నారు. తెలుగు భాషా విశిష్టతను కాపాడేందుకు అందరూ కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. అధ్యక్షులు వెంకట్రావు మాట్లాడుతూ తెలుగు వెలిగేనా అనే అంశంలోనే కొంత నిరాశ ఉందని, దాన్ని పోగొట్టేందుకు ప్రయత్నించాలన్నారు. ఉగాది తెలుగు భాషా సంస్కృతిని ప్రతిబింబిస్తూ తెలుగు దనాన్ని వ్యక్తీకరించే పండుగగా అభివర్ణించారు. తెలుగుకు పూర్వవైభవం రావాలంటే కొన్ని నిర్దిష్ట చర్యలు చేపట్టాలని, అందుకు విస్తృతమైన చర్చ జరగాల్సి ఉందని అన్నారు.



తెలుగు భాష అంతరించే భాషల్లో లేకపోయినా ప్రమాదంలో మాత్రం పడిందని, ఇది ఆందోళనకర విషయమని అన్నారు. ప్రపంచీకరణ ప్రభావం అనేక రంగాలపై పడే ముందే ఆయా మాతృభాషలను నాశనం చేస్తుందని, తద్వారా అక్కడ తన ఉత్పత్తులను అమ్ముకొనేందుకు మార్కెట్‌ను సృష్టించుకుంటుందని అన్నారు. తెలుగు రాకుండా, తెలుగులో మాట్లాడకుండా తెలుగు రాష్ట్రంలో బతకలేమనే పరిస్థితి రావాలని, అలాగే తెలుగులోనే పాఠ్యాంశాలు ఉండాలన్నారు. ఇతర భాషల్లోని పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు తెలుగు భాషలోకి అనువదించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రాచీన హోదా సాధించటం సంతోషమని, దాన్ని చక్కగా అమలు చేసేందుకు ఓ కమిటీ ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. సభను గుమ్మా సాంబశివరావు, రావెళ్ళ శ్రీనివాస్ నిర్వహించారు. అనంతరం జరిగిన కవిసమ్మేళనంలో కె. ఆంజనేయకుమార్, కోకా విమలకుమారి, బూరుగుపల్లి ప్రభావతి, కమిలిశ్రీ, వేలూరి కోటిలింగం, సిహెచ్.వి. బృహ్మానందరావు, భమిడిపాటి బాలాత్రిపుర సుందరి, ఫణీంద్రనాథ్, వై.ఎస్. లక్ష్మి, సత్యప్రకాశ్, చలపాక ప్రకాష్, వై.కె. మూర్తి, పి. పుష్పాదేవి, జె.వి. సాంబశివరావు, వై. సత్యనారాయణమూర్తి, కె.ఎస్. రామారావు, యల్లాప్రగడ చిరంజీవి, ఎ. గోపినాథ్, లక్కరాజు వాణీ సరోజిని తదితరులు తమ కవితలు చదివారు. సాహితీస్రవంతి నగర కన్వీనర్ కె. సత్యరంజన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి జి. నారాయణరావు వందన సమర్పణ చేశారు. ముందుగా ప్రజానాట్యమండలి గాయకులు ఆర్. రాజేష్, బి. శ్రీను, హనీఫ్ తెలుగుభాషలోని కమ్మదనాన్ని వివరిస్తూ పాటలు పాడి అలరించారు.




**మార్చి 6న హైదరాబాద్ చిరాన్ ఫోర్ట్ క్లబ్‌లో జరిగిన యగళ్ళ ఫౌండేషన్ – 2009 అవార్డు ప్రధానోత్సవంలో పాల్గొన్న ఎ.బి.కె. ప్రసాద్, డాక్టర్ యగళ్ళ పద్మావతి, యగళ్ల రామకృష్ణ, డాక్టర్ వెలగా వెంకటప్పయ్య, రెవెన్యూ శాఖామంత్రి ధర్మాన ప్రసాదరావు, త్రిపుర తరపున అవార్డు స్వీకరణకు హాజరైన డాక్టర్ శ్రీమతి వింధ్య, చిరాన్ ఫోర్ట్ క్లబ్ అధినేత**



**నాంపల్లి సుజాత రచించిన 'మట్టి నా ఆలాపన' కవితా సంపుటిని కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో ఆవిష్కరిస్తున్న డాక్టర్ ఎన్. గోపి. చిత్రంలో ధాస్య సేనాధిపతి, డాక్టర్ నలిమెల భాస్కర్, జూకంటి జగన్నాథం, జిల్లా విద్యాధికారి రామేశ్వర్ రాజు, కవయిత్రి సుజాత, గుడిపాటి, యన్. ఆరుణ, డాక్టర్ అడువాల సుజాత, మాడిశెట్టి గోపాల్ ఉన్నారు.**



April 2010 pages _25.03.2010.pmd 43 3/27/2003, 6:35 PM

# బొబ్బిలి, పార్వతీపురంలలో భగత్‌సింగ్ వర్ధంతి



బొబ్బిలి పట్టణంలో జరిగిన భగత్‌సింగ్ వర్ధంతి సభలో మాట్లాడుతున్న రచయిత ఎస్. ప్రభాకర్

విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, పార్వతీపురం పట్టణాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యంలో మార్చి 22న భగత్‌సింగ్ వర్ధంతి సభలు జరిగాయి. పార్వతీపురంలో స్థానిక చర్చివీధిలోని సూర్యతేజ పబ్లిక్‌స్కూల్ వద్ద కవి సిరికి స్వామినాయుడు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సభలో పాల్గొన్న రచయిత మల్లిపురం జగదీష్ మాట్లాడుతూ భగత్‌సింగ్ గొప్పదేశభక్తుడని, ఆయన చూపిన మార్గం స్ఫూర్తిదాయకమని అన్నారు. స్వాతంత్ర్యపోరాటాన్ని మలుపుతిప్పిన సాహసి భగత్‌సింగ్ అని కొనియాడారు. ప్రముఖ కథారచయిత పివిబి శ్రీరామ్మూర్తి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు ఈ సభలో పాల్గొన్నారు. పిల్లా లక్ష్మునాయుడు వందనసమర్పణతో కార్యక్రమం ముగిసింది.

బొబ్బిలి పట్టణంలో తాండ్ర పాపారాయ పాఠశాలలో సాహితీస్రవంతి ఆధ్వర్యాన భగత్‌సింగ్ 79వ వర్ధంతి సభ జరిగింది. ఈ సభలో పాల్గొన్న ప్రముఖ రచయిత ఎస్. ప్రభాకర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరంలో ప్రాణాలర్పించిన అమరజీవి భగత్‌సింగ్ జీవితం స్ఫూర్తివంతమైందని అన్నారు. దేశంకోసం ప్రాణత్యాగం చేసిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ సేవలను యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. జాతివిముక్తి పోరాటానికి కొత్తరూపం ఇచ్చిన మహనీయులు వారని కొనియాడారు. దేశం కోసం 23 ఏళ్ళ వయస్సులోనే ప్రాణ త్యాగం చేసిన మహోన్నత వ్యక్తులు వారని గుర్తుచేశారు. భగత్‌సింగ్ చరిత్ర తెలిపే పుస్తకాలను ప్రతి ఒక్కరూ చదవాలని కోరారు. కార్యక్రమంలో సాహితీస్రవంతి బొబ్బిలి శాఖ అధ్యక్షులు జి. భాస్కరరావు, రాజా కళాశాల లెక్చరర్ సంగం నాయుడు, రచయిత వాగ్దేవి, రచనా సమాఖ్య అధ్యక్షులు ఎం. విజయమోహన్, యుటిఎఫ్ నాయకులు వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# 'ఎడతెగని ప్రయాణం'కు "ఉమ్మడిశెట్టి సాహితీ అవార్డు"

22వ ఉమ్మడి శెట్టి సాహితీ అవార్డును ప్రముఖ కవి యాకూబ్ రచించిన 'ఎడతెగని ప్రయాణం' కవితా సంపుటికి ప్రకటించినట్లుగా అవార్డు వ్యవస్థాపకులు డా॥ రాధేయ ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ అవార్డు న్యాయ నిర్ణేతలుగా ఆచార్య తంగిరాల వేంకటసుబ్బారావు, డా॥ దేవరాజు మహారాజు, డా॥ మేడిపల్లి రవికుమార్‌లు వ్యవహరించినట్లు తెలిపారు. సామాజిక మూలాల్ని స్పృశిస్తూ బ్రతుకులోని భావోద్వేగాలను తాత్త్వికత వైపు నడిపించిన కావ్యంగా యాకూబ్ కవిత్వాన్ని న్యాయనిర్ణేతలు విశ్లేషించారని ఆయన పేర్కొన్నారు. యాకూబ్ గతంలో ప్రవహించే జ్ఞాపకం, సరిహద్దు రేఖ కవితాసంపుటాలను రచించారు. ఈ అవార్డు ప్రదానోత్సవ సభ జూలై నెలలో అనంతపురంలో జరుగుతుందని డాక్టర్ రాధేయ తెలియజేసారు.

# డా. ఎన్. గోపి 'జలగీతం' కావ్యం గుజరాతీ అనువాదానికి కేంద్ర అవార్డు

ప్రముఖ తెలుగు కవి డా. ఎన్. గోపి రచించిన 'జలగీతం' కావ్యాన్ని ప్రసిద్ధ గుజరాతీ కమణిక్ సోమేశ్వర్ గుజరాతీ భాషలోకి అనువదించారు. అహమదాబాద్‌లోని రన్నద్ ప్రకాశన్ వారు 2006 దీనిని ప్రచురించారు. డిల్లీ సాహిత్య అకాడమీ వారు యేటా 24 భారతీయ భాషల్లో అనువాద గ్రంథాలను పురస్కారాలకు ఎంపిక చేస్తారు. వాటిలో 2009 సంవత్సరానికి గాను రమణిక్ సోమేశ్వర్ 'జళగీత్' పేరిట చేసిన గుజరాత్ అనువాదానికి పురస్కారం లభించింది. 2010 ఆగష్టులో ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో పురస్కారం కింద యాభై వేల రూపాయల నగదు, తామ్రపత్రం ప్రదానం చేస్తారని అకాడమీ సెక్రెటరీ అగ్రహార కృష్ణమూర్తి ప్రకటించారు. గ్రంథరూపంలో రాకముందే జలగీతానికి గుజరాతీ పత్రికల్లో విశేషమైన ప్రాచుర్యం లభించింది. అక్కడి విశ్వవిద్యాలయాల్లో ఎం.ఫిల్., పి. హెచ్.డి. పరిశోధనలు కూడా జరుగుతున్నాయి. ఈ గ్రంథం కచ్ యూనివర్శిటీలో భారతీయ సాహిత్య సిలబస్‌లో చోటు సంపాదించింది. డా. ఎన్. గోపి సాహిత్య అకాడమీ పురస్కృత 'కాలాన్ని నిద్రపోనివ్వను' కవితా సంపుటి (2000)ని కూడ రమణిక్ సోమేశ్వర్ గుజరాతీ భాషలోకి అనువదించారు. త్వరలోనే సాహిత్య అకాడమీ వారు దాని ప్రచురణను వెలువరిస్తారు. రమణిక్ సోమేశ్వర్ గుజరాత్ కచ్ జిల్లాలోని న్యూఅంజర్ నివాసి. జజావత్ వచ్చేపూల్, గీతాంజలి ఆల్బమ్, తమే ఉకేలోభేద్, గుజరాతీ కవితా చమక్ అనేవి వీరి ముద్రిత గ్రంథాలు. వీరికి ఇదివరకే ఎన్.కె. తానావాలా అవార్డు, డా. జయంత్ ఖత్రి బకులేష్ అవార్డు లభించాయి. 'జలగీతం' 'దీర్ఘకావ్యం ఇప్పటి వరకు హిందీ, ఇంగ్లీషు, మరాఠీ, గుజరాతీ, ఉర్దూ, కన్నడ, మలయాళం, ఒరియా, పర్షియన్ భాషల్లోకి అనువాదమైంది.



April 2010 pages _25.03.2010.pmd 44 3/27/2003, 6:35 PM

## 'మానవుడే మా సంగీతం' ఆవిష్కరణ




మహాకవి శ్రీశ్రీ శతజయంతిని పురస్కరించుకొని మార్చి 7న "మానవుడే మా సంగీతం" పాలమూరు జిల్లా కవుల కవితా సంకలనాన్ని ప్రముఖ కవి కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహిత కె. శివారెడ్డి ఆవిష్కరించారు. ఎ.కె. కుర్మన్న అధ్యక్షతన జరిగిన ఈ సభలో ఆయన మాట్లాడుతూ కవిత్వం మనిషిలోని భావోద్వేగాలను శుభ్రం చేస్తుందన్నారు. సమాజంలోని సైన్సు పురోభివృద్ధితో పాటు సాహిత్యంలో ఆధునికత ప్రారంభమైందని అన్నారు. కవులు, రచయితలు సృజించిన క్లాసిక్స్ కాల పరిమితులను అధిగమించి తదనంతర కాలంలో కూడా అన్వయించబడతాయని అన్నారు. సంక్లిష్టమైన ఆధునిక జీవితాన్ని ఆధునిక సాహిత్యం ప్రతిబింబిస్తుందన్నారు. శ్రీశ్రీ 1630 దశాబ్ధిలో ప్రచలితంగా వున్న సామాజిక వైరుధ్యాలు పట్టుకొని సామాజిక మార్పుకు తోడ్పడే సాహిత్యాన్ని సృష్టించారని అన్నారు. కవి హిమజ్వాల మాట్లాడుతూ సాహిత్య అధ్యయనంతో పాటు సమాజ అధ్యయనం కూడా చేయాలంటూ, ప్రాచీన సాహిత్యం చిత్రించిన సామాజిక ఘర్షణనే మళ్ళీ నేడు కవులు చిత్రీకరించకూడదన్నారు. వర్తమాన సమాజ సమస్యలకు ప్రతిస్పందిస్తూ కవులు సాహిత్య సృజన చేయాలన్నారు. ప్రగతి శీల కవులు తిరోగమన భావ జాలానికి లొంగకుండా జీవిత సంఘర్షణను సాహిత్యంలో పట్టుకోవాలని శ్రీశ్రీ వారసత్వాన్నికొనసాగించడమంటే వర్గపోరాటాన్ని కొనసాగించడమేనని అన్నారు. ఈ నేపథ్యంలోనే పాలమూరు జిల్లా నుండి కవితా సంకలనాన్ని యువకులు తీసుకరావడం సంతోషమని అన్నారు. ఈ సందర్భంగా వనపర్తి పట్టణంలోని పాఠశాలలు కళాశాలల్లో ప్రజాసాహిత్య వేదిక తరపున నిర్వహించిన వ్యాసరచన ఉపన్యాస పోటీల్లోని విజేతలైన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమాల్లో వనపర్తి మున్సిపల్ ఛైర్మన్ బి. లక్ష్మయ్య, కౌన్సిలర్ వాకిటి శ్రీధర్, ఎం.ఇ.ఓ. మధూకర్ డాక్టర్ కె. వీరయ్య, సాహితీవేత్తలు. నవీన్, పరిమళ్, విరజాజి రామిరెడ్డి, దేవదానం. డి.వి.వి. ఎస్ నారాయణ, మీనాకుమారి, జాతీయ జర్నలిస్టు కౌన్సిల్ సభ్యులు మల్యాల బాలస్వామి, సాహితీ అభిమానులు పాల్గొన్నారు. వేదిక సభ్యులు ఎస్. శాంతన్న ఆహ్వానం పలుకగా జి. యోగానంద్ వందన సమర్పణ చేశారు.

**- యోగానంద్**

## సుప్రసన్నకు ఠాగూర్ పురస్కారం

ప్రముఖ సాహితీవేత్త కోవెల సుప్రసన్నాచార్యకు ప్రతిష్ఠాత్మకమైన ఠాగూర్ అవార్డు లభించింది. కేంద్ర సాహిత్య అకాడమీ, కొరియాకు చెందిన ప్రముఖ వాణిజ్య సంస్థ సామ్‌సంగ్ సంయుక్తంగా నెలకొల్పిన ఠాగూర్ సాహితీ అవార్డులు ఈ ఏడాది 8 భాషలకు చెందిన ప్రసిద్ధ రచయితలకు దక్కాయి. 2009 సంవత్సరానికి గాను ఈ అవార్డులు గ్రహించిన వారిలో కోవెల సుప్రసన్నాచార్య (తెలుగు), అలోక్ సర్కార్ (బెంగాలీ), బ్రజేంద్రకుమార్ బ్రహ్మ (బోడో), భగవాన్ దాస్ పటేల్ (గుజరాతీ), రాజీసేథ్ (హిందీ), నసీమ్ షఫల్ (కాశ్మీర్) చంద్రశేఖర కంబార్ (కన్నడ), జస్వంత్ సింగ్ కన్వల్ (పంజాబీ) ఉన్నారు. 'అంతరంగం' పేరిట చేసిన రచనకు కోవెల సుప్రసన్నాచార్యకు ఈ పురస్కారం లభించింది. అవార్డు కింద ఒక్కొక్కరికి రు. 95 వేల నగదు బహుమతి, శాలువ, మెమెంటోను కొరియా రిపబ్లిక్ అధ్యక్షుడి సతీమణి కిమ్ యూన్ ఓక్, ఆ దేశ సాంస్కృతిక మంత్రి యూ ఇన్ చోన్ ప్రదానం చేశారు. ఢిల్లీలోని ఒబెరాయ్ హోటల్‌లో కన్నుల పండుగగా జరిగిన ఈ కార్యక్రమంలో భారత సాంస్కృతిక శాఖ కార్యదర్శి జవహర్ సర్కార్, సాహిత్య అకాడమీ అధ్యక్షుడు సునీల్ గంగోపాధ్యాయ, కార్యదర్శి అగ్రహార కృష్ణమూర్తి, సామ్‌సంగ్ సంస్థ సీఈఓ వై. డబ్ల్యు లీ, ప్రముఖ నటి షర్మిలాఠాగూర్ తదితరులు పాల్గొన్నారు. తెలుగుకు న్యాయ నిర్ణేతలుగా దేవరాజు మహారాజు, ఘండికోట బ్రహ్మాజీరావు, సునీతారాణి వ్యవహరించారని సునీల్ గంగోధ్యాయ చెప్పారు. అవార్డు స్వీకరించిన అనంతరం కోవెల సుప్రసన్నాచార్య విలేఖరులతో మాట్లాడుతూ అవార్డులు రచనల ఔన్నత్యాన్ని బట్టి దక్కాలని అన్నారు. వేయి పడగలు, రామాయణ కల్పవృక్షం పేర్లు వింటే విశ్వనాథ గుర్తుకు వస్తారన్నారు. చేతనావర్త కవులుగా సాహితీ రంగంలో ప్రవేశించిన తాను అనేక కావ్యాలు, సాహితీ విమర్శనా గ్రంథాలను వెలువరించానని చెప్పారు. ప్రస్తుతం అవార్డు లభించిన అంతరంగం ప్రాచీన, ఆధునిక సాహిత్య ప్రతిభలను చర్చిస్తుందన్నారు. సాహితీవేత్తల అంతరంగంలోకి వెళ్లి వారి గ్రంథాలను విశ్లేషించి అనేక పీఠికలు రాశానని చెప్పారు. నాచన, విశ్వనాథ, గిడుగు, పుట్టపర్తి, రాయప్రోలు, వానమామలై, నాయని, దాశరథులపై ఈ పుస్తకంలో వివరించానని తెలిపారు.




**విజయనగరంలోని గురజాడ కేంద్ర గ్రంథాలయంలో సాహితీస్రవంతి, యువస్పందన సంయుక్త ఆధ్వర్యంలో జరిగిన ఉగాది కవి సమ్మేళనం**



April 2010 pages _25.03.2010.pmd 45 3/27/2003, 6:35 PM

# ఇల్లెందు సాహితీస్రవంతి ఆధ్వర్యంలో ఉగాది కవి సమ్మేళనం



కన్నుల్లో దైన్యం చైతన్యమై రూపుదిద్దుకుంటుంది... చుట్టుముట్టిన చీకటిలో మనోనేత్రం అప్రమత్తమవుతోంది.. అంటూ కవయిత్రి ఇందిర, రహదారులపై ఘోరకలిని... వరద బీభత్సంలో ఆకలినీ.. ఎలా మరువం వికృతీ అంటూ కవి రమేష్... అదిగో విరోధి తోరణం... ఇదిగో వికృతీ సమస్యల తోరణం.. అంటూ కవయిత్రి కన్నాంబ... మానవత్వం మరిచిపోతాండో మనిషి... అంటూ గేయరచయిత లింగాల వెంకన్న, నా తెలంగాణాలో తెల్లారెదెప్పుడో అంటూ కాలువ సుధాకర్ చదివిన కవితలు సభికులను అలరించాయి. వికృతి ఉగాది పర్వదినం సందర్భంగా ఖమ్మం జిల్లా ఇల్లెందు ఎస్.టి. బాలికల వసతిగృహంలో మార్చి 16న సాహితీస్రవంతి ఇల్లెందు శాఖ ఆధ్వర్యంలో కవిసమ్మేళనం జరిగింది. నేటి రాజకీయ, ఆర్థిక పరిస్థితులపై తమ కవితా శరాలను సంధిస్తూ కవులు కవితాగానం చేశారు. సాహితీస్రవంతి జిల్లా ఉపాధ్యక్షులు కటుకోర్ఘ్వుల రమేష్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో పొట్టిశ్రీరాములు జయంతిని పురస్కరించుకొని వాసవీక్లబ్ ఇల్లందు శాఖ కవులకు మెమోంటోలు అందజేసింది. కార్యక్రమంలో క్లబ్ బాధ్యులు చిదిరాల లింగయ్య, దామోదర్‌రావు, సీతారామయ్య, సినీ కళాకారులు సుందర్, సంగీత ఉపాధ్యాయిని సత్యకుమారి, రాకం శ్యామ్‌బాబు, సంతోష్ తివారి, వార్డెన్ వసంతకుమారి, పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



**మార్చి 20న విజయవాడలోని గవర్నర్‌పేటలో శ్రీశ్రీ సభామందిరంలో జరిగిన ఉగాది కవిసమ్మేళనంలో కవిత చదువుతున్న కవయిత్రి శ్రీమతి ప్రభావతి**

# అలరించిన కవిసమ్మేళనం



ప్రకాశం జిల్లా మార్కాపురంలోని స్థానిక శ్రీ సాధన డిగ్రీ కళాశాలలో ఫిబ్రవరి 28న జరిగిన "నెల నెల వెన్నెల సాహితీ సదస్సు"లో ప్రముఖ అవధాని, సంస్కృతాంధ్ర పండితులు ఎస్.ఎ.టి.కె ఆచార్య "తిక్కన భారతం సామాజిక కోణం" అంశం మీద సుదీర్ఘ సాహితీ విశ్లేషణ చేసారు. సమాజ దర్పణమే సాహిత్యం అన్నారు. తిక్కన భారతంలో జీవన విధానం, సమయస్ఫూర్తి పెద్దల పట్ల ప్రవర్తించాల్సిన తీరు, విజయరహస్యాలు, ఓరిమి గుణం ఉన్నాయన్నారు. ఇతరులు ఏమి చేస్తే తనకు బాధ కలుగుతుందో దానిని మనం ఇతరులకు చేయకుండా ఉండడం పరమధర్మం అని తిక్కన బోధించారని అమ్మ అసలైన సంపద అన్న విషయం కూడ తిక్కన భారతంలో తెలియజేసారని చెప్పారు. ఆచార్య ప్రసంగం అసాంతం సాహితీ ప్రియులను అలరించింది. ప్రత్యేక అతిథిగా పాల్గొన్న శ్రీ సాధన విద్యాసంస్థల డైరెక్టర్ వి.ఆర్.కె. ప్రసాద్ మాట్లాడుతూ మార్కాపురంలో ఎలాంటి సాహిత్య కార్యక్రమాలు నిర్వహించేందుకైనా తమ సంస్థ పక్షానా అండనిలుస్తామని హామీ ఇచ్చారు. సభకు అధ్యక్షత వహించిన ఓరుగంటి మల్లిక్ ఆట్లాడుతూ వార్షికోత్సవం నాటికి నెల నెల వెన్నెలను మార్కాపురం డివిజన్ స్థాయిలో ఘనంగా నిర్వహించాలని ఎంపిక చేయబడిన కవితలతో ఒక సంకలనం కూడా తీసుకురావలని ఆకాంక్షించారు. వేదిక కన్వీనర్ కప్పగంతుల మధుసూదన్ నిర్వహణలో జరిగిన ఈ సాహితీ సదస్సు ప్రాచీన సాహిత్యంలోని ఔన్నత్యాన్ని మరోమారు సాహిత్యాభిలాషులకు తెలియబరిచింది. అనంతరం వేదిక కార్యదర్శి కె.వి. రమణారెడ్డి గారి నిర్వహణలో వసివాడుతున్న బాల్యం అనే అంశంపై కవి సమ్మేళనం జరిగింది. "నా పాపం శమించుగాక అంటూ డా॥ అన్నిపురెడ్డి వీరారెడ్డి కవిత్వం, తోట శ్రీనివాసరావు గారి "నేనుకలగంటాను అనే కవితాలాపన గోపాలుని వెంకటేశ్వర్లు గారి "అయ్యోబిడ్డ నన్నుచంపేశారాన్న అలాగే హెచ్. మహేశ్వరాచారి "బందిఖానా లాంటి బాల్యం", మంత్రి కృష్ణ మోహన్ 'ప్రేమ' కవితలు అలరంచాయి. ఇంకా కంభం నుంచి పాల్గొన్న ఎస్. రామసుబ్బయ్య, జి.వి.యస్ రంగయ్య, పద్యకవి ఎమ్.వి. సుబ్బారావు. ఎస్.ఎ. మహబూబ్‌వలి, అశుకవి ప్రత్తిపాటివారు ఆలపించిన కవితలు సభాసదుల హర్షధ్వానులు అందుకున్నాయి. నందవరం శ్రీనివాసుడు సి. చంద్రశేఖర్, పి. శశికుమార్ సాధన సాహితీ సేవలను ప్రశంసించారు.



April 2010 pages _25.03.2010.pmd 46 3/27/2003, 6:35 PM

## మానస - ఉగాది పురస్కారాలు



మానస ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో హైద్రాబాద్ కేంద్ర గ్రంథాలయంలో మార్చి 14న ఉగాది ఉత్సవం జరిగింది. సాహితీవేత్త డా. వి.వి.ఎల్. నరసింహారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎస్వీ యూనివర్సిటీ పూర్వ ఉపాధ్యక్షులు ఆచార్య కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా విచ్చేసారు. ఈ సభలో ఎస్వీ రఘువీరప్రతాప్ రచించిన 'విశ్వరహస్య విశేషం' పుస్తకాన్ని డాక్టర్ కొలకలూరి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఏడాదీ క్రమం తప్పకుండా ఉగాది పురస్కారాలను ప్రతిభావంతులకు ప్రదానం చేయడం అభినందనీయమన్నారు. సంస్కారవంతమైన సంస్థల్లో 'మానస' ఒకటని అభినందించారు. రాష్ట్ర పురావస్తు శాఖ సంచాలకులు ఆచార్య పి. చెన్నారెడ్డి, కోకా వరప్రసాద్, రఘుశ్రీ, రచయిత్రి తమిరిశ జానకి తదితరులు సభలో ప్రసంగించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో విశిష్ట కృషి సల్పుతున్న డాక్టర్ ఈడ్పుగంటి పద్మజారాణి, రచయిత ఎస్. వివేకానంద, కవి సరికొండ నరసింహరాజు, రచయిత్రి స్వాతిశ్రీపాద, కవి జెన్ను రాఘవులు, గుదిబండ వెంకటరెడ్డి, కవి కన్నోజు లక్ష్మీకాంతం, ఆర్. రవిశర్మ, ఎ.వి. జనార్ధనరావు లకు ఉగాది విశిష్ట పురస్కారాలు ప్రదానం చేసి సత్కరించారు. సభా కార్యక్రమానికి ముందు బేబి పి. శృతి ప్రదర్శించిన భరతనాట్యం, మాస్టర్ విశేషసాయి ప్రదర్శించిన కథక్ నృత్యం అదనపు ఆకర్షణగా నిలిచాయి. మానస రఘుశ్రీ, సైపా రాజేశ్వరగుప్త సమన్వయ కర్తలుగా వ్యవహరించారు.



**ఫిబ్రవరి 28న గుంటూరులోని జిల్లా గ్రంథాలయ సంస్థలో మూడో అందం కవితా సంపుటి ఆవిష్కరణ దృశ్యం.**



**ఫిబ్రవరి 20న చెన్నైలో జనని సంస్థ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం. చిత్రంలో గుడిమెట్ల చెన్నయ్య, డాక్టర్ పి. సీతమ్మ, డాక్టర్ నిర్మలా పళని, వి. కృష్ణారావు ఉన్నారు.**



**మార్చి 6న బుక్ రీడింగ్ కల్చరల్ సొసైటీ ఆధ్వర్యంలో పాలమూరు జిల్లా పెబ్బేరులో 'ఎస్.జానకి మధుర గీతాలు' పుస్తకావిష్కరణ దృశ్యం**



**గుంటూరులో డాక్టర్ పరుచూరి రాజారామ్ సాహితీ సత్కారాన్ని కథ, నవలా రచయిత ద్వారక కు అందిస్తున్న శ్రీమతి పి. అజిత. వేదికపై కథ, నాటక రచయిత వల్లూరి శివప్రసాద్, కథా రచయిత పెనుమాక నాగేశ్వరరావు ఉన్నారు.**




**మార్చి 6న హన్మకొండలోని పాల్కురికి సోమనాథుని ప్రాంగణంలో జరిగిన 'తెలంగాణ జంగ్' ఉద్యమ దీర్ఘకవిత–2009 పుస్తకావిష్కరణ.**



April 2010 pages _25.03.2010.pmd 47 3/27/2003, 6:35 PM

# డైరీ



ఫిబ్రవరి **6**న బళ్ళారిలోని రాఘవ కళామందిరంలో జరిగిన డాక్టర్ తుర్లపాటి రాజేశ్వరి తెలుగు కవిత్వ కన్నడానువాదం 'హుణ్ణిమెమర' ఆవిష్కరణ దృశ్యం. చిత్రంలో కె. సురేంద్రబాబు, రామాంజనేయులు, నిష్టి రుద్రప్ప, కె. సుధాకరరావు, గుత్తి (జోళదరాశి) చంద్రశేఖరరెడ్డి, కె. చెన్నప్ప, డాక్టర్ రాజేశ్వరి, యస్వీ. రామారావు ఉన్నారు.



ఫిబ్రవరి **27**న నల్గొండ జిల్లాలోని దుబ్బాకలో 'అక్షరాలు' కవితా సంపుటిని ఆచార్య రవ్వా శ్రీహరి ఆవిష్కరిస్తున్న దృశ్యం. చిత్రంలో యోగాచార్య, డాక్టర్ పి. సుదర్శన్ రెడ్డి, డాక్టర్ కూరెళ్ళ విఠలాచార్య, నరసింహారావు, డాక్టర్ కృష్ణకౌండిన్య, స్వాతంత్ర్య సమరయోధులు వేమవరం మనోహరపంతులు, పుస్తక రచయిత పొనుగోటి నరసింహారావు ఉన్నారు.

## స్పందనలు

## ఏడ్పించిన ఏంజిలో కథ

నెలనెలా ప్రస్థానం ఒకటవ తేదీకే వచ్చి చేతుల్లో వాలుతుంది. మార్చి ప్రస్థానంలో "పడి లేచిన కడలి తరంగం" వ్యాసం బాగుంది. తొలిరోజుల్లో దుర్భరంగా సాగిన ఏంజిలో జీవితం నన్ను ఆశ్చర్యపరచడమే కాకుండా ఏడ్పించింది కూడా. అంతర్జాతీయ కవితా రంగంలో ఆమె పేరు తప్ప సాహిత్యం గురించి తెలియని నాబోటి వాళ్లకు ఈ వ్యాసం ఉపకరిస్తుంది. ఆమెకు జీవితం పట్ల ఉన్న ప్రేమ, కష్టాల్ని అధిగమించే తీరూ, సాహిత్య నిబద్ధత ఆదర్శవంతమైంది. తండ్రి లాంటి ఆమె తల్లి బాయ్‌ఫ్రెండ్ ఏడేళ్ల వయసులో ఆమెను అత్యాచారం చెయ్యడం, బతకడం కోసం కొన్నాళ్లు పడుపు వృత్తిలో గడపడం మన మనస్సుల్ని కలచి కల్లోలపరిచిన సంఘటనలు భూతల స్వర్గంగా కలలు కంటున్న యువతరానికి అమెరికా నిజ స్వరూపాన్ని ఆమె జీవితం విప్పి చెప్పింది. ఒక ప్రత్యేక శైలిలో మనల్ని ఏడిపించి, సాహిత్యాన్ని ఆస్వాదింపచేసి, ఆలోచనలలో ముంచేసిన డాక్టర్ దిలావర్ గారికి ధన్యవాదాలు. నెలనెలా ప్రపంచ సాహిత్యం శీర్షికన ఇలాంటి సాహిత్య పరిచయాలు ఉంటే బాగుంటుంది. డాక్టర్ రాధేయగారు ఏదో ఒక అంశాన్ని తీసుకొని ప్రతినెలా విశ్లేషించడం బాగుంది. అనువాద సాహిత్యాన్ని ప్రచురించి ఇతర భాషల్లోని కవితలు, కథలు తెలుసుకోవడానికి వీలు కల్పిస్తున్న పత్రికా సంపాదకవర్గానికి ధన్యవాదాలు.

**- అల, విజయనగరం**

మార్చి నెల సాహిత్య ప్రస్థానం పత్రికలో డాక్టర్ దిలావర్ గారి 'పడిలేచిన కడలి తరంగం' వ్యాసం చాలా బాగుంది. మాయా ఏంజిలోను గురించి వినడమే కాని పూర్తిగా తెలియదు. ఇప్పుడు చదివిన ఈ వ్యాసం చాలా బాగుంది. ఆమె రాసిన కవితలను చదవలేదు. ప్రస్థానంలో ప్రచురించిన ముఖ్య కవితలు మనసును పట్టివేశాయి. ఆమె జీవిత చరిత్ర కన్నీరు పెట్టించింది. అన్ని కష్టాలు ఎదుర్కొని రచయిత్రిగా పేరు తెచ్చుకోవడం ఎవరికీ సాధ్యం కాదేమో!

సాహిత్యమంటే అభిరుచి వుండటంతో కనిపించిన మంచి పుస్తకాలూ, పత్రికలూ చదవడం నాకు చిన్నతనం నుంచీ అలవాటైంది. చందమామ, బాల వంటి బాలసాహిత్యంతో మొదలై ఈనాటికీ నిరంతర వాహినిగా కొనసాగుతూనే వుంది. ప్రస్థానం వంటి పత్రికలను చూసినప్పుడు సంతోషం కలుగుతుంది.

ముఖ్యంగా పురుషుని కారణంగా పతనమైనా ప్రేమ మూర్తులను ప్రేమించే మనస్తత్వం చాలాగొప్పది. సాధారణంగా దాంపత్య జీవితాల్లో భర్త మంచివాడు కాదనో, తనను హీనంగా చూస్తాడనో భ్రమలో తాత్కాలికమైన బాధలో పురుషులను నిందించే స్త్రీలు ఎక్కువ. అలాకాక తను పతనమై పోడానికి ఒక పురుషుడు కారణమైనా ప్రేమను పంచే మరొక పురుషుడ్ని గుర్తించడం ఆరాధించి, అంకితమవడం మెచ్చుకోతగినది. పురుషుడ్ని అర్థం చేసుకున్న ప్రతిభ అది! మనిషి ఏ దేశస్థురాలైనా, రంగు ఏదైనా మనసు మాత్రం అందరిదీ ఒకలాటిదే అనే భావం మనకు కలుగుతుంది. అవార్డుల పట్ల ఆమె అభిప్రాయాన్ని అందరూ గౌరవించాలి. ఇంత మంచి స్త్రీ మూర్తిని, రచయిత్రిని పరిచయం చేసిన దిలావర్ గారికి, ప్రస్థానం పత్రికకు నా అభినందనలు.

**- ఎ. అన్నపూర్ణ, హైదరాబాద్**

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# కందుకూరి వీరేశలింగం

**16.04.1848 - 27.05.1919**



నవ్యాంధ్ర వైతాళికుల్లో ప్రథములు, సంస్కర్త, వితంతు వివాహాలను ఉద్యమంగా చేపట్టారు. మహిళల విద్యాభివృద్ధికి కృషి చేశారు. సాంఘిక దురాచారాలను ప్రతిఘటించారు. సాహితీ రంగంలో గొప్ప కృషి జరిపారు. పలుపత్రికలు కూడా నడిపి, కొత్త రచయితలను ప్రోత్సహించారు.

SAHITYA PRASATHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.H/SD/415/10-12

## ఉపాధ్యాయులు, తల్లితండ్రులు చదువవలసిన పుస్తకాల జాబితా

| క్ర.సం | పుస్తకం పేరు | వెల | క్ర.సం | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|
| 1. | పిల్లలు నేర్చుకోవడంలో ఎలా వెనకబడతారు? | 60.00 | 13. | పిల్లజెల్ల వెనుక | 25.00 |
| 2. | పిల్లలు ఎలా నేర్చుకుంటారు | 60.00 | 14. | చదువు సంధ్యలు | 25.00 |
| 3. | టీచర్ | 40.00 | 15. | మహోజ్వల స్మృతులు | 35.00 |
| 4. | విముక్తి-విద్య | 40.00 | 16. | మనిషి కథ | 40.00 |
| 5. | టీచర్లకు ఉత్తరం | 40.00 | 17. | [illegible] | 25.00 |
| 6. | మాస్టారూ...! | 10.00 | 18. | పరిణామక్రమంలో విద్యా వ్యవస్థ 1833-2003 | 15.00 |
| 7. | మా బడిలో | 10.00 | 19. | వేదభూమి | 10.00 |
| 8. | కథలే పాఠాలు | 25.00 | 20. | సమాజం-సైన్స్- సంప్రదాయం | 15.00 |
| 9. | బోధన-శోధన | 30.00 | 21. | సైన్సు చరిత్రలో సామాజికాంశాలు | 10.00 |
| 10. | విభిన్న విద్యా సంస్థలు | 25.00 | 22. | పిల్లల అలవాట్లు | 25.00 |
| 11. | భాష-భావం | 20.00 | 23. | భారతదేశ చరిత్ర | 25.00 |
| 12. | మీరు - మీ పిల్లలు | 15.00 | 24 | పిల్లల భాష - ఉపాధ్యాయుడు | 25.00 |

## పిల్లలు చదివే పుస్తకాల జాబితా

| క్ర.సం | పుస్తకం పేరు | వెల | క్ర.సం | పుస్తకం పేరు | వెల | క్ర.సం | పుస్తకం పేరు | వెల |
|---|---|---|---|---|---|---|---|---|
| 1. | మహావిశ్వం మన భూమి | 20.00 | 34. | మూడు కథలు | 10.00 | 67. | [illegible] | 10.00 |
| 2. | అద్భుతలోకం | 25.00 | 35. | [illegible] | 15.00 | 68. | బంగారు జింక | 15.00 |
| 3. | విలియం షేక్స్పియర్ | 15.00 | 36. | [illegible] | 10.00 | 69. | మూడు ఏనుగులు | 15.00 |
| 4. | హైడీ | 20.00 | 37. | [illegible] | 10.00 | 70. | పోలీస్ నేర్పిన పాఠం | 15.00 |
| 5. | విశ్వవిఖ్యాత [illegible] | 15.00 | 38. | అక్షరం పలికింది | 15.00 | 71. | పులి-తాబేలు | 10.00 |
| 6. | విదేశీ కథలు | 15.00 | 39. | [illegible] | 40.00 | 72. | [illegible] | 10.00 |
| 7. | విజ్ఞాన శిఖరాలు | 15.00 | 40. | పిల్లల ప్రశ్న-సైన్స్ జవాబు | 15.00 | 73. | [illegible] | 15.00 |
| 8. | చైనా నీతి కథలు | 15.00 | 41. | [illegible] | 20.00 | 74. | [illegible] | 10.00 |
| 9. | భారతీయ శాస్త్రవేత్తలు | 15.00 | 42. | [illegible] | 30.00 | 75. | [illegible] | 15.00 |
| 10. | అందాల బొమ్మ | 15.00 | 43. | [illegible] | 30.00 | 76. | [illegible] | 10.00 |
| 11. | పిల్లల గణితం | 15.00 | 44. | విశ్వం-విజ్ఞానం | 25.00 | 77. | [illegible] | 10.00 |
| 12. | పిల్లలు-పిడుగులు | 20.00 | 45. | ప్రకృతిలో అద్భుతాలు-విజ్ఞానశాస్త్రం | 45.00 | 78. | [illegible] | 10.00 |
| 13. | సరదా సరదా చదువులు | 15.00 | 46. | కాలిక్యులేటర్ గేమ్స్ | 20.00 | 79. | అడవిలో సింహం | 15.00 |
| 14. | తరగతిలో తమాషాలు | 15.00 | 47. | [illegible] | 10.00 | 80. | సముద్ర నేస్తాలు | 15.00 |
| 15. | వానరుడు - నరావతారం | 25.00 | 48. | [illegible] | 15.00 | 81. | [illegible] | 15.00 |
| 16. | చదువంటే మాకిష్టం | 25.00 | 49. | [illegible] | 30.00 | 82. | కథలంటే మాకిష్టం-1 | 25.00 |
| 17. | [illegible] | 15.00 | 50. | భలేకథలు | 10.00 | 83. | కథలంటే మాకిష్టం-2 | 25.00 |
| 18. | పిల్లల సంరక్షణ | 25.00 | 51. | [illegible] | 15.00 | 84. | [illegible] | 45.00 |
| 19. | అక్షరాలతో ఆటలు | 30.00 | 52. | బుజ్జి పెంగ్విన్ | 20.00 | 85. | [illegible] | 25.00 |
| 20. | నేర్చుకోవడం మాకిష్టం | 20.00 | 53. | రవీంద్రనాథ్ ఠాగూర్ | 15.00 | 86. | [illegible] | 15.00 |
| 21. | కథలంటే మాకిష్టం | 40.00 | 54. | [illegible] | 25.00 | 87. | మంచి అమ్మ | 15.00 |
| 22. | ఆటలంటే మాకిష్టం | 30.00 | 55. | [illegible] | 20.00 | 88. | [illegible] | 25.00 |
| 23. | పాటలంటే మాకిష్టం | 20.00 | 56. | చెట్టు | 15.00 | 89. | కథ కాని కథ | 15.00 |
| 24. | పాడుకొందాం | 25.00 | 57. | చిటపట చినుకులు | 20.00 | 90. | లోకంచుట్టిన వీరుడు | 40.00 |
| 25. | తేటతెలుగు-1 | 30.00 | 58. | [illegible] | 10.00 | 91. | [illegible] | 10.00 |
| 26. | తేటతెలుగు-2 | 30.00 | 59. | గుడ్డు నుంచి పిల్ల | 20.00 | 92. | [illegible] | 20.00 |
| 27. | [illegible] | 10.00 | 60. | [illegible] | 20.00 | 93. | [illegible] | 25.00 |
| 28. | బొటనవేలితో బొమ్మలు | 10.00 | 61. | మన కథ | 20.00 | 94. | [illegible] | 20.00 |
| 29. | [illegible] | 15.00 | 62. | [illegible] | 20.00 | 95. | [illegible] | 15.00 |
| 30. | [illegible] | 25.00 | 63. | రహస్యం | 10.00 | 96. | [illegible] | 25.00 |
| 31. | [illegible] | 20.00 | 64. | ఎద్దు | 20.00 | 97. | హిరోషిమా అగ్నిజ్వాలలు | 25.00 |
| 32. | జంతువుల వింతభాష | 10.00 | 65. | [illegible] | 10.00 | 98. | పెంగ్విన్లు | 20.00 |
| 33. | [illegible] | 10.00 | 66. | [illegible] | 15.00 | 99. | అక్షరాలతో ఆటలు | 15.00 |

# ప్రజాశక్తి బుక్‌హౌస్

1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20. ఫోన్ : 27660013

గమనిక : పై పుస్తకాలు స్కూలు గ్రాంటు నుండి కాని, టీచర్ గ్రాంటు నుండి కానీ మీ స్కూలుకు కొనుగోలు చేసుకోవచ్చును. ప్రజాశక్తి బుక్‌హౌస్, హైదరాబాద్ పేరిట డి.డి./ఎం.ఓ. తీసి పంపవలెను.

**If Un delivered please return to :** Prasthanam, C/o M.H.Bhavan, Plot No. 21/1, Azamabad
Near RTC Kalyanamandapam, Hyderabad - 500 020 (A.P), Ph: 040-27660013, Cell: 9490099059